శుక్రవారం
18•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 113
• పేజీలు : 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




epaper.ntnews.com

# ఎన్ఐఎన్ శతాబ్దికి ప్రత్యేక స్టాంపు



- ఢిల్లీలో విడుదల చేసిన కేంద్రమంత్రి హర్షవర్ధన్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) ప్రారంభించి వంద సంవత్సరాలు పూర్తిచేసుకొన్న సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్రం ప్రత్యేక పోస్టల్ స్టాంపును తీసుకొచ్చింది. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర వైద్యారోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ఈ స్టాంపును విడుదల చేశారు. ఇండియన్ పోస్ట్స్ ద్వారా కార్పొరేట్ మై స్టాంపు పథకం క్రింద సెంటినరీ ప్రత్యేక స్టాంపును అందుబాటులోకి తెచ్చారు. లిమిటెడ్ ఎడిషన్‌లో భాగంగా రూ.5 విలువ గలవి ఐదువేల స్టాంపులు విడుదల చేస్తున్నారు. అదనంగా మరో వేయి షీట్ల స్టాంపులను ఆన్‌లైన్‌లో ఈ-పోస్టాఫీసు ద్వారా విక్రయించాలని నిర్ణయించారు. ఈ ప్రత్యేక స్టాంపును జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద ఎన్ఐఎన్ ప్రదర్శించనున్నది. అలాగే, పోషకాహార శాస్త్రవేత్త డాక్టర్ సీ గోపాలన్‌ను వరించిన ఐసీఎమ్మార్-ఎన్ఐఎన్ వన్‌టైం అవార్డును ఆయన తరపున కుమారుడు డాక్టర్ సారథ్‌గోపాలన్ అందుకొన్నారు. ఈ నెల 3న గోపాలన్ కన్నుమూశారు. ఈ కార్యక్రమంలో భారతీయ ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ బలరాంభార్గవ్, ఐసీఎమ్మార్ అండ్ ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ 'మీసేవ' అద్భుతం

- ఛత్తీస్‌గఢ్ ప్రతినిధి బృందం ప్రశంస

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్రంలో 'మీసేవ' పనితీరు అద్భుతంగా ఉన్నదని ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఐఏఎస్, ఎమ్మెల్యేల బృందం ప్రశంసించింది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కుల ధ్రువీకరణ జారీ ప్రక్రియపై అధ్యయనం చేసేందుకు ఛత్తీస్‌గఢ్ ఎస్సీ, ఎస్టీ అభివృద్ధిశాఖ కార్యదర్శి డీడీ సింగ్, డైరెక్టర్ ముఖేష్‌కుమార్ బన్సాల్ తోపాటు ఎమ్మెల్యేలు రాంపుకార్ సింగ్, భునేశ్వర్ శోభారామ్‌బాగేల్, పుల్లాల్ మొహిలే గురువారం బంజారాహిల్స్‌లోని ఎలక్ట్రో స్టాటిక్ డిశ్చార్జ్ (ఈఎస్డీ) కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం వారు షేక్‌పేటలోని తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి కులధ్రువీకరణ జారీచేయడాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈఎస్డీ కమిషనర్ జీటీ వెంకటేశ్వర్లు రాష్ట్రంలో మీసేవా కేంద్రాల ద్వారా కుల ధ్రువీకరణ ప్రతాల జారీ ప్రక్రియను ఛత్తీస్‌గఢ్ బృందానికి వివరించారు. డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా దేశంలోనే సమర్థంగా పౌరసేవలు అందిస్తున్నామని చెప్పారు. టీ-యాప్ ఫోలియో మొబైల్ అప్లికేషన్ ద్వారా కూడా కులధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పౌరసేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ఛత్తీస్‌గఢ్ బృందం కితాబునిచ్చింది. అనంతరం ఛత్తీస్‌ఘఢ్ అధ్యయన బృందం ఎస్సీ అభివృద్ధిశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా, కమిషనర్ క్రిస్టినాఝడ్ చోంగ్తు, ఎస్సీ అభివృద్ధి శాఖ డైరెక్టర్ పి.కరుణాకర్, ఎస్సీ, ఎస్టీ గురుకులాల కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులతో సమావేశమైంది.



'మీసేవ' పనితీరును తెలుసుకుంటున్న ఛత్తీస్‌గఢ్ ప్రతినిధుల బృందం



# మద్దతు ధర కోసం రూ.7వేల కోట్లు

**ధాన్యానికి రూ.1,835, పత్తికి రూ.5,550 మద్దతు ధర**

- రాష్ట్రవ్యాప్తంగా 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం
- పంటను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించండి
- ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచన

**గజ్వేల్, నమస్తే తెలంగాణ:** రైతులు పండించిన పంటకు మద్దతు ధరను అందించి కొనుగోలు చేసేందుకు సీఎం కేసీఆర్ రూ.7వేల కోట్లు కేటాయించారని, ప్రభుత్వం ధాన్యానికి రూ.1,835, పత్తికి రూ.5,550 మద్దతు ధర అందించనున్నదని ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రకటించారు. రైతులు పంటలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. గురువారం సిద్దిపేట, గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌యార్డుల్లో ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలో ఈసారి రికార్డుస్థాయిలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉన్నదని వెల్లడించారు. సిద్దిపేట జిల్లావ్యాప్తంగా వరి సాగు విస్తీర్ణం పెరిగిందని, సుమారు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉన్నదని, ఇందుకనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు తెలిపారు. గతంలో ఏర్పాటుచేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాలు యథాతథంగా పనిచేస్తాయని చెప్పారు. జిల్లాలో ఈ సీజన్‌లో రెండు లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేశారని, 2.25 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి మార్కెట్‌కు వస్తుందని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామని తెలిపారు. యాసంగికి సబ్సిడీపై ధాన్యం, శనగ, పొద్దుతిరుగుడు, మక్కజొన్న, వేరుశనగ విత్తనాలను అందుబాటులో ఉంచామని, అన్ని రకాల ఎరువులను ముందుగానే దుకాణాల్లో నిల్వ ఉంచినట్టు వివరించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై కశ్మీర్, హర్యానా, పంజాబ్ ప్రతినిధులు పరిశీలించి తమ రాష్ట్రాల్లో అమలుచేయాలని భావిస్తున్నారని చెప్పారు. ఇమామ్, మౌజమ్‌ల గురించి సీఎం కేసీఆర్ తప్ప దేశంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించలేదని గుర్తుచేశారు. గజ్వేల్‌లో రూ.కోటి వ్యయంతో ముస్లిం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని, రూ.2కోట్లతో షాదీఖానా నిర్మాణం పూర్తయిందని, త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ భూపతిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకులు వంగ నాగిరెడ్డి, భూంరెడ్డి, ఎలక్షన్‌రెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, గడా ఓఎస్డీ ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గురువారం సిద్దిపేట మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు

## టీఎస్ఐపాస్‌కు మరింత పదును

- పారిశ్రామిక సంఘాల అభిప్రాయాల సేకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకొంటున్న టీఎస్ఐపాస్‌ను మరింత సమర్థంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఈ విషయంలో పారిశ్రామిక సంఘాల సలహాలు, సూచనలతో ముందుకెళ్లాలన్న మంత్రి కేటీఆర్ నిర్ణయం మేరకు పరిశ్రమల శాఖ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. పరిశ్రమలశాఖ కమిషనర్ అహ్మద్ నదీమ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీఐఐ, ఫిక్కి, టీఐఎఫ్, ఎఫ్ఎస్ఎంఈ తదితర సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. టీఎస్ఐపాస్‌లో భారీ కంపెనీల పెట్టుబడులను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేసేందుకు సీఎంవోలో చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టే ఎమ్మెస్ఎంఈ రంగంలో కొత్తగా ఏర్పాటయ్యే పరిశ్రమలకు కూడా చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

# రైతు ఆత్మహత్యాయత్నం

- పెబ్బేరులో ఘటన.. సర్వేచేసి హద్దులు చూపలేదని ఆరోపణ

ధర్మగంట

**పెబ్బేరు:** తన భూమిని సర్వేచేసి హద్దులు చూపడంలేదని ఆరోపిస్తూ వనపర్తి జిల్లా పెబ్బేరు తాసిల్‌లో గురువారం ఓ రైతు ఆత్మహత్యకు యత్నించారు. ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకోగా, అక్కడే ఉన్న రెవెన్యూ సిబ్బంది నీళ్లు చల్లి కాపాడారు. పెబ్బేరు మండలం చెలిమిల్లకు చెందిన మణెమ్మ పేరిట సర్వే నంబర్ 208/1లో 1.26 ఎకరాల భూమి ఆర్వోఆర్, కొత్త పాస్ పుస్తకంలో నమోదైంది. భూమిని సర్వేచేసి హద్దులు చూపాలని కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని మణెమ్మ కొడుకు ఆంజనేయులుగౌడ్ వాపోయారు. న్యాయంచేయాలని పలుమార్లు తాసిల్దార్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదని, దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు యత్నించినట్టు బాధితుడు తెలిపారు. హద్దులు చూపకపోవడంతో పక్క పొలం రైతులతో గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. గత అధికారుల తప్పిదాల వల్లే ఇలా జరిగిందని, ప్రస్తుత అధికారులు వాస్తవాలను గుర్తించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ విషయంపై తాసిల్దార్ సునీతను వివరణ కోరగా.. గతంలో మోఖా మీదకు వెళ్లి పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చామని చెప్పారు. శనివారం మళ్లీ మోఖా మీదకు వెళ్లి సర్వేచేయించి న్యాయంచేస్తామని తెలిపారు.



ఆత్మహత్యకు యత్నించిన ఆంజనేయులు గౌడ్‌ను పట్టుకొని విలపిస్తున్న తల్లి, పిల్లలు

# రవిప్రకాశ్‌పై మరో కేసు

- నకిలీ ఈమెయిల్స్ సృష్టించి కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం
- వారంరోజుల కస్టడీ కోరుతూ సైబరాబాద్ పోలీసుల పిటిషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌పై నమోదైన మరో కేసులో సైబరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు దర్యాప్తు ముమ్మరంచేశారు. నకిలీ ఈ-మెయిల్ సృష్టించి నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను తప్పుదోవ పట్టించేందుకు రవిప్రకాశ్ ప్రయత్నించారని ఈ ఏడాది మే 6న ఐ ల్యాబ్స్ గ్రూప్ అధ్యక్షుడు టీ కృష్ణప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సెక్షన్ 406 ఐపీసీ, 66-డీ ఐటీ యాక్ట్ కింద కేసు నమోదుచేశారు. ఐల్యాబ్స్ తరపున అప్పటి టీవీ 9 చైర్మన్ శ్రీనిరాజుకు వ్యతిరేకంగా ఏ నటరాజన్ అనే వ్యక్తి పేరిట మెయిల్స్ సృష్టించారు. వాస్తవానికి ఐ ల్యాబ్స్‌లో నటరాజన్ పేరుతో ఉద్యోగి లేరని, ఈ మెయిల్ ఐడీ కూడా నకిలీదేనని కృష్ణప్రసాద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులకు.. నకిలీ వ్యక్తి, నకిలీ మెయిల్ ఐడీని సృష్టికర్త రవిప్రకాశే అని ఆధారాలు లభించాయి. దాంతో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకొని మియాపూర్ కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు రవిప్రకాశ్‌ను వారంపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు పిటిషన్ దాఖలుచేశారు.



మియాపూర్ కోర్టుకు హాజరైన రవిప్రకాశ్

**నిధుల దుర్వినియోగం కేసులో బెయిల్**

నిధులు దుర్వినియోగం చేశారన్న ఆరోపణల కేసులో రవిప్రకాశ్‌కు బెయిల్ లభించింది. ఈ కేసులో నవంబర్ 2 వరకు రవిప్రకాశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు స్టే విధించింది. రూ.లక్ష చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని, హైదరాబాద్ విడిచి వెళ్లకూడదని న్యాయస్థానం ఆదేశించింది.



సదస్సులో మాట్లాడుతున్న చేంజ్ మేకర్ ఆఫ్ రూరల్ ఇండియా పోపట్‌రావు పవార్. చిత్రంలో జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు తదితరులు ఉన్నారు

# దేశానికే ఆదర్శం హివేరీ బజార్

- నీటి ఎద్దడి నుంచి గ్రీన్‌విలేజ్‌గా మారిన మోడల్ గ్రామం
- వాటర్ కన్జర్వేషన్‌కు తెలంగాణ కృషి అభినందనీయం
- చేంజ్ మేకర్ ఆఫ్ రూరల్ ఇండియా పోపట్‌రావు పవార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తీవ్ర నీటిఎద్దడిని అధిగమించి గ్రీన్ విలేజ్‌గా మారిన హివేరీ బజార్ దేశానికే అదర్శ గ్రామంగా మారిందని, షిర్డీకి వచ్చినవారు తప్పకుండా తమ గ్రామాన్ని సందర్శించాలని చేంజ్ మేకర్ ఆఫ్ రూరల్ ఇండియా పోపట్‌రావు పవార్ అన్నారు. తెలంగాణలో ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణాలు చేపడుతున్నారని.. రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉన్నదని తెలిపారు. గురువారం తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాటర్ కన్జర్వేషన్ మేనేజ్‌మెంట్.. హివేరీ బజార్ గ్రామమోడల్‌పై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పోపట్‌రావు మాట్లాడుతూ.. హివేరీలో ఒకప్పుడు తీవ్ర నీటిఎద్దడి ఉండేదని, ఒక్క ప్రభుత్వ ఉద్యోగి కూడా అక్కడికి వచ్చేవారు కాదని తెలిపారు. గ్రామం నుంచి అనేకమంది ఇతర రాష్ట్రాలకు వలసవెళ్లారని చెప్పారు. హివేరీ గ్రామం ఉన్న మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాలో తక్కువ వర్షపాతం ఉంటుందని.. దీనిని దృష్టిలో పెట్టుకుని కురిసిన కొద్దిపాటి వర్షపునీటిని ఒడిసిపట్టేందుకు ముందుగా వాటర్‌షెడ్ల నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. తర్వాత చెక్‌డ్యాంల నిర్మాణం, చెట్ల పెంపకం, పశువుల పెంపకంపై దృష్టి సారించామన్నారు. ప్రస్తుతం గ్రామంలో 80శాతం నీటిలభ్యత ఉన్నదని, 40 నుంచి 50 ఫీట్ల లోతులోనే నీళ్లున్నాయని, తమ గ్రామం ఆక్సిజన్ టూరిజం విలేజ్‌గా రూపాంతరం చెందిందని చెప్పారు. తెలంగాణలో వాటర్ కన్జర్వేషన్ కోసం అవసరమైన సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉంటానని చెప్పారు. జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హివేరీ బజార్ వెళ్లి అక్కడ జరిగిన ప్రతి కార్యక్రమాన్ని తెలుసుకోవాలని సూచించారు. హివేరీ నుంచి వలసవెళ్లిన అనేకమంది తిరిగి వస్తున్నారని రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్‌భగవత్ తెలిపారు.

# సంక్షేమ పథకాలతో సామాజికన్యాయం

- మైనార్టీ సాధికారతకు ప్రాధాన్యం
- సమీక్షా సమావేశంలో ఎస్సీ అభివృద్ధిశాఖ మంత్రి కొప్పుల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సంక్షేమపథకాల అమలుద్వారానే సామాజిక మార్పు, సామాజికన్యాయం సాధిస్తున్నామని ఎస్సీ అభివృద్ధి, మైనార్టీశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆశయాలకనుగుణంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. గురువారం ఆయన హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమశాఖలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్షించారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ మైనార్టీల సాధికారత, పురోగతికి ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు చదువులో రాణించాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వసాయంతో విదేశాలకు వెళ్లి ఉన్నతస్థానాలకు చేరుకున్నవారి వివరాలు సేకరించాలని అధికారులకు సూచించారు. ఎస్సీలు.. చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపన కోసం చేపట్టాల్సిన చర్యలపై త్వరలోనే వివిధ సంస్థలతో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో ప్రభు త్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా, ముఖ్యకార్యదర్శి జగదీశ్వర్, ఎస్సీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కరుణాకర్, మైనా ర్టీ సంక్షేమశాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, గురుకుల విద్యాలయాల కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, షఫిఉల్లా తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమశాఖలపై సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

## ఉద్యానశాఖపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖకు చెందిన ఉన్నతాధికారులతో తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ సమీక్షించారు. కమిషన్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుతం ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖల్లో రెగ్యులర్, ఔట్‌సోర్సింగుల్లో క్యాడర్‌వారీగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలు సేకరించారు. వారి సమస్యలు, రిజర్వేషన్ ఆఫ్ రూల్స్, బ్యాక్‌లాగ్ ఖాళీల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఆయాశాఖల ద్వారా లబ్ధి పొందినవారితోపాటు సబ్సిడీ వివరాలను సేకరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు కిందిస్థాయి వర్గాలకు అందాలని, దళిత, గిరిజనులు అధిక సంఖ్యలో లబ్ధిపొందాలంటే వారికి నైపుణ్య శిక్షణ, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని ఎర్రోళ్ల శ్రీనివాస్ సూచించారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ఎం రాంబల్‌నాయక్, ఎస్ దేవయ్య, నీలాదేవి, సీహెచ్ నర్సింహ్మ, విద్యాసాగర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పామాయిల్ సాగు అభివృద్ధికి కృషి

- 23న రాష్ట్రానికి ఫ్రాన్స్, థాయ్‌లాండ్ శాస్త్రవేత్తలు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు అభివృద్ధిపై ఉద్యానశాఖ దృష్టి సారించింది. ప్రస్తుతం సాగుచేస్తున్న పామాయిల్ పంటలో అధిక దిగుబడులు సాధించేందుకు ప్రపంచంలో నాణ్యమైన అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన వంగడాలను వినియోగించే యోచన చేస్తున్నది. అందులోభాగంగా ఆయిల్‌పామ్ పంటపై పరిశోధనచేస్తున్న సీఐఆర్ఏడీ అనే ఫ్రాన్స్, థాయ్‌లాండ్ దేశాల సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు రాష్ట్రంలో ఈ నెల 23న పర్యటించనున్నారు. ప్రస్తుతం ఆయిల్‌సాగు పరిస్థితి, ఎదుర్కొంటున్న సవాళ్లు, అధిక దిగుబడులు సాధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యవసాయ, ఉద్యానశాఖ, ఆయిల్‌ఫెడ్ ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

# లిక్కర్ షాపులకు నేడు లక్కీ డ్రా

- 2,216 మద్యం దుకాణాలకు 48,401 దరఖాస్తులు
- దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.968 కోట్ల ఆదాయం
- అత్యధికంగా రంగారెడ్డి డివిజన్‌లో 422 షాపులకు 8,892 దరఖాస్తులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ తుది అంకానికి చేరుకున్నది. శుక్రవారం లక్కీ డ్రా ద్వారా 2,216 షాపులకు దుకాణదారులను ఎంపికచేయనున్నారు. ఇందుకోసం అన్నిజిల్లాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 2,216 దుకాణాలకు 48,401 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వానికి రూ.968.02 కోట్ల ఆ దాయం వచ్చినట్టు చెప్పారు. డివిజన్లవారీగా చూస్తే అత్యధికంగా రంగారెడ్డిలోని 422 మద్యం షాపులకు 8,892 దరఖాస్తులు వచ్చాయి. దీం తో ప్రభుత్వానికి రూ.177.84 కోట్ల ఆదాయం సమకూరింది. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలకు పెంచినప్పటికీ మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. 2017లో దరఖాస్తుల ద్వారా రూ.412 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.968.02 కోట్లు సమకూరినట్టు అధికారులు తెలిపారు.

**ఎనిమిది షాపుల డ్రా నిలిపివేత**

నిజామాబాద్ జిల్లాలో ఐదు అంతకంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన మద్యం షాపులకు డ్రా నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. జిల్లాలో బోధన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు, ఆర్మూర్ పరిధిలో మూడు, నిజామాబాద్ పరిధిలోని రెండు షాపుల డ్రాను నిలిపివేయనున్నారు. వ్యాపారులు సిండికేటుకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

**డివిజన్లవారీగావి వరాలు**

| డివిజన్ | దుకాణాలు | దరఖాస్తులు | వసూలు (రూ. కోట్లలో) |
|---|---|---|---|
| రంగారెడ్డి | 422 | 8,892 | 177.84 |
| వరంగల్ | 261 | 8,101 | 162.02 |
| ఖమ్మం | 165 | 7,711 | 154.22 |
| నల్లగొండ | 278 | 7,099 | 141.98 |
| కరీంనగర్ | 266 | 4,013 | 80.26 |
| మహబూబ్‌నగర్ | 164 | 3,383 | 67.66 |
| మెదక్ | 193 | 3,200 | 64 |
| ఆదిలాబాద్ | 163 | 2,956 | 59.12 |
| నిజామాబాద్ | 131 | 1,547 | 30.94 |
| హైదరాబాద్ | 173 | 1,499 | 29.98 |
| మొత్తం | 2,216 | 48,401 | 968.02 |

**డ్రాకు ఏర్పాట్లు పూర్తిచేశాం**

మద్యం షాపుల ఎంపిక కోసం 34 కేంద్రాల్లో లక్కీ డ్రా తీసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్ తెలిపారు. అన్నిజిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీయనున్నట్టు చెప్పారు. ఈ ఏడాదిదరఖాస్తుల సంఖ్య పెరిగిందన్నారు. నవంబర్ ఒకటి నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు.



గోదావరి నుంచి వెలికితీసిన బోటు రెయిలింగ్

## బోటు రెయిలింగ్ లభ్యం

- నేటి మధ్యాహ్నంలోగా బోటును వెలికితీసే అవకాశం

**తూర్పు గోదావరి:** ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కచ్చులూరు వద్ద గత నెల 15న గోదావరిలో మునిగిన రాయల్ వశిష్ట బోటు వెలికితీత ప్రక్రియలో గురువారం పురోగతి కనిపించింది. కచ్చులూరు సమీపంలో బోటును గుర్తించిన ధర్మాడి సత్యం బృందం లంగరు సాయంతో బోటును ఒడ్డుకు చేర్చేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో లంగరుకు బోటు రెయిలింగ్ చిక్కింది. జేసీబీ సాయంతో ఇనుప తాడును బలంగా లాగడంతో బోటు రెయిలింగ్ ఊడి వచ్చింది. ఒడ్డుకు చేర్చిన రెయిలింగ్‌ను చూసిన అధికారులు, ధర్మాడి సత్యం బృందానికి బోటును వెలికితీయగలమన్న నమ్మకం బలపడింది. శుక్రవారం మధ్యాహ్నంలోగా బోటును వెలికితీసే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

# 'రూసా' నిధులు వినియోగించుకోండి

- త్వరలోనే నియామకాలు చేపట్టండి
- వైస్‌చాన్స్‌లర్లకు గవర్నర్ ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా)కు రాష్ట్రంలోని ఏడు విశ్వవిద్యాలయాలు ఎంపికయ్యాయని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ వర్సిటీల వైస్‌చాన్స్‌లర్లను ఆదేశించారు. వీసీలు, అధికారులతో గవర్నర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం గవర్నర్ కార్యాలయ అధికారులు ప్రకటన విడుదల చేశారు. రూసా నిధులను మార్చి 2020 నాటికి పూర్తిగా వినియోగించుకోవాలని తెలిపారు. ఆయా యూనివర్సిటీల్లో నియమాకాలను చేపట్టి ఖాళీలను భర్తీ చేయాలని చెప్పారు. రూసా నిధుల మ్యాచిం గ్ గ్రాంట్ విడుదలకు వీసీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. జేఎన్టీయూహెచ్, ఓయూ, పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ, కాకతీయ, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు వర్సిటీలకు రూసా నిధులు ఉన్నట్టు తెలిపారు.

**తమిళనాడుకు వెళ్లిన గవర్నర్ తమిళిసై**

రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ రెండు రోజుల పర్యటనపై తమిళనాడుకు వెళ్లారు. గురువారం సాయంత్రం 7.30 గంటలకు రాజ్‌భవన్ నుంచి బయలుదేరి తమిళనాడు వెళ్లారు. శుక్రవారం చెన్నైలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. శనివారం కోయంబత్తూరుకు వెళ్లి.. అదేరోజు సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు వస్తారు.

# దళిత ఉద్యమనేత రామలింగం మృతి

**ఖైరతాబాద్:** దళిత ఉద్యమనేత, కవి, రచయిత కే రామలింగం (49) గురువారం నిమ్స్‌దవాఖానలో తుది శ్వాసవిడిచారు. ఆయన ఈ నెల 9న సికింద్రాబాద్ నుంచి ఏపీలోని ప్రకాశం జిల్లాకు రైల్లో వెళ్తుండగా ప్రమాదవశాత్తు పట్టాలమీదపడి తీవ్రంగా గాయపడ్డారు. నిమ్స్‌లో చేర్పించగా చికిత్సపొందుతూ మృతిచెందారు. బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారి మల్లెపల్లి లక్ష్మయ్య, ప్రజాసంఘాల నేతలు విమలక్క, సంధ్య, జీవన్‌కుమార్, దళిత, బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ నిమ్స్ దవాఖానలో ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ప్రకాశం జిల్లా అనంతవరంలో జన్మించిన రామలింగం పలు దళిత, బహుజన ఉద్యమాల్లో పాల్గొన్నారు. రామలింగం హెచ్‌సీయూ విద్యార్థిగా ఉన్నప్పుడే పలు సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారని దళిత, బహుజనఫ్రంట్ జాతీయకార్యదర్శి శంకర్ కొనియాడారు. అట్టడుగు వర్గాల సమస్యలపై ఎన్నో రచనలు చేశారని పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం నియమించిన జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాల్గొన్నారని కొనియాడారు. రామలింగం మృతి దళిత బహుజన సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు.

# రైతన్నను వేధిస్తున్న కూలీల కొరత

- సమయానికి తీయక నేలరాలుతున్న తెల్లబంగారం
- రోజుకు రూ.300 ఇచ్చినా దొరకని పరిస్థితి
- అవస్థలు పడుతున్న పత్తి రైతులు

**యాచారం:** పత్తి రైతును కూలీల కొరత వేధిస్తున్నది. చేతికొచ్చిన పంటను తీసేసమయంలో కూలీలు దొరకక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. చేతికొచ్చిన పంట కండ్ల ముందే నేలపాలవుతుండటంతో తల్లడిల్లిపోతున్నారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తక్కళ్లపల్లి, కొత్తపల్లి, మంథన్‌గౌరెల్లి, నందివనపర్తి, నల్లవెల్లి, తమ్మలోనిగూడ తదితర గ్రామాల్లో పత్తిని ఎక్కువ సాగుచేశారు. పత్తిని తీయడానికి సకాలంలో కూలీలు దొరకకపోవడంతో పంట చేనుపైనే ఉండి వర్షాలకు నల్లబారి పోతున్నది. రోజూ కురుస్తున్న వర్షాలకు చేనుపైనే గింజలు మొలకలు వస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని రోజులు ఇలాగే కూలీలు దొరకకపోతే పత్తి పంట చేనుపైనే ఉండి పూర్తిగా చెడిపోతుందని దిగులు చెందుతున్నారు. పత్తి తీయడానికి రోజుకు కూలి రూ.200 నుంచి రూ.300లు ఇచ్చినా కూలీలు దొరకడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో పత్తి రైతులు కూలీల వద్దకు రోజుకు రెండుమూడుసార్లు తిరుగుతూ బతిమిలాడుకుంటున్నారు. పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాల కంటే కూలీల సమస్య తీవ్రంగా వేధిస్తున్నదని రైతులు వాపోతులన్నారు. వర్షాలకు పత్తి తడవడంతో వ్యాపారులు సైతం రైతులకు గిట్టుబాటు ధర చెల్లించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



వర్షాలకు తడిసిన పత్తిని చూపుతున్న రైతు

**కూలీల కోసం రోజూ తిరుగుతున్న**

పత్తి తీయడానికి రోజూ కూలీల చుట్టూ తిరుగుతున్న. ఒకటిరెండు రోజుల ముందే వెళ్లి మాటతీసుకుంటేనే కూలీలు దొరుకుతున్నారు. కూలీలు రాక పత్తి చేనుపైనే ఉంటున్నది. ఇప్పటికే కొంత నేలరాలిపోగా, కురుస్తున్న వర్షాలకు పత్తి నల్లబారిపోవడంతోపాటు పత్తిలో మొలకలు వస్తున్నాయి. వరసగా కురుస్తున్న వర్షాలకు పత్తికి నష్టం వాటిల్లుతున్నది.
– కృష్ణ,మేడిపల్లి, యాచారం మండలం

## డిసెంబర్ 2 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సికింద్రాబాద్ ఏవోసీ సెంటర్ హెడ్‌క్వార్టర్స్ కోటాలో సాధారణ విధుల సైనికులు, క్లర్క్‌లు, ట్రేడ్‌మెన్ తదితర పోస్టుల భర్తీకి ఈ డిసెంబర్ 2 నుంచి వచ్చే జనవరి 19 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు మిలిటరీ ఉన్నతాధికారులు తెలిపారు. దరఖాస్తుల నమోదు, పూర్తి వివరాల కోసం అభ్యర్థులు ఏవోసీ సెంటర్ హెడ్‌క్వార్టర్స్‌లో సంప్రదించాలని సూచించారు.

## ఏపీలో 'వైఎస్సార్ నవోదయం'

**అమరావతి:** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకొనేందుకు రూపొందించిన 'వైఎస్సార్ నవోదయం' పథకాన్ని గురువారం ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిగూడెంలో ప్రారంభించారు. దీనిద్వారా ఇబ్బందుల్లో ఉన్న పరిశ్రమల రుణాలను ఒకే విడుతలో రీషెడ్యూల్ చేయనున్నారు.

epaper.ntnews.com

శుక్రవారం
18-10-2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW.NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




# ఆర్టీసీ కథ కంచికేనా!

## వాస్తవాలేమిటి?.. అసలు ఏంజరుగుతున్నది?

పీకల్లోతు అప్పులు • ఎడతెగని సంక్షోభం • ఏటా 1200 కోట్ల నష్టం

తెలంగాణ వచ్చిన తర్వాత 67% పెరిగిన జీతాలు • 600% పెరిగిన ప్రభుత్వ నిధులు

అయినా చర్చల మధ్యలో చట్టవిరుద్ధంగా సమ్మెకు తెగింపు

కార్మికుల జీవితాలతో యూనియన్ల చెలగాటం

ఆర్టీసీని కోలుకోలేని దెబ్బతీసిన సంఘాలు • సంస్కరణలకు అడుగడుగునా విఘాతం

సంస్థ ఆదాయ వ్యయాల మధ్య అంతులేని అగాధం

ఆదాయం రూ.4,882 కోట్లు.. ఖర్చు రూ.5,811 కోట్లు

అద్దె బస్సులు లాభాల్లో.. సొంత బస్సులు నష్టాల్లో

రాష్ట్రంలో గణనీయంగా పెరిగిన ప్రైవేటు వాహనాలు

సమ్మెకాలంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ఫలితంగానే ప్రభావం లేని ఆర్టీసీ కార్మికుల సమ్మె

ఆదాయం వచ్చే రోజుల్లో సమ్మె సబబేనా? • పండుగ సీజన్‌లో ఆదాయమార్గానికి దెబ్బ

అంతిమంగా నష్టపోయేది కార్మికులే • ఇది.. స్వయంగా విషం తీసుకోవడమే • కార్మిక సంఘాలకు నిపుణుల హితవు

**ఆర్టీసీ** సమ్మెతో ఇబ్బంది పడుతున్నదెవరు? నష్టపోతున్నదెవరు? కష్టాలు ఎదుర్కొంటున్నదెవరు? భవిష్యత్తులో దీని పర్యవసానాలు అనుభవించేది ఎవరు?! ప్రభుత్వమా? ప్రయాణికులా? ఆర్టీసీ కార్మికులా?.. ఆర్టీసీలో అసలేం జరుగుతున్నది? కనిపిస్తున్న వాస్తవాలేమిటి? కనిపించనివేమిటి? ఎర్రబస్సుకు ఇన్ని కష్టాలెందుకు? పల్లెవెలుగు ఎందుకు ఆరిపోతున్నది?.. గత పదమూడు రోజులుగా రాష్ట్రంలో కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో సర్వత్రా చర్చనీయాంశమవుతున్న కీలక అంశాలు ఇవే! ఒకవైపు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్న సంస్థ కార్మికులు.. మరోవైపు అవసరమైన కీలకమైన సమయంలో రవాణాకోసం ఇబ్బంది పడిన.. పడుతున్న ప్రజలు! అంతా తెలంగాణవారే! ఓ ఐదేండ్ల క్రితం వరకు మా తెలంగాణ మాకు కావాలని త్యాగాలకు తెగించి కొట్లాడినవారే! చారిత్రక ఆందోళనల్లో భాగస్వాములై.. కొత్త చరిత్రను సృష్టించినవారే! అందుకే వారందరికీ సంబంధించిన ఈ సమస్యను మూలాల్లోంచి పరిశీలించాలని 'నమస్తే తెలంగాణ' భావించింది. రాష్ట్రసాధన సమరంలో అక్షరాయుధాలు అందించి, బాధ్యతాయుత పాత్ర పోషించిన స్ఫూర్తితోనే.. కార్మికులు రోడ్డున పడ్డారన్న బాధతోనే.. వాస్తవాలను గణాంకాలతో సహా అన్వేషించింది. ప్రస్తుతం సాగుతున్న ఆందోళన నేపథ్యాన్ని లోతుగా విశ్లేషించింది. ఆ క్రమంలో సమైక్య రాష్ట్ర సమయం నుంచీ పాతుకుపోయిన అనేక విడ్డూరాలు దృష్టికొచ్చాయి. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత ఆర్టీసీని ఆదుకొనేందుకు జరిగిన ప్రయత్నాలు కనిపించాయి. ఒక మహా భయంకరమైన వినాశం అంచుపై ఆర్టీసీ నిలిచి ఉన్న ఆందోళనకర వాస్తవాలూ వెలుగులోకి వచ్చాయి! ఆర్టీసీలో కీలక సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పాయి!

**నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి:**

నిజాంకాలం నుంచి సేవలందిస్తున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ఘన చరిత్రే ఉన్నది. రైల్వేలైన్లు పెద్దగాలేని తెలంగాణలో ప్రజలకు ఆర్టీసీయే పెద్ద దిక్కు. పట్టణాలు, గ్రామాల హద్దులను చెరిపివేస్తూ విస్తృత సేవలందిస్తున్నది. ఆర్టీసీకి రాష్ట్రంలోని 11 రీజియన్లు 24 డివిజన్ల పరిధిలో మొత్తం 97 డిపోలున్నాయి. ఆర్టీసీ సొంత బస్సులు 8,360, అద్దె బస్సులు 2100.. మొత్తం 10,460 బస్సులు సేవలు అందిస్తున్నాయి. వాటిల్లో సగానికిపైగా.. అంటే 6,620 బస్సులు గ్రామీణప్రాంతాల్లో నడుస్తున్నాయి. పట్టణప్రాంతాల్లో 3,840 బస్సులు సేవలందిస్తున్నాయి. ఇందులో 453 ఏసీ బస్సులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సులు తిరిగే రూట్లు మొత్తం 3,692. ఒక్కో బస్సులో సగటున 956 మంది చొప్పున.. రోజుకు దాదాపు కోటిమందిని గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. ఆర్టీసీలో మొత్తం ఉద్యోగులు 49,340. ఇంత పెద్ద శ్రామికశక్తి, ఇంత పెద్ద నెట్‌వర్క్ ఉండి కూడా ఆర్టీసీ నష్టాల్లోకి జారుతున్నది. మొత్తం 97 డిపోలకుగాను 11 డిపోలు మాత్రమే లాభాల్లో నడుస్తుండటమే ఇక్కడ విషాదం. బస్సుల్లో ప్రయాణికుల రద్దీని గమనిస్తే.. ఆర్టీసీకి భారీ ఎత్తున లాభాలు రావాలి. కానీ.. అంతులేని నష్టాలు వస్తున్నాయి. ఎందుకు?

**ఆర్టీసీకే నష్టాలు ఎందుకు?**

ఆర్టీసీ పీకల్లోతు కష్టాల్లో ఉన్నది! కచ్చితంగా చెప్పాలంటే.. గతంలో తీసుకున్న అప్పులు, వాటితోపాటు పీఎఫ్, సీసీఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర రూపాల్లో

మిగతా 4వ పేజీలో




ఆర్టీసీ సమ్మె, సంస్థలో పరిణామాలపై నమస్తే తెలంగాణ లోతైన విశ్లేషణ

- సెప్టెంబర్ వేతనాల బిల్లు రూ.240 కోట్లు
- ప్రస్తుతం యాజమాన్యం వద్ద ఉన్నది రూ.8 కోట్లు
- ఆర్థికమాంద్యంలోనూ బడ్జెట్‌లో ఆర్టీసీకి రూ.550 కోట్లు
- ఇప్పటికే సంస్థకు అందిన రూ.425 కోట్లు

ఆర్టీసీకి మొత్తం అప్పులు రూ.4709 కోట్లు

ఏటా నష్టాలు రూ.1200 కోట్లు

కాలం చెల్లిన బస్సులు 2600

కాలం చెల్లబోతున్నవి 400

కొనాల్సిన కొత్త బస్సులు 3000

వాటికి అయ్యే ఖర్చు రూ.1000 కోట్లు

ఆర్టీసీ గట్టెక్కాలంటే కావాల్సింది.. రూ.6,000 కోట్లు

### నాడెంత? నేడెంత?

గత పదేండ్లలో ఆర్టీసీకి బడ్జెట్ నుంచి ఇచ్చిన నిధులు (రూ.కోట్లలో..)

| | |
|---|---|
| 2009-10 | 66.62 |
| 2010-11 | 75.34 |
| 2011-12 | 189.94 |
| 2012-13 | 186.90 |
| 2013-14 | 193.20 |
| మొత్తం | 712.00 |

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత

| | |
|---|---|
| 2014-15 | 598.61 |
| 2015-16 | 490.32 |
| 2016-17 | 535.83 |
| 2017-18 | 561.20 |
| 2018-19 | 792.39 |
| 2019-20 (26-09-2019 వరకు) | 425.00 |

బడ్జెట్‌లో చెప్పినవి కాకుండా ఇచ్చినవి రూ.850 కోట్లు

మొత్తం: రూ.4253.35 కోట్లు

- రాష్ట్రం ఏర్పడక ముందు ఐదేండ్లతో పోల్చితే, రాష్ట్రం ఏర్పడ్డాక ఐదేండ్లలో తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన నిధులు 597% అధికం



గురువారం హుజూర్‌నగర్‌లో టీఆర్‌ఎస్ బహిరంగ సభా వేదిక వద్ద భారీగా కురుస్తున్న వర్షం

## హుజూర్‌నగర్‌లో సీఎం సభ రద్దు

భారీవర్షం కారణంగా హెలికాప్టర్‌కు అనుమతివ్వని ఏవియేషన్

వెల్లడించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

భారీగా తరలివచ్చి నిరాశతో వెనుదిరిగిన ప్రజలు

కిక్కిరిసిన హుజూర్‌నగర్ వీధులు

8

## పంచాయతీలకు 339 కోట్లు

అక్టోబర్ నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ

8

## ఆఫీస్‌కు హైదరాబాదే అడ్డా

జూలై-సెప్టెంబర్‌లో 41 లక్షల చదరపు అడుగులకు డిమాండ్

9

## అజ్ఞాతంలోనే కల్కి దంపతులు!

ఆశ్రమాలు, ఆస్తులపై రెండోరోజూ కొనసాగిన ఐటీ దాడులు

దక్షిణాది రాష్ట్రాలలో 40 ప్రాంతాల్లో సోదాలు.. రూ.40 కోట్లు స్వాధీనం

హైదరాబాద్‌లో స్టూడియో ఎన్ కార్యాలయం, డబ్ల్యూఎల్ స్ట్రక్చర్స్ తదితర సంస్థల్లో తనిఖీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కల్కిభగవాన్ దంపతులు అజ్ఞాతంలోనే ఉన్నారు. మరోవైపు వారికి చెందిన ఆశ్రమాలు, వ్యాపార సంస్థలపై రెండోరోజైన గురువారం ఆదాయం పన్ను (ఐటీ) అధికారుల దాడులు కొనసాగాయి. దక్షిణాది రాష్ట్రాలలో 40 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు జరిపారు. హైదరాబాద్‌లోని స్టూడియో ఎన్ కార్యాలయంతోపాటు డబ్ల్యూఎల్ స్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిల్మ్‌నగర్‌లోని కల్కిభగవాన్ కుమారుడు కృష్ణకు చెందిన ఆస్తులతోపాటు, ఆయన వ్యాపార భాగస్వాములపై కూడా ఐటీ దాడులు జరిగాయి. స్థానిక ఐటీ అధికారుల సహకారంతో చెన్నైకి చెందిన అధికారుల బృందం ఈ సోదాలు

మిగతా 5వ పేజీలో



కల్కిభగవాన్, ఆయన భార్య పద్మావతి



## లిక్కర్ షాపులకు నేడు లక్కీ డ్రా

2,216 మద్యం దుకాణాలకు 48,401 దరఖాస్తులు

దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.968 కోట్ల ఆదాయం

అత్యధికంగా రంగారెడ్డి డివిజన్‌లో 422 షాపులకు 8,892 దరఖాస్తులు

అత్యల్పంగా హైదరాబాద్‌లో 173 షాపులకు 1,499 దరఖాస్తులు

8



గురువారం సాయంత్రం నిజామాబాద్ నగరంలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

## మూడు జిల్లాల్లో భారీ వర్షం

13 జిల్లాల్లో ఓ మోస్తరు

- మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో పిడుగులు పడి ముగ్గురి దుర్మరణం
- భూపాలపల్లి సింగరేణి గనిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి
- కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో 6 సెం.మీ. వర్షపాతం నమోదు

**ఉపరితల** ఆవర్తన ప్రభావంతో గురువారం సూర్యాపేట, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురువగా, 13 జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. పిడుగుపాటుకు మహబూబ్‌నగర్ జిల్లాలో పత్తి చేనులో కలుపు తీస్తున్న ఇద్దరు కూలీలు, నల్లగొండలో పొలం పనులు చేసుకుంటున్న ఒక యువతి మరణించారు. వర్షానికి కామారెడ్డి జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. భూపాలపల్లి సింగరేణి గనిలోబొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. అత్యధికంగా కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్‌లోనూ పలుచోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి 8.30 వరకు గచ్చిబౌలిలో అత్యధికంగా 2.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలోని పలుచోట్ల ఓ మోస్తరు, మరికొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

వివరాలు 7వ పేజీలో

**చికెన్ ధరలు** (వెన్‌కాబ్) (రూ.)

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 73.00 | రిటైల్ లైవ్ | 95.00 |
| డ్రెస్డ్ | 138.00 | స్కిన్‌లెస్ | 157.00 |

**గుడ్ల ధరలు** (వందకు) (రూ.)

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 370.00 | రంగారెడ్డి | 370.00 |
| మెదక్ | 370.00 | కరీంనగర్ | 373.00 |
| వరంగల్ | 373.00 | చిల్లర ధర | 4.30 |

## దేశవ్యాప్త ఎన్నార్సీకి సన్నాహాలు!



- అక్రమ వలసదారుల తరలింపునకు నిర్బంధ కేంద్రాలు
- ఇప్పటికే కర్ణాటకలో నిర్మాణం
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడి

5

## సత్య నాదెళ్ల వేతనం రూ.305 కోట్లు

2018-19లో 66 శాతం పెరిగిన జీతం

గత ఏడాది రికార్డు స్థాయిలో వృద్ధిచెందిన టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్

9



## సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం

- భారీ వాహనాన్ని ఢీకొన్న బస్సు
- 35మంది విదేశీ యాత్రికుల దుర్మరణం
- మక్కా నుంచి మదీనా వెళ్తుండగా దుర్ఘటన
- ప్రధాని మోదీ, ప్రిన్స్ సల్మాన్ సంతాపం

5



మదీనా రోడ్డు ప్రమాదంలో మంటల్లో దగ్ధమవుతున్న బస్సు

# ఆర్టీసీ కథ కంచికేనా!

మొదటిపేజీ తరువాయి...

ఉన్నవన్నీ కలిపి దాదాపు ఐదువేల కోట్ల రూపాయల వరకు అప్పులున్నాయి. వీటిలో రుణాలుగా తీసుకున్నవి రూ.3,049 కోట్లు, సీసీఎస్, పీఎఫ్ తదితరాలు రూ.1660 కోట్లు ఉన్నాయి. మరోవైపు.. ఇప్పటికే పది లక్షల కిలోమీటర్లు తిరిగిన బస్సులు ఆర్టీసీలో 2,600 ఉన్నాయి. మరో 400 బస్సులు ఆ మైలురాయికి దగ్గరలో ఉన్నాయి. వీటిస్థానంలో కొత్తగా మూడువేల బస్సులు కొనుగోలుచేయటానికి ఎంతలేదన్నా రూ.800 కోట్ల నుంచి వెయ్యి కోట్ల రూపాయల వరకు అవసరం. ఇవి కొనకపోతే ఆర్టీసీ మనుగడ ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యంకాదు. అంటే ఆర్టీసీ గట్టెక్కాలంటే కనీసం రూ.5,700 కోట్ల నుంచి రూ.6,000 కోట్లు కావాలి. కచ్చితంగా సంస్థకు ఇదో పెద్ద గుదిబండే. ఇక సగటున వార్షిక నష్టాలు రూ.1200 కోట్లుగా ఉన్నాయి. ఇవి రోజురోజుకు పెరుగుతున్నాయితప్ప తగ్గడంలేదు. ఎవరు అవునన్నా కాదన్నా ఇవి తిరుగులేని సత్యాలు! కనుక.. ఇవి ఎందుకు వస్తున్నాయి? రుణభారం ఎందుకు పెరుగుతూ పోతున్నది? దీన్ని నివారించేందుకు ఏం చేయాలి? అనేదే ప్రశ్న!

## ప్రభుత్వ నిధులిస్తున్నా నష్టాలే!

ఆర్టీసీకి ఉమ్మడి రాష్ట్రంలోనూ ప్రభుత్వాల నుంచి బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ఇప్పుడూ జరుగుతున్నాయి. 2009-10 నుంచి 2013-14 వరకు.. ఆర్టీసీకి రూ.712 కోట్లు ఇస్తే.. తెలంగాణ సిద్ధించిన తర్వాత.. ఒకప్పుడు రవాణాశాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం, ఆనాడు ఆ సంస్థతో పెనవేసుకున్న అనుబంధం నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ 2014-15 నుంచి ఈ రోజు వరకు ఇచ్చిన మొత్తం రూ.4,253 కోట్లు! వినటానికి ఆశ్చర్యంగా ఉన్నా.. ఇది వాస్తవం. 2009-10లో నాటి సమైక్య ప్రభుత్వం రూ.66.62 కోట్లు ఇస్తే.. 2013-14 నాటికి అది రూ.193 కోట్లుగా ఉన్నది. కానీ.. 2014-15 రూ.598.61 కోట్లు ఇచ్చిన తెలంగాణ ప్రభుత్వం.. ప్రతియేటా నిధులు పెంచుతూ వస్తున్నది. సమైక్య రాష్ట్రంలోని ఐదేండ్ల కేటాయింపులతో పోల్చితే.. గడిచిన ఐదేండ్లలో రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా దాదాపు 600% నిధులు అధికంగా ఇచ్చింది. ఇంతటి ఆర్థికసహకారం ఉన్నప్పటికీ ఆర్టీసీ ఎందుకు ఇంకా నష్టాల్లోనే కొట్టుమిట్టాడుతున్నది? అనేది చర్చించాల్సిన అంశం. బస్సులు ఎక్కే ప్రజలు లేరా? అంటే ఉన్నారు. ఉన్నారు కాబట్టే వివిధ కాంట్రాక్ట్ క్యారియర్లు, ట్రావెల్స్ సర్వీసులు పెద్దసంఖ్యలో నడుస్తున్నాయి. ఇవన్నీ లాభాల్లోనే ఉన్నాయి. రోజురోజుకు తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాయి. వాస్తవానికి సమైక్య రాష్ట్రంలో ఇష్టారాజ్యంగా పర్మిట్లు ఇచ్చిన పరిస్థితి ఉండేది. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాతే కొత్త పర్మిట్లు గణనీయంగా తగ్గిపోయాయి. అయినా ఆర్టీసీ బస్సులు మాత్రం నష్టాలబాట పట్టాయి. అద్భుతమైన సిబ్బంది.. నిపుణులైన డ్రైవర్లు, అత్యంత కనిష్ఠస్థాయి ప్రమాద సగటు.. ఇన్ని ఉన్నా.. ఆర్టీసీ లాభాల బాట పట్టటానికి సతమతమవుతున్నది.

## అద్దె బస్సులు లాభాల్లో.. సొంత బస్సులు నష్టాల్లో

ఆర్టీసీలో యాజమాన్యం బస్సులు 8,360 ఉన్నాయి. మరో 2,100 అద్దె బస్సులు తిరుగుతున్నాయి. గణాంకాలను పరిశీలిస్తే.. ఆర్టీసీ బస్సులు కిలోమీటరుకు రూ.13 నష్టంతో నడుస్తున్నాయి. అంటే.. రోజుకు మూడు కోట్లపైనే నష్టం వాటిల్లుతున్నది. అదే సమయంలో ఆర్టీసీలోని అద్దె బస్సులు కిలోమీటరుకు 75 పైసలు లాభంతో.. రోజుకు 4.72 కోట్ల లాభంతో నడుస్తున్నాయి. ప్రైవేటు బస్సులు సాధించే లాభాలను.. ఆర్టీసీలోనే తిరిగే అద్దెబస్సులు సాధించే లాభాలను ఆర్టీసీ సొంతబస్సులు ఎందుకు సాధించలేకపోతున్నాయనే ప్రశ్న తలెత్తుతున్నది.

## ఐదేండ్లలో 67% వేతనాల పెంపు

తెలంగాణ ఏర్పాటుకు ముందు ఆర్టీసీ కార్మికుల కష్టాలు అన్నీఇన్నీకావు. ఏండ్లు గడిచినా జీతాల పెంపు లేక అనేక ఇబ్బందులకు గురయ్యారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు.. చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఆర్టీసీ కార్మికులకు 44% ఫిట్‌మెంట్ ప్రకటించారు. దానివల్ల సంస్థపై ఏటా రూ.900 కోట్ల అదనపు భారం పడుతున్నది. 2018లో మరో 16% ఐఆర్ ప్రకటించారు. దాని భారం మరో రూ.200 కోట్లు తోడైంది. మొత్తంగా ఈ ఐదేండ్ల వ్యవధిలో ఆర్టీసీ కార్మికులకు తరతమ స్థాయిల్లో 67.04% మేర వేతనాలు పెరుగటం గమనార్హం. ఒకవైపు సంస్థకు అప్పులు, నష్టాలు ఉన్నా.. కార్మికుల వేతన డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందునే ఇది సాధ్యమైంది. వాస్తవానికి దేశంలోని మరే ఆర్టీసీలోనూ ఈస్థాయిలో జీతాలు పెంచలేదు. వెరసి.. ఆ నిర్ణయం చారిత్రాత్మకంగా నిలిచింది. కరువుభత్యం రూపంలో కార్మికులకు మరో రూ.100 కోట్లను సంస్థ చెల్లిస్తున్నది. అయినప్పటికీ మళ్లీ వేతనాల పెంపు డిమాండ్‌ను కార్మికసంఘాలు ముందుకు తేవడంతో సమస్య మళ్లీ మొదటి కొచ్చింది.

## భారీగా పెరిగిన వాహనాలు

ఇప్పుడు పోటీ ప్రపంచం పరుగులు పెడుతున్నది. సాధారణంగా ప్రజలెవరైనా మరింత ఉత్తమ సేవలవైపే మొగ్గు చూపుతారు. అది ప్రైవేటు ట్రావెల్స్ కావచ్చు.. పల్లెల్లో ఆటో సర్వీసులు కావచ్చు! ప్రజలకు రవాణాను మరింత చేరువ చేస్తున్నాయి. రాష్ట్రంలోని పరిస్థితినే గమనిస్తే.. తెలంగాణ రావటానికి ముందటివరకు ఈ ప్రాంతంలో 71 లక్షల వాహనాలు ఉండగా.. ఈ ఐదేండ్లలోనే కొత్తగా అన్ని రకాల వాహనాలు కలిపి సుమారు 50 లక్షలు అదనంగా పెరిగాయి. అంటే మొత్తం కోటీ 21 లక్షల వాహనాలు అయ్యాయి. వీటిలో మోటర్‌సైకిళ్లే 91 లక్షల వరకు ఉన్నాయి. అద్దెకార్లు, ట్యాక్సీ/ మ్యాక్సీ క్యాబ్‌లు సుమారు 1.40 లక్షల వరకు ఉన్నాయి. స్టేజీ క్యారేజ్‌లుగా పర్మిట్లు తీసుకున్న బస్సులు (13 సీట్ల నుంచి 50 సీట్ల సామర్థ్యం ఉన్నవి) 4100 ఉన్నాయి. వీటికి తోడు వివిధ ట్రావెల్ సంస్థలు 1500 బస్సులకు పర్మిట్లు తీసుకొని నడుపుతున్నాయి. ఇక వీటన్నింటితోపాటు ఐదు లక్షల ఆటోలు కూడా ఉన్నాయి. వ్యక్తిగత వాహన వినియోగం పట్టణ ప్రాంతాలతోపాటు.. గ్రామీణ ప్రాంతాల్లోనూ గణనీయంగా పెరిగింది. ఒకప్పుడు ఎక్కడినుంచి ఎక్కడికి వెళ్లటానికైనా ఆర్టీసీ బస్సులే దిక్కు. కానీ.. మారిన పరిస్థితుల్లో, ప్రత్యామ్నాయాలు పెరిగాయి. ఆర్టీసీకి క్యాప్టివ్ ప్యాసింజర్స్ ఇప్పుడు లేరు. హైదరాబాద్‌లో ఒకప్పుడు ఆర్టీసీ బస్సు లేకపోతే ప్రయాణం ఉండేదికాదు. ఇప్పుడు మెట్రో రైలు, ఎంఎంటీఎస్ వంటివి అందుబాటులోకి వచ్చాయి.. ప్రజలకు ఇబ్బందిలేకుండా పోయింది. గతంలో ఆర్టీసీ సమ్మె జరిగిందంటే.. ప్రజారవాణా దాదాపు స్తంభించిపోయేది. ప్రయాణాలు వాయిదా వేసుకునేవారు. జనజీవితం అస్తవ్యస్తమయ్యేది. కానీ.. ప్రస్తుతం తెలంగాణలో 13 రోజులుగా సమ్మె జరుగుతున్నా దాని ప్రభావం కనిపించకపోవటానికి పైన పేర్కొన్న పరిస్థితులు కూడా ఒక కారణం. దీనికితోడు ప్రభుత్వం కూడా అనేక ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంతో ప్రజలకు రవాణాసేవల్లో ఎలాంటి ఆటంకాలు ఎదురుకావటం లేదని రవాణా శాఖ అధికారులు చెప్తున్నారు.

## చట్టవిరుద్ధంగా సమ్మెలోకి

కార్మికసంఘాలు కొందరి ప్రోద్బలంతో సమ్మెకు దిగినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. కార్మికసంఘాల సమ్మె నోటీసు నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం ఒకపక్క చర్చల ప్రక్రియను సుగుమం చేస్తూ సయోధ్య ప్రక్రియ (కన్సిలియేషన్) ప్రారంభించింది. ఇది కొనసాగుతుండగానే యూనియన్లు సమ్మె తేదీని ప్రకటించాయి. ఇది వాస్తవానికి చట్టవిరుద్ధం. సమ్మె చట్టవిరుద్ధమని స్పష్టంగా కనిపిస్తున్నదని హైకోర్టు సైతం వ్యాఖ్యానించడం గమనార్హం. ప్రభుత్వానికి సమ్మె గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రిస్థాయిలో దీనిపై చర్చించి సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిస్థాయి అధికారి నేతృత్వంలో ఒక కమిటీని కూడా వేసింది. కమిటీ యూనియన్లతో సంప్రదింపులు ప్రారంభిస్తే.. ఆర్టీసీని విలీనం చేయాలన్న షరతు పెట్టి.. చర్చకు వెళ్లకుండా సమ్మెకు దిగాయి. ఇది ముమ్మాటికీ చట్టవిరుద్ధమని కార్మికచట్టాలపై అవగాహన ఉన్న నిపుణులు చెప్తున్నారు. దీనికి పూర్తి బాధ్యత.. సమ్మె విషయంలో బాధ్యతారహితంగా వ్యవహరించిన యూనియన్లదేనని అంటున్నారు. సోయిదప్పి వ్యవహరిస్తున్న యూనియన్లు.. కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని, వాటి ఆటలో కార్మికులు పావులుగా మారి.. తమ భవిష్యత్తును, సంస్థ భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చుకుంటున్నారని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## ఆర్టీసీలకు దూరంగా రాష్ట్రాలు

చాలా రాష్ట్రాలు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలను నిర్వహించడం లేదు. మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మణిపూర్ వంటి రాష్ట్రాల్లో రాష్ట్ర రోడ్డు రవాణా వ్యవస్థలు లేవు. పెద్ద రాష్ట్రాలైన బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్న బస్సుల సంఖ్య చాలా తక్కువ. తెలంగాణలో ప్రతి లక్షమంది జనాభాకు 29.44% బస్సులు ఉండగా, బీహార్‌లో 0.21%, పశ్చిమబెంగాల్‌లో 2.43%, ఒడిశాలో 1.09% బస్సులు ఉన్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి. చాలా రాష్ట్రాలు ఆర్టీసీలో సంస్కరణలు చేపట్టినా.. తెలంగాణలో దశాబ్దాల తరబడి వ్యవస్థ కునారిల్లుతూనే ఉన్నది. ఈ సమయంలో కచ్చితంగా ఆర్టీసీలో కొత్త అధ్యాయం మొదలుకావాల్సిందేనని పలువురు నిపుణులు స్పష్టంచేస్తున్నారు. ఇకనైనా ఆర్టీసీలో సంస్కరణలు తీసుకువచ్చి, బయటిపోటీని తట్టుకునేలా సంస్థను తీర్చిదిద్దాలని చెప్తున్నారు. ఇప్పటికీ రవాణాపరంగా ఆర్టీసీకి ఉన్నంతటి నెట్‌వర్క్ మరి దేనికీలేదు. ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడుస్తున్న నేపథ్యంలో సరుకు రవాణా, నగరాలు, పట్టణాల్లో కాలనీలకు సర్వీసులు సహా అనేక ప్రత్యామ్నాయాలపై సంస్థ దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు. సంస్థలో ఎక్కడ లోపాలు ఉన్నాయో గమనించి, వాటిని చక్కదిద్దుకుని, సంస్కరణలు చేపడితేనే సంస్థ మనుగడ సాధించగలుగుతుందని చెప్తున్నారు. ఇందుకు మార్గం సుగమం చేయడమే సంస్థ బంగారు భవిష్యత్తుకు మూలమని అంటున్నారు.




### ఏ రాష్ట్రంలో ఎంత జనాభాకు ఎన్ని బస్సులు

పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ ప్రజా రవాణాకీ రుతెన్నులు...

| రాష్ట్రం | జనాభా (కోట్లలో) | బస్సులు | లక్ష జనాభాకు ఉన్న బస్సులు |
|---|---|---|---|
| బీహార్ | 10.41 | 223 | 0.21 |
| ఒడిశా | 4.2 | 459 | 1.09 |
| జమ్ముకశ్మీర్ | 1.25 | 610 | 4.88 |
| అసోం | 3.12 | 1090 | 3.49 |
| ఉత్తరాఖండ్ | 1.01 | 1246 | 12.34 |
| పశ్చిమబెంగాల్ | 9.13 | 2223 | 2.43 |
| హిమాచల్‌ప్రదేశ్ | 0.69 | 2645 | 38.33 |
| పంజాబ్ | 2.77 | 2748 | 9.92 |
| హర్యానా | 2.54 | 4170 | 16.42 |
| రాజస్థాన్ | 6.85 | 4529 | 6.61 |
| ఢిల్లీ | 1.68 | 4564 | 27.17 |
| కేరళ | 3.34 | 5636 | 16.87 |
| గుజరాత్ | 6.04 | 8845 | 14.64 |
| ఉత్తరప్రదేశ్ | 19.98 | 9577 | 4.79 |
| తెలంగాణ | 3.53 | 10391 | 29.44 |
| ఆంధ్రప్రదేశ్ | 4.94 | 12012 | 24.32 |
| తమిళనాడు | 7.22 | 20509 | 28.41 |
| కర్ణాటక | 6.11 | కేఎస్ఆర్టీసీ- 8038, బీఎంటీసీ- 6161, ఎన్ఈకేఆర్టీసీ -4549, ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీ-5055, మొత్తం: 23803 | 38.96 |
| మహారాష్ట్ర | 11.24 | ఎంఎస్ఆర్టీసీ-21864, బీఈఎస్టీ - 3749, మొత్తం 25613 | 22.79 |

చిన్న రాష్ట్రాలు...

| రాష్ట్రం | జనాభా (కోట్లలో) | బస్సులు | లక్ష జనాభాకు ఉన్న బస్సులు |
|---|---|---|---|
| త్రిపుర | 0.37 | 48 | 1.30 |
| మేఘాలయ | 0.3 | 59 | 1.97 |
| మిజోరం | 0.11 | 49 | 4.45 |
| నాగాలాండ్ | 0.2 | 184 | 9.20 |
| అరుణాచల్‌ప్రదేశ్ | 0.14 | 164 | 11.71 |
| సిక్కిం | 0.06 | 126 | 21.00 |
| గోవా | 0.15 | 569 | 37.93 |
| చండీగఢ్ | 0.11 | 494 | 44.91 |
| అండమాన్, నికోబార్ | 0.04 | 268 | 67.00 |

నోట్- మధ్యప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మణిపూర్ రాష్ట్రాల్లో రాష్ట్ర రోడ్డు రవాణా వ్యవస్థలు లేవు.

నోట్- పెద్ద రాష్ట్రాలైన బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో ఉన్న బస్సుల సంఖ్య చాలా తక్కువ.

## జీతాలు చెల్లించేదెలా?

**ప్రస్తుత** పరిస్థితుల్లో సంస్థ యాజమాన్యం కార్మికులకు, సిబ్బందికి సెప్టెంబర్ నెల వేతనం బకాయి పడి ఉన్నది. ఇందుకు సుమారు రూ.240 కోట్లు అవసరం ఉన్నది. కానీ, ఇప్పటికిప్పుడు (శుక్రవారంనాటికి అందుబాటులో ఉన్న సమాచారం మేరకు) ఆర్టీసీ వద్ద ఉన్న సొమ్ము రూ.8 కోట్లు మాత్రమే. ఇవికూడా రోజువారీ ఖర్చులతో ఎప్పటికప్పుడు క్షీణించిపోతున్నాయి. ఆర్టీసీ.. కార్పొరేషన్ కావటంతో వాళ్ల సొమ్ముతో వాళ్లే జీతాలు, ఇతర ఖర్చులు చెల్లించుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి ఇప్పటికిప్పుడు వచ్చే సొమ్ము, బకాయిలు కూడా ఏమీలేవు. ప్రభుత్వం వివిధ రాయితీలు, బస్సు పాసులు తదితరాలకు ఇచ్చే సొమ్మును కూడా ఎప్పటికప్పుడు ఇచ్చివేసింది. ఇక ఇంతటి ఆర్థికమాంద్యంలోనూ గత బడ్జెట్‌లో ఆర్టీసీ కోసం ప్రత్యేకంగా రూ.550 కోట్లు కేటాయించింది. ఈ సొమ్ములో అక్టోబర్ నాటికి రూ.425 కోట్లను అందించింది. వాస్తవానికి ప్రతి నెల పది, ఇరవై కోట్ల చొప్పున ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. ఆర్టీసీ దుస్థితిని దృష్టిలో పెట్టుకొన్న ప్రభుత్వం.. ఇస్తామన్న సొమ్ములో 77% నిధులను ఇప్పటికే ఇచ్చివేసింది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం నుంచి ఆర్టీసీ కార్మికుల జీతాలకు నిధులు వచ్చే అవకాశం ఏ మాత్రంలేదు. ఆర్థికమాంద్యం దృష్ట్యా ప్రభుత్వం కూడా ఆదుకొనే పరిస్థితి లేదని చెప్తున్నారు. కనుక ఇప్పటికిప్పుడు ఉద్యోగులకు జీతాలు చెల్లించడం ఆర్టీసీకి సాధ్యంకాకపోవచ్చని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని హైకోర్టు.. ట్రిబ్యునల్‌కు నివేదిస్తే చట్టప్రకారం కచ్చితంగా జీతాలు చెల్లించాల్సిందేనని, అందుకు ఆర్టీసీ తన ఆస్తులు అమ్ముకోవటం మినహా మరో మార్గంలేదని వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు బకాయిలు చెల్లించకపోతే బ్యాంకులు ఎన్పీఏలుగా ప్రకటిస్తాయి. ఆ పరిస్థితే తలెత్తితే.. సంస్థ మునగటం ఖాయమని, ఆర్టీసీ కథ ఇక కంచికేనని అంటున్నారు.

## ఆదాయానికి మించి ఖర్చు

మార్చి-2019 వరకు ఆదాయం వివరాలు...(కోట్లలో..)

సంస్థ పూర్తి ఆదాయం.. రూ. 4882

| ఖర్చు | మొత్తం |
|---|---|
| వేతనాలు | రూ. 2829 |
| హెచ్ఎస్‌డీ(డీజిల్) | రూ. 1385 |
| వడ్డీ | రూ. 182 |
| వాహన పన్ను | రూ. 230 |
| ఇతర ఖర్చులు | రూ. 198 |
| తరుగుదల | రూ. 173 |
| నిర్వహణ | రూ. 190 |
| అద్దె చార్జీలు | రూ. 624 |




మొత్తం ఖర్చు: రూ. 5811

నష్టం: రూ. 929

## ఆదాయ వ్యయాల మధ్య అగాధం

**ఏ సంస్థ** మనుగడైనా దాని ఆదాయం.. అది చేసే వ్యయం.. ఈ రెండింటి మధ్య వచ్చే లాభంపై ఆధారపడి ఉంటుంది. కానీ.. ఆర్టీసీ ఆదాయ వ్యయాలను పోల్చినప్పుడు ఒక విచిత్రమైన పరిస్థితి కనిపిస్తుంది. 2019 మార్చి వరకు ఆదాయ, వ్యయాలను విశ్లేషిస్తే.. ఆర్టీసీకి అన్ని రకాల ఆదాయం కలుపుకొని రూ.4,882 కోట్లు ఉంటే.. ఖర్చు 5,811 కోట్లుగా ఉన్నది. అంటే.. సగటున ఆదాయానికి మించి సుమారు 119% వ్యయం కనిపిస్తున్నది. ఇంక లాభం ఎక్కడి నుంచి వస్తుంది? దీనితోపాటు.. ఆర్టీసీ ఆదాయంలో ఎక్కువశాతం జీతాలకే వెళ్లిపోతున్నది. రాష్ట్ర ప్రభుత్వంలో మొత్తం 3,20,992 మంది ఉద్యోగులుంటే, వచ్చే ఆదాయంలో 25.36% మాత్రమే జీతాలకు వెళ్తున్నది. లాభాలబాటలో దూసుకుపోతున్న సింగరేణి సంస్థలో మొత్తం 48,942 మంది ఉద్యోగులు ఉంటే.. వచ్చే ఆదాయంలో 35.08% జీతాల కోసం వెచ్చిస్తున్న పరిస్థితి. మంచి పనితీరు కనబరుస్తున్న విద్యుత్‌రంగ సంస్థల్లోనూ ఇదే తీరు కనిపిస్తుంది. మొత్తం నాలుగు కార్పొరేషన్ల పరిధిలో 48,702 మంది ఉద్యోగులు ఉండగా సుమారు పదిశాతం మాత్రమే జీతాల రూపంలో చెల్లిస్తున్నది. కానీ.. ఆర్టీసీలో మాత్రం గరిష్ఠంగా, ఎక్కడా లేనంత స్థాయిలో 57.95% జీతాలకే చెల్లిస్తుండటం గమనార్హం. రవాణారంగ నిపుణులు ఈ లెక్కలు చూసి ముక్కునవేలేసుకుంటున్నారు. జీతాల తర్వాత భారీగా డీజిల్‌కు వెచ్చిస్తున్నారు. డీజిల్ కోసం ఆదాయంలో రూ.1,385 కోట్లు.. అంటే 28% ఆర్టీసీ ఖర్చుచేస్తున్నది. మూడోస్థానంలో అద్దె చెల్లింపుల కోసం రూ.624 కోట్లు.. అంటే 12.78% చెల్లిస్తున్నట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.

### ముహూర్తం



సూర్యోదయం: 6.10 గంటలకు



సూర్యాస్తమయం: 5.58 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, చతుర్థి ఉదయం 7.28 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: రోహిణి సాయంత్రం 4.58 వరకు, తదుపరి మృగశిర, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: ఉదయం 10.32 నుంచి 11.59 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.30 నుంచి 9.16 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.23 నుంచి 1.09 వరకు, వర్జ్యం: ఉదయం 8.36 నుంచి 10.16 వరకు, తిరిగి రాత్రి 10.44 నుంచి 12.22 వరకు.

# ఆదాయం వచ్చే రోజుల్లో సమ్మె సబబేనా?

**ఎక్కడైనా సరే,** ఏ ఉద్యోగి అయినా సంస్థను కాపాడుకుంటేనే బతుకుదెరువు ఉండేది. కానీ, ఆర్టీసీ కార్మిక సంఘాలవైఖరి భిన్నంగా కనిపిస్తున్నది. సంస్థకు ఆదాయం గరిష్ఠంగా వచ్చే రోజులు (పీక్ సీజన్), సాధారణ ఆదాయం ఉండే రోజులు (ఆఫ్ సీజన్) ఉంటాయి. పండుగదినాలు, సెలవురోజులను పీక్ సీజన్‌గా పరిగణిస్తారు. మరింత ఆదాయం సాధించాలన్న చిత్తశుద్ధి ఉంటే.. పీక్ సీజన్‌లో వీలైనన్ని ఎక్కువ ట్రిప్పులు తిప్పడం ద్వారా సంస్థకు రాబడి పెరుగుతుంది. ఆఫ్‌సీజన్‌లో రద్దీ సాధారణంగా, లేదా తక్కువగా ఉంటుంది కాబట్టి.. అప్పుడు తగ్గే ఆదాయాలను పీక్ సీజన్‌లో నడిపే ట్రిప్పులతో భర్తీచేసుకునేందుకు పెద్ద ఎత్తున అవకాశాలు ఉంటాయి. ఆర్టీసీకి దసరా, బతుకమ్మ పండుగ రోజులు పీక్‌సీజన్. తెలంగాణలో ఇదే పెద్ద పండుగ. ఈ సమయంలో వారంపదిరోజులపాటు ప్రయాణాలు బాగా ఉంటాయి. సాధారణ రోజుల్లో రూపాయి ఆదాయం లభించే చోట.. ఇటువంటి పండుగ సీజన్లలో రూపాయిన్నర ఆదాయం లభిస్తుంది. మొత్తంగా ఈ ఒక్క సీజన్‌లోనే రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు పొందే వెసులుబాటు ఆర్టీసీకి ఉన్నది. కానీ.. ఒకవైపు సంస్థ అప్పుల ఊబిలో, నష్టాల్లో కూరుకుపోయి ఉన్న సమయంలో ఆర్టీసీ కార్మికులు ప్రధాన ఆదాయ వనరుకు దెబ్బకొట్టేలా సమ్మెకు దిగటమే ఆశ్చర్యం కల్గిస్తున్నదని పలువురు అంటున్నారు. సరిగ్గా ఈ నెల నాలుగో తేదీ (శుక్రవారం) అర్ధరాత్రి నుంచే ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగటం గమనార్హం. నిజంగా సంస్థ పట్ల ప్రేమ, అభిమానం ఉన్నవారు, సంస్థకు ఆదాయం లభించే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావించేవారు ఇటువంటి కీలక సమయంలో సమ్మెకు వెళ్లే ఆలోచన కూడా చేయబోరని పలువురు అంటున్నారు. కేవలం తమ పంతం నెగ్గించుకోవాలన్న ఉద్దేశంతో, పండుగ నేపథ్యంలో సమ్మెకు దిగి, ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేయవచ్చునన్న దురుద్దేశంతోనే కార్మికులను కొందరు సమ్మెదిశగా నడిపించినట్టు స్పష్టంగా కనిపిస్తున్నది. దీని వల్ల అంతిమంగా నష్టపోయేది ఆర్టీసీయేనన్న అంశాన్ని కార్మికులు గుర్తించకపోవడం బాధాకరమని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అధిక ఆదాయం వచ్చే రోజుల్లో రాత్రింబవళ్లు పనిచేసి, సంస్థ ఉన్నతికి తమ వంతు కృషిచేసి ఉంటే.. కార్మికుల కోరికలను తీర్చడానికి సంస్థ యాజమాన్యం కూడా సంతోషంగా ఒప్పుకొని ఉండేదేమో! కానీ.. వాస్తవ పరిస్థితులతో పొంతనలేకుండా.. రాజకీయ ప్రయోజనాలతో సమ్మెకు వెళ్లినందునే సమస్య ఇంత జటిలంగా మారిందని అంటున్నారు. వెరసి.. కార్మికులు సంస్థకు వచ్చే ఆదాయాన్ని అడ్డుకున్న ఉద్యోగులుగా మిగిలారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. లాభాలు సంపాదించుకునే సమయంలో సమ్మెకు దిగటం.. తెలిసి స్వయంగా విషం తీసుకోవడంతో సమానమని పలువురు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. యూనియన్లకు సిబ్బంది బతుకుతెరువు మీద బాధ్యత లేదా? అని ప్రశ్నిస్తున్నారు.

### లోకం పోకడ



హెల్మెట్టేకాదు, సీటు బెల్టు లేదు, వెహికిల్‌కు విండోస్ లేవు.. డిక్కీ లేదు, టాప్ లేదు..!

# వృథాతోనే ఆహారం కొరత

- మన దేశంలో 40 శాతం ఆహారం వృథా
- ఆహార వృథాను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో రిఫ్రిజిరేటర్లు ఏర్పాటు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మనిషి మనుగడ సాగించేందుకు కావాల్సిన గాలి, నీరు, ఆహారం.. ఒకప్పుడు స్వేచ్ఛగా లభించినా ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గాలి, నీరు కొంత వరకు అందరికీ అందుబాటులో ఉన్నా.. ఆహారం కోసం చాలా మంది అలమటిస్తున్నారు. ముఖ్యంగా మన దేశంలో ఆకలి సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నదని తాజాగా గ్లోబల్ హంగర్ ఇండెక్స్ (జీహెచ్ఐ) నివేదిక వెల్లడించింది. ఆకలి సమస్య తీవ్రంగా ఉన్న 117 దేశాల జాబితాలో భారత్ 102వ స్థానంలో ఉన్నదని పేర్కొన్నది. మన దేశంలో ఈ పరిస్థితి దాపురించడానికి ఆహార పదార్థాలను వృథాచేయడమే అసలు కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆహారం వృథాను అరికట్టడంలో ప్రతీఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరమున్నదని సూచిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం భారత్‌లో 40 శాతం వరకు ఆహారం వృథా అవుతున్నది. ఇలా వృథా అవుతున్న ఆహారాన్ని డబ్బు రూపంలో మార్చితే.. దాదాపు రూ.50 వేల కోట్లకు చేరుతుందని అంచనా. మన దేశంలో 25 శాతం జనాభా ఆకలితో అలమటిస్తున్నదని, సుమారు 19 కోట్ల మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారని ఇటీవలి ఒక సంస్థ సర్వేలో వెల్లడైంది. పంటలు వ్యవసాయక్షేత్రాల నుంచి రిటైల్ దుకాణాలకు చేరే లోపే 14 శాతం వృథా అవుతున్నదని తేలింది. ఆహార పదార్థాలను నిలువ చేయడం, రవాణా చేయడం వంటి వివిధస్థాయిల్లో కూడా వృథా జరుగుతున్నదని స్పష్టమవుతున్నది.

## హైదరాబాద్ పరిధిలో రిఫ్రిజిరేటర్ల ఏర్పాటు

ఆహారం వృథా కాకుండా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరువ తీసుకొంటున్నది. ఆపన్నులకు ఆహారం అందించడమే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. మిగులు ఆహారాన్ని నిల్వ చేసేందుకు జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎనిమిది ప్రాంతాల్లో రిఫ్రిజిరేటర్లను ఏర్పాటుచేసింది. ఇంటిలో మిగిలే ఆహారాన్ని ఈ పద్ధతి ద్వారా అవసరమైనవారికి అందించే వీలున్నది. దీనితో ప్రజల్లో ఆహారం వృథా చేయకూడదనే అవగాహన కలుగడంతోపాటు, రిఫ్రిజిరేటర్లలో వదిలే ఆహారాన్ని ఆకలితో అలమటించే వారికి అందించేందుకు వీలు కలుగుతుంది. వివాహాలు, ఇతర శుభకార్యాల్లో పెద్ద మొత్తంలో మిగిలిపోయే ఆహారాన్ని అరికట్టాల్సిన అవసరం ఉన్నది. ఎంత తినగలరో అంతే వడ్డించుకోవాలి అనే అవగాహన కల్పించడం ద్వారా ఆహారాలు వృథా కాకుండా చూడవచ్చు. ఇంటిలోగానీ, ఫంక్షన్లల్లోగానీ మిగిలిపోయిన ఆహార పదార్థాలను పారబోయకుండా అన్నార్తులకు అండగా నిలిచే సమాజసేవకులకు సమాచారం అందించడం ద్వారా కొంతమంది కడుపులైనా నింపినవారం అవుతాం.



హైదరాబాద్‌లోని శిల్పారామం వద్ద జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన రిఫ్రిజిరేటర్

## దేశంలో 50 నగరాలకు భూకంపం ముప్పు

ప్రభావిత నగరాల జాబితాలో విజయవాడ.. సేఫ్ జోన్‌లో తెలంగాణ రాష్ట్రం

ఐఐటీ హైదరాబాద్ ఈడీఆర్‌ఐ నివేదిక



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలోని 50 నగరాలు, ఒక జిల్లాకు భూకంపం ముప్పు పొంచి ఉన్నదని ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ఎర్త్‌క్వేక్ డిజాస్టర్ రిస్క్ ఇండెక్స్ (ఈడీఆర్‌ఐ) వెల్లడించింది. తమ నివేదికను నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సంస్థ ప్రచురించినట్లు ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ప్రదీప్ గురువారం తెలిపారు. ఈ జాబితాలో ఏపీలోని విజయవాడ కూడా ఉందన్నారు. దేశంలోని 59 శాతం భూభాగం అధిక భూకంపాలకు గురయ్యే ప్రమాదం ఉన్నట్లు చెప్పారు. మొత్తం 50 నగరాలకుగాను 7 నగరాలలో తక్కువగా, 30 నగరాలలో మధ్యస్థంగా, 13 నగరాలలో తీవ్ర స్థాయిలో భూకంపం ప్రమాదం ఉందని ప్రదీప్ అన్నారు. వీటిలో తెలంగాణకి చెందిన నగరాలు మాత్రం లేవని తెలిపారు.

## అభిజిత్ ఎక్కడ పుట్టారు?

ఆయన పేరు ఎందుకలా ఉంది..

మేఘాలయ గవర్నర్ తథాగత్ రాయ్ అనుచిత ప్రశ్నలు.. మండిపడుతున్న నెటిజన్లు



**షిల్లాంగ్:** నోబెల్ బహుమతి విజేత అభిజిత్ బెనర్జీ భారతీయ మూలాలపై మేఘాలయ గవర్నర్ తథాగత్ రాయ్ అనుచిత ప్రశ్నలు సంధించారు. 'అభిజిత్ బెనర్జీ ఎక్కడ పుట్టారు? అభిజిత్ బెనర్జీ తల్లి మరాఠీ వారైతే, తండ్రి బెంగాలీ. అభిజిత్ తండ్రి పేరు దీపక్ బెనర్జీ. అభిజిత్ మహారాష్ట్రలో పుట్టినట్లయితే, ఆ రాష్ట్ర సంప్రదాయం ప్రకారం తండ్రి పేరును తన పేరు మధ్యలో(దీపక్ అని) అభిజిత్ ఉపయోగించాలి. అంటే అభిజిత్ దీపక్ బెనర్జీ అని పెట్టుకోవాలి. అయితే, ఆయన పూర్తి పేరు అభిజిత్ వినాయక్ బెనర్జీగా ఉన్నది. పేరులో వినాయక్ ఎందుకు వచ్చింది?' అని ప్రశ్నించారు. తథాగత్ ట్వీట్లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఆయన అపరిపక్వతకు నిదర్శనమని నెటిజన్లు మండిపడుతున్నారు.

## బెంగాల్‌లో ఎన్నార్సీ ప్రసక్తేలేదు: టీఎంసీ

**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్నార్సీ అంశం కీలకం కానున్నదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తోసిపుచ్చింది. బెంగాల్‌లో ఎన్నార్సీని చేపట్టే ప్రసక్తే లేదని, ఇందుకు సుప్రీంకోర్టు ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని పేర్కొంది.'అసోం మాదిరిగా బెంగాల్‌లోనూ ఎన్నార్సీని అమలుచేసేందుకు సుప్రీంకోర్టు ఆదేశాలు కానీ, ఎలాంటి ఒప్పందం కానీ లేవు' అని ఆ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

## డబ్బులు అడిగినందుకు.. పెంపుడు సింహాన్ని ఉసిగొల్పాడు..



**ఇస్లామాబాద్, అక్టోబర్ 17:** చేసిన పనికి డబ్బులు అడిగిన ఓ ఎలక్ట్రీషియన్‌పైకి ఓ వ్యక్తి తన పెంపుడు సింహాన్ని ఉసిగొల్పాడు. స్థానికులు సకాలంలో స్పందించి రక్షించడంతో గాయాలతో బయటపడ్డాడు. పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రం షాహదరాలో సెప్టెంబర్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇస్లాం మత శిక్షణ సంస్థకు అలీ రాజా అనే వ్యక్తి సంరక్షకుడిగా ఉన్నాడు. అక్కడ విద్యుత్ మరమ్మతు పనుల కోసం మహమ్మద్ రఫీక్ అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్‌గా సేవలందించాడు. పని పూర్తైన తర్వాత అలీని డబ్బులు అడుగగా ఆగ్రహం చెందిన అతడు రఫీక్‌పైకి తన పెంపుడు సింహాన్ని ఉసిగొల్పాడు. అది దాడి చేయడంతో రఫీద్ భయంతో కేకలు వేశాడు. అరుపులు విన్న స్థానికులు అతడ్ని రక్షించాడు. ఈ ఘటనపై రఫీక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.





మదీనాలో రోడ్డు ప్రమాదం అనంతరం మంటలు చెలరేగి దగ్ధమవుతున్న బస్సు

## సౌదీలో ఘోర రోడ్డు ప్రమాదం

- 35మంది విదేశీ యాత్రికుల దుర్మరణం
- మక్కా నుంచి మదీనా వెళ్తుండగా దుర్ఘటన
- ప్రధాని మోదీ, ప్రిన్స్ సల్మాన్ సంతాపం

**రియాద్:** ముస్లింలు పవిత్ర నగరంగా భావించే సౌదీ అరేబియాలోని మదీనాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 35 మంది విదేశీ యాత్రికులు దుర్మరణం పాలయ్యారు. కాగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సౌదీ పర్యటనకు వచ్చిన విదేశీయులు ప్రయాణిస్తున్న ప్రైవేటు బస్సు బుధవారం రాత్రి ఓ భారీ వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్టు స్థానిక పోలీసులు చెప్పారు. మృతులందరూ అరబ్, ఆసియా దేశాలకు చెందినవారేనని తెలిపారు. వారంతా మక్కా నుంచి మదీనా నగరానికి వెళుతుండగా ఓ భారీ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టిందని చెప్పారు. ప్రమాద తీవ్రతకు బస్సు అద్దాలన్నీ పగిలిపోయి వెంటనే మంటలు అంటుకున్నాయని పోలీసులు వివరించారు. గాయపడిన వారిని అల్ హమ్నా దవాఖానకు తరలించామని చెప్పారు. బాధితులందరూ ఉమ్రాకు వచ్చారని తెలిపారు. హజ్ యాత్ర కాకుండా సంవత్సరంలోని మిగిలిన కాలంలో ముస్లింల పవిత్ర స్థలాలను సందర్శించడాన్ని ఉమ్రా అంటారు. గత ఆగస్టులో జరిగిన హజ్ యాత్ర సందర్భంగా ప్రపంచమంతటి నుంచి దాదాపు 25 లక్షల మంది సౌదీని సందర్శించారు. సౌదీ రోడ్డు ప్రమాదం పట్ల ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నానని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని ట్వీట్ చేశారు. మదీన ప్రాంత గవర్నర్ ప్రిన్స్ ఫైసల్ బిన్‌సల్మాన్ కూడా రోడ్డు ప్రమాదం పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సౌదీలో గత ఏడాది ఏప్రిల్‌లో జరిగినరోడ్డు ప్రమాదంలో నలుగురు బ్రిటన్ పౌరులు మృతి చెందారు. అంతకుముందు 2017 జనవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు బ్రిటన్ పౌరులు దుర్మరణం చెందారు. 2015 సెప్టెంబర్‌లో మక్కాలో ఘోర దుర్ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. హజ్ యాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 2,300 మంది మృత్యువాతపడ్డారు. అంతకుముందు నెలలోనే మక్కాలో నిర్మాణ సంస్థకు చెందిన ఓ క్రేన్ కుప్పకూలి 100 మంది దుర్మరణం చెందారు.

# ఎన్నార్సీకి సన్నాహాలు!

దేశవ్యాప్తంగా అమలుకు తెరవెనుక కసరత్తు

అక్రమ వలసదారుల తరలింపు కోసం నిర్బంధ కేంద్రాలు

ఇప్పటికే కర్ణాటకలో నిర్మాణం

మహారాష్ట్రలోనూ నిర్మించేందుకు స్థల పరిశీలన

2024 సార్వత్రిక ఎన్నికల నాటికి ఎన్నార్సీ పూర్తి: అమిత్‌షా



బనారస్ హిందూ యూనివర్సిటీలో మాట్లాడుతున్న అమిత్‌షా

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:** దేశవ్యాప్తంగా జాతీయ పౌర జాబితాను (ఎన్నార్సీ) అమలుచేసేందుకు బీజేపీ సర్కారు ఇప్పటికే తెరవెనుక కసరత్తు ప్రారంభించినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సంకేతాలిచ్చారు. ముందస్తు సన్నద్ధతలో భాగంగానే దేశవ్యాప్తంగా అక్రమ వలసదారుల కోసం నిర్బంధ కేంద్రాలను (డిటెన్షన్ సెంటర్లను) సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. 'నిర్బంధ ప్రక్రియకు సంబంధించిన విచారణ ప్రక్రియను విదేశీయుల ట్రిబ్యునళ్లు( ఎఫ్‌టీ) నిర్వహిస్తాయి. ప్రభుత్వం చేయాల్సిన పనులు వేరే ఉన్నాయి. ఎఫ్‌టీలకు సంబంధించిన న్యాయ ప్రక్రియ ఇప్పుడే మొదలైంది' అని ఒక జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్‌షా తెలిపారు. అక్రమ వలసదారుల నిర్బంధం కోసం కర్ణాటకలో ఇదివరకే నిర్బంధ కేంద్రాన్ని నిర్మించారనీ, మహారాష్ట్రలోని నవీ ముంబైలో మరో కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని ఎంపికచేశారని వార్తలు వెలువడిన నేపథ్యంలో ఆయన తాజా వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలో బీజేపీనే అధికారంలో ఉన్నది. మోదీ సర్కారు దేశవ్యాప్తంగా ఎన్నార్సీని అమలుచేస్తుందని, అక్రమ వలసదారులను దేశం నుంచి పంపించేస్తుందని షా పదేపదే పేర్కొంటున్న విషయం తెలిసిందే. తాజా ఇంటర్వ్యూలోనూ ఆయన దీన్ని పునరుద్ఘాటించారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయం నాటికి దేశవ్యాప్తంగా ఎన్నార్సీని పూర్తిచేస్తామని ఆయన పేర్కొన్నారు. అక్రమ వలసదారులుగా తేలినవారిని ఏం చేస్తారని ప్రశ్నించగా.. చట్ట ప్రకారం చర్యలు చేపడుతామని బదులిచ్చారు. (బంగ్లాదేశ్‌కు చెందిన) అక్రమ వలసదారులను వెళ్లగొడతామని బీజేపీ పేర్కొంటున్నప్పటికీ.. పొరుగున ఉన్న బంగ్లాదేశ్ వారిని తమ దేశంలోకి అనుమతించడానికి అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో అక్రమ వలసదారుల పరిస్థితి ఏమిటన్న దానిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**మోదీ హయాంలో మూకహత్యలు పెరుగలేదు..**

బీజేపీ హయంలో దేశవ్యాప్తంగా మూకహత్యలు పెరిగాయన్న ఆరోపణలను అమిత్‌షా ఖండించారు. దీనిపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మూకహత్యలను కట్టడి చేసేందుకు ఇప్పటికే చట్టాలు ఉన్నాయని, మళ్లీ ప్రత్యేకించి చట్టం చేయాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల్లో అవగాహన పెంచితే సమస్య పరిష్కారమవుతుందని చెప్పారు. 'గ్రామాల్లో దొంగతనం జరిగినప్పుడు, ప్రజలు ఆ దొంగను పట్టుకుని చావగొట్టిన సందర్భాలు గతంలోనూ జరిగాయి. అయితే ప్రస్తుతం వాటికి రాజకీయ రంగు పులుముతున్నారు' అని ఆయన ఆరోపించారు.

## చరిత్రను తిరగరాయాలి!

- భారత్ కోణంలో మళ్లీ రచించాలి
- చరిత్రకారులకు అమిత్‌షా సూచన

**వారణాసి:** భారత దృక్కోణంలో చరిత్రను తిరగరాయాల్సిన అవసరం ఉన్నదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభిప్రాయపడ్డారు. హిందుత్వ జాతీయవాది వీర్ సావర్కర్‌కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలన్న బీజేపీ డిమాండ్‌పై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో సావర్కర్‌ను సమర్థిస్తూ షా వ్యాఖ్యలు చేశారు. 1857లో నాటి ఈస్టిండియా కంపెనీ పాలనపై జరిగిన సైనిక తిరుగుబాటును తొలి స్వాతంత్ర్యోద్యమ పోరాటంగా పిలిచినది సావర్కరేనని చెప్పారు. ఆయన లేకపోతే ఆ పోరాటాన్ని ఇప్పటికీ తిరుగుబాటుగానే పరిగణించేవారని, బ్రిటిష్ కోణంలోనే మనం దాన్ని చూసేవారమని పేర్కొన్నారు. 'గుప్తవంశ వీరుడు: స్కంధగుప్త విక్రమాదిత్య' అన్న అంశంపై బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో (బీహెచ్‌యూ) రెండు రోజులపాటు నిర్వహించనున్న అంతర్జాతీయ సెమినార్‌ను అమిత్‌షా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవ్వరినీ నిందించకుండా భారత దృక్కోణంలో చరిత్రను తిరగరాయాలని చరిత్రకారులకు సూచించారు. 'స్కందగుప్త విక్రమాదిత్యకు మన చరిత్రలో ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. రోమ్ కూడా పరాజయం పాలైన శత్రువులపై ఆయన పోరాడి విజయం సాధించారు. పూర్వాంచల్ ప్రాంతంలోని ఘాజీపూర్‌లో ఆయన నివసించినట్లు భావిస్తారు. స్కంధగుప్తుడు, చంద్రగుప్తుడు వంటి గొప్ప చక్రవర్తుల గురించి మరింత రాయాల్సిన అవసరం ఉంది' అని షా పేర్కొన్నారు. గుప్తుల కాలాన్ని భారత చరిత్రలో స్వర్ణయుగంగా పరిగణిస్తారు. స్కంధగుప్తుడు హూనాలపై పోరాడినట్లు చెబుతారు. స్కంధగుప్తుడిపై రచించిన ఒక పుస్తకాన్ని అమిత్‌షా ఆవిష్కరించారు. కాగా, బీహెచ్‌యూను స్థాపించిన మదన్ మోహన్ మాలవీయను అమిత్‌షా కొనియాడారు. హిందూ సంస్కృతిని పరిరక్షించడం, ప్రచారం చేయడంలో బీహెచ్‌యూ కీలకపాత్ర పోషించిందని ప్రశంసించారు. కాగా, ప్రధాని మోదీ హయాంలో అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠ పెరిగిందని ఆయన పేర్కొన్నారు.



## సావర్కర్‌కు బదులు గాడ్సేకే ఇవ్వండి

'భారతరత్న' వివాదంపై కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ ఎద్దేవా

**నాగ్‌పూర్:** హిందుత్వవాది సావర్కర్‌కు భారతరత్నను ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతామని మహారాష్ట్ర బీజేపీ శాఖ తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొనడంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఆ పార్టీ నేత మనీశ్ తివారీ నాగ్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ 'గాంధీజీ హత్యకు సావర్కర్ కేవలం కుట్ర పన్నాడు. కానీ గాంధీజీని నాథూరాం గాడ్సే చంపాడు. కాబట్టి భారతరత్న పురస్కారాన్ని సావర్కర్‌కు ఇచ్చే బదులు గాడ్సేకు ఇవ్వాలి. ప్రస్తుతం మనం మహాత్ముడి 150వ జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్నాం. భారతరత్న పురస్కారాన్ని ప్రకటించడానికి ఇదే మంచి తరుణం. వెంటనే కేంద్ర ప్రభుత్వం గాడ్సేకు భారతరత్నను ప్రకటించాలి' అని వ్యంగ్యంగా విమర్శించారు. అనంతరం ఆయన ట్వీట్ చేస్తూ సావర్కర్‌కు భారతరత్న అందజేయాలని కేంద్రాన్ని కోరుతామని మ్యానిఫెస్టోలో పేర్కొన్న మహారాష్ట్ర బీజేపీ శాఖ.. గాడ్సే పేరును ఎందుకు ప్రతిపాదించలేదో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. 'గాంధీజీ 150వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఆయన స్మారకాన్ని, జ్ఞాపకాలను మలినం చేయాలనుకుంటే ఇంకెందుకు ఆలస్యం వెంటనే చేసేయండి. సావర్కర్‌కు భారతరత్నను ఇచ్చుకోండి' అని మనీశ్ తివారీ ధ్వజమెత్తారు. అంతకుముందు మరో కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ మాట్లాడుతూ 'భారతరత్న కోసం ఇప్పుడు సావర్కర్ పేరును ప్రతిపాదించారు.. రేపు గాడ్సే పేరును ప్రతిపాదిస్తారేమో? అని విమర్శించారు.

# మరోసారి మధ్యవర్తిత్వమా?

- అయోధ్య కేసులో మళ్లీ తెరపైకి మధ్యేమార్గం
- సుప్రీంకోర్టుకు సీల్డ్‌కవర్‌ను సమర్పించిన త్రిసభ్య కమిటీ
- కమిటీ ప్రతిపాదనలపై కక్షిదారుల్లో భేదాభిప్రాయాలు

**న్యూఢిల్లీ:** అయోధ్యలోని రామజన్మభూమి–బాబ్రీమసీదు భూ వివాదంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసినప్పటికీ ఓ మధ్యవర్తిత్వ సూత్రం ఆధారంగా కేసుకు పరిష్కారం లభించవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కోర్టు ఈ మధ్యవర్తిత్వ పరిష్కారం వైపు మొగ్గు చూపుతుందా లేక సొంతంగా తీర్పును వెలువరిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇంతకుముందు సుప్రీంకోర్టు సూచనతో ఏర్పడిన మధ్యవర్తిత్వ బృందం ఈ కేసుకు పరిష్కారం చూపడంలో విఫలమైంది. దీంతో సుప్రీంకోర్టు గత ఆగస్టులో ఈ కేసు విచారణను స్వయంగా చేపట్టింది. అయితే బుధవారం కేసు విచారణ ముగిసిన సమయంలో మధ్యవర్తిత్వ బృందం ధర్మాసనానికి సీల్డ్ కవర్‌లో కేసుకు పరిష్కారాన్ని సూచిస్తూ ఒక ప్రతిపాదనను అందజేసింది.

**ప్రతిపాదనలో ఏముంది?**

సుప్రీంకోర్టు మాజీ జడ్జి కలీఫుల్లా నేతృత్వంలోని మధ్యవర్తిత్వ బృందం చేసిన ప్రతిపాదన ప్రకారం.. ఈ కేసును 'ప్రార్థనా స్థలాల చట్టం, 1991' పరిధిలో పరిష్కరించాలి. ఆ చట్టం ప్రకారం, 1947కు పూర్వమే హిందువుల ఆలయాలను కూల్చివేసి.. వాటి స్థానంలో మసీదు లేదా ఇతర ప్రార్థన స్థలాలను నిర్మించి ఉంటే.. సదరు అంశాలను కోర్టుల్లో సవాలు చేయరాదు. అయితే, ఈ చట్టం అయోధ్య వివాదానికి మినహాయింపునిచ్చింది. ఈ నేపథ్యంలో అయోధ్యలోని వివాదాస్పద 2.77 ఎకరాల భూమిపై హక్కును సున్నీ వక్ఫ్ బోర్డు వదులుకుంటుంది. అందుకు బదులుగా అయోధ్యలోని 52 మసీదులలో ప్రభుత్వం పునరుద్ధరణ పనులు చేపట్టాలి. అలాగే మరో ప్రత్యామ్నాయ స్థలంలో వక్ఫ్ బోర్డు మరో మసీదును నిర్మిస్తుంది. అంతేకాకుండా భారత పురావస్తు శాఖ అధీనంలో ఉన్న కొన్ని ఎంపిక చేసిన మసీదుల్లో ప్రార్థనలు చేసుకొనేందుకు వీలుగా వాటిని వక్ఫ్‌బోర్డుకు అప్పగించాలి. ఈ ప్రతిపాదనకు సున్నీ వక్ఫ్‌బోర్డుతోపాటు నిర్వాణి అఖాడీ, నిర్మోహి అఖాడీ, రామ జన్మభూమి పునరుద్ధర్ సమితి మరికొన్ని హిందూ సంస్థలు అంగీకారం తెలిపాయి. కానీ కేసులో ఇతర కక్షిదార్లుగా ఉన్న వీహెచ్‌పీకి చెందిన రామజన్మభూమి న్యాస్, రామ్ లల్లా, మరో ఆరు ముస్లిం సంస్థలు మాత్రం అంగీకారం తెలుపలేదు. మధ్యవర్తిత్వ బృందం ప్రతిపాదించిన పరిష్కారంపై, ఈ వివాదంలో ఒక పక్షం తరపున వాదిస్తున్న ఓ సీనియర్ న్యాయవాది స్పందిస్తూ కోర్టులో విచారణ ముగిసిందని, కాబట్టి ఆ ప్రతిపాదనకు ఎటువంటి విలువ ఉండబోదని పేర్కొన్నారు. కాగా, అయోధ్య మ్యాపును చింపేసిన న్యాయవాది రాజీవ్ దావన్‌పై చర్యలు తీసుకోవాలని సీజేఐ రంజన్ గొగోయ్‌కి హిందూ మతాధికారి ఒకరు లేఖ చేశారు. మరో వైపు, అయోధ్య అంశంలో టీవీల్లో చర్చావేదికలు నిర్వహించి అనవసర ఉద్రిక్తతలు సృష్టించొద్దని న్యూస్ బ్రాడ్‌క్యాస్టింగ్ స్టాండర్డ్స్ అథారిటీ టీవీ చానళ్లకు సూచించింది.



అయోధ్యలో రామ మందిరం నిర్మాణానికి సేకరించిన రాతి శిలలను పరిశీలిస్తున్న సాధువులు

### 45 ఏండ్లుగా న్యాయపోరాటం

సున్నీ వక్ఫ్ బోర్డు లాయర్ జిలానీ వెల్లడి



**లక్నో:** దశాబ్దాలుగా కొనసాగుతున్న అయోధ్య కేసు చివరి దశకు చేరుకున్నది. వచ్చే నెలలో దీనిపై తీర్పు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాగా ఈ కేసు కోసం.. సున్నీ వక్ఫ్ బోర్డు, ఇతర ముస్లిం ఫిర్యాదుదారుల తరపున న్యాయవాది జఫర్యాబ్ జిలానీ 45 ఏండ్లుగా పోరాడుతున్నారు. అయోధ్య కేసు విషయంపై ఆయన మాట్లాడుతూ.. 'ఈ వయసులో అయోధ్య తీర్పు వెలువడుతుండటం నా వ్యక్తిగత జీవితానికి సంతృప్తినివ్వడమే గాకుండా నాకు మరింత ఉపశమనాన్ని కలిగిస్తున్నది' అని అన్నారు. 1975లో వివాదాస్పద రామ జన్మ భూమికి సంబంధించి అలహాబాద్ కోర్టులో కొన్ని పిటిషన్లు దాఖలయ్యాయి. న్యాయస్థానం పరిధులకు అనుగుణంగా ఈ కేసులను లక్నో కోర్టుకు బదిలీ చేశారు. పిటిషన్లను బదిలీ చేయాలన్న ఫిర్యాదుదారుల్లో జిలానీ ఒకరు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సూచనలతో 1977 నుంచి జిలానీ ఈ కేసులో భాగస్వామి అయ్యారు. డిసెంబర్ 6, 1992లో బాబ్రీ మసీదును కరసేవకులు కూల్చివేసిన అనంతరం జిలానీ ఈ కేసులో మరింత చురుగ్గా వ్యవహరించారు. అయోధ్య కేసుపై ఇంత సమయాన్ని కేటాయించినందుకు తాను చింతించట్లేదని జిలానీ పేర్కొన్నారు. అయోధ్య కేసు రోజువారీ విచారణ కారణంగా తన దగ్గర చాలా కేసులు పెండింగులో పడిపోయాయని, వాటిని పూర్తి చేయడమే ఇప్పుడు తనకు ముఖ్యమని ఆయన చెప్పారు.

## బ్రిటన్, ఈయూ మధ్య కొత్త ఒప్పందం

**లండన్, అక్టోబర్ 17:** యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి ఈ నెలాఖరు లోగా వైదొలిగే విషయమై బ్రిటన్‌కు కాస్త ఉపశమనం లభించింది. బ్రిటన్, ఈయూ మధ్య నూతన బ్రెగ్జిట్ ఒప్పందం ఖరారైంది. అయితే, ఈ ఒప్పందాన్ని 28 ఈయూ సభ్య దేశాలు.. బ్రిటన్ పార్లమెంట్, ఈయూ పార్లమెంట్ తప్పనిసరిగా ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ఒప్పందాన్ని బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ స్వాగతించారు. ఈయూ అధ్యక్షుడు జీన్ క్లాడేజంకర్ స్పందిస్తూ.. 'మా మధ్య నెలకొన్న సమస్యల పరిష్కారానికి బ్రిటన్, ఈయూ మధ్య కుదిరిన న్యాయమైన, సమతుల్య ఒప్పందం ఇది' అని పేర్కొన్నారు. తాజాగా ఈయూ, బ్రిటన్ మధ్య కుదిరిన ఈ నూతన ఒప్పందానికి బ్రస్సెల్స్‌లో జరిగే ఈయూ సదస్సులో సభ్య దేశాల ఆమోదానికి సిఫారసు చేస్తున్నట్లు జీన్ క్లాడేజంకర్ తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం ఈయూకు బ్రిటన్ 39 బిలియన్ల పౌండ్లు చెల్లిస్తుంది.


MISSING
కనబడుట లేదు



Sri P. Victor
శ్రీ పి.విక్టర్

Age : 72 years
5' 10" - Memory loss
Diabetic Patient

Please inform where abouts to:

9100147652 / 9603081015



తెలంగాణ ప్రభుత్వం
ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమం యొక్క కమిషనర్ వారి కార్యాలయం : తెలంగాణ : హైదరాబాద్
Rc.No.201/RHS-A/2019 ప్రకటన తేది: 18-10-2019

2019–2021 విద్యాసంవత్సరం కొరకు 1వ సం॥ బహుళ కార్యార్థ ఆరోగ్య కార్యకర్తలు (మహిళలు)/ ANM శిక్షణా కార్యక్రమం నందు ప్రవేశం కొరకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరబడుతున్నవి. అడ్మిషన్ దరఖాస్తుల యొక్క ఆన్‌లైన్ యొక్క దాఖలు: తేది: 18–10–2019 నుండి 31–10–2019. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు యొక్క చివరి తేది: 31–10–2019. డౌన్‌లోడ్ చెయ్యబడిన అడ్మిషన్ దరఖాస్తుల దాఖలు యొక్క చివరి తేది: 31–10–2019, ఎంపిక ప్రక్రియ పూర్తి చేయు తేది 11–11–2019, తరగతుల ప్రారంభం : 16–11–2019 నుండి. వివరమైన నోటిఫికేషన్ మరియు ఆన్‌లైన్ దరఖాస్తు CH & FW అధికారిక వెబ్‌సైట్ అనగా http://chfw.telangana.gov.in నందు లభిస్తుంది.

సం/– డా॥ యోగితా రాణా, I.A.S., కమిషనర్, ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమం
DIPR RO No. 1396-DP/CL/Advt/1/2019-20, Dt: 17/10/2019



CPGET - 2019
DIRECTORATE OF ADMISSIONS
OSMANIA UNIVERSITY, HYDERABAD-7

NOTIFICATION

All the qualified candidates of CPGET-2019 for M.Ed. & M.P.Ed., courses are hereby informed that the Final Phase of certificate verification will be held on 25-10-2019 and exercising of web options will commence from 26-10-2019. All the candidates have to exercise their web options freshly for possible sliding and for new admissions. Further, the NCC category candidates for all courses the Second Phase certificate verification will be held on 25-10-2019.

The web options for newly added courses History and Political Science of Telangana University will be open upto 20-10-2019.

For detailed notification visit the websites: www.cv.ouadmissions.com ; www.ouadmissions.com or www.osmania.ac.in .

17.10.2019 HYDERABAD — Prof. N. KISHAN, Convener, CPGET-2019


## అజ్ఞాతంలోనే కల్కి దంపతులు!

మూడోపేజీ తరువాయి...

నిర్వహించింది. మణికొండలోని పంచవటి కాలనీలో ఉన్న స్టూడియో ఎన్ చానల్‌ను నటుడు జూనియర్ ఎన్టీఆర్ మామ నార్నే శ్రీనివాసరావు నుంచి 2014లో కల్కి భగవాన్ కొనుగోలు చేశాడు. ఈ నేపథ్యంలో ఐటీ అధికారులు ఈ సంస్థలో తనిఖీలు చేశారు.

**ఐదెకరాల నుంచి ప్రారంభమై....**

కల్కిభగవాన్ ఆశ్రమం ఐదెకరాల నుంచి ప్రారంభమై వేలాది ఎకరాలకు విస్తరించింది. ఆశ్రమంలో దాదాపు 1500 మందికిపైగా సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి ఏటా సిబ్బందికి జీతభత్యాలు చెల్లిస్తూ క్రమం తప్పకుండా పన్నులు చెల్లిస్తూ, ఐటీ రిటర్న్ దాఖలు చేస్తున్న కల్కిభగవాన్ గత మూడేండ్లుగా పన్నులు చెల్లించడం లేదని, ఐటీ రిటర్న్స్ కూడా దాఖలు చేయడం లేదని సమాచారం. అలాగే సంస్థలకు ఉన్న కల్కి పేరును కూడా మార్చారు. 'ఏకం'తో పాటు పలురకాల కంపెనీలు, ట్రస్టీల పేర్లతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐటీ అధికారులు కల్కి ఆశ్రమంపై నిఘా పెట్టారు. చెన్నైలోని ప్రధాన కార్యాలయంతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అనుబంధ ఆశ్రమాలు, కార్యాలయాలు, భూముల కొనుగోళ్లు, విరాళాల సేకరణలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. చిత్తూరు జిల్లా వరదయ్యపాలెంలోని కల్కిభగవాన్‌కు చెందిన ప్రధాన ఆశ్రమం తమిళనాడు పోలీసుల పహారాలో ఉన్నది. అజ్ఞాతంలోకి వెళ్లిన కల్కిభగవాన్, ఆయన భార్య పద్మావతి రెండో రోజుకూడా బయటకు రాలేదు. చెన్నైలోని నుంగంబాకం ప్రధాన కార్యాలయంలో కల్కిభగవాన్ కుమారుడు కృష్ణ, కోడలు ప్రీతిని ఐటీ అధికారులు విచారిస్తున్నారు. వరదయ్యపాలెం, బీఎన్ కండ్రిగ మండలాల్లో ఉన్న ఆశ్రమాల నిర్వాహకుడు లోకేష్‌దాసాజీతో పాటు మరికొంత మంది సిబ్బందిని కూడా రహస్యంగా విచారించారు. ఈ విచారణలో వందల కోట్ల విలువైన అక్రమ ఆస్తుల సమాచారాన్ని రాబట్టినట్లు తెలిసింది. బినామీల పేరుతో వేల ఎకరాల భూముల అమ్మకాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు సుమారు రూ.40 కోట్ల భారతీయ, విదేశీ నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

**'ఏకం' పేరుతో కార్యాకలాపాలు**

2008లో వరదయ్యపాలెం బత్తల వల్లంలో నిర్మించిన 'గోల్డెన్‌సిటీ' ప్రారంభోత్సవ కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాటలో ఐదుగురు మృతిచెందగా, అనేక మంది గాయపడ్డారు. దీంతో కొన్ని రోజులు ఆశ్రమం మూతపడింది. తిరిగి కొన్నాళ్లకు ఆశ్రమ కార్యకలాపాలు ప్రారంభించినా, వివాదాలు పెద్దఎత్తున రావడంతో కల్కి పేరును మార్చినట్లు తెలిసింది. కల్కి ఆలయాన్ని గోల్డెన్ సిటీగా, ఆ తరువాత 'వన్నెస్'గా మార్చారు. ప్రస్తుతం 'ఏకం' పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. కల్కి ట్రస్ట్ పేరుతో జరిపే ఆర్థిక లావాదేవీలను కొన్నాళ్లకు 'గోల్డెన్ షెల్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో నిర్వహిస్తున్నట్లు తెలుస్తున్నది.

## ఉగ్రచెరలో కశ్మీర్ యాపిల్!

- పండ్ల వ్యాపారంపై పడగనీడ
- స్థానికేతరులను లక్ష్యంగా చేసుకుంటున్న ముష్కరులు
- రెండు రోజుల్లో ముగ్గురి హత్య
- పండ్లు కొనే వ్యాపారులు లేక బోసిపోతున్న మార్కెట్లు



దక్షిణ శ్రీనగర్‌లోని ఉయాన్‌లో కోసేవారు లేక రాలిపోయిన యాపిల్‌పండ్లు

**శ్రీనగర్, అక్టోబర్ 17:** కశ్మీర్ యాపిల్.. దేశంలోని ఇతర ప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉన్న అనేక రకాల పండ్లలో అది ఒకటి. కానీ కశ్మీరీలకు అదే జీవనాధారం. కశ్మీరీలు అక్టోబర్ నెల కోసం ఏడాదంతా ఎదురుచూస్తుంటారు. ఈ నెలలో వారికి యాపిల్స్ పంట చేతికొస్తుంది. అక్టోబర్ నెల వచ్చిందంటే.. దేశమంతటి నుంచి వేల సంఖ్యలో లారీలు, ట్రక్కులు కశ్మీర్‌కు క్యూ కడుతాయి. కానీ ఈ ఏడాది అక్టోబర్ నెల అటు కశ్మీరీలకు.. ఇటు వ్యాపారులకు పీడకలగా పరిణమించింది. తమ పంటను అమ్మేందుకు స్థానిక యాపిల్ రైతులు సిద్ధంగా ఉన్నా కొనేవారెవరూ ముందుకు రావడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఉగ్రవాదులు సృష్టిస్తున్న భయోత్పాతమే. ఉగ్రవాదులు 48 గంటల వ్యవధిలో ముగ్గురు సామాన్య పౌరులను పొట్టనబెట్టుకోవడం.. ఆ ముగ్గురు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో వ్యాపారులు కశ్మీర్‌వైపు తొంగిచూసేందుకు కూడా భయపడుతున్నారు. ఈ నెల 14న షోపియాన్‌లో రాజస్థాన్‌కు చెందిన ఓ వ్యాపారి తన లారీలో యాపిల్స్ నింపుకుంటుండగా ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఆ లారీని రైతు ఇంటి నుంచి దూరంగా తరలించిన ఉగ్రవాదులు తొలుత డ్రైవర్‌ను కాల్చి చంపారు. ఆ తరువాత లారీకి నిప్పు పెట్టారు. ఈ నెల 16న పుల్వామాలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ ఇటుకబట్టీ కార్మికుడిని ఉగ్రవాదులు పొట్టనబెట్టుకున్నారు. అదే రోజు షోపియాన్‌లో పంజాబ్‌కు చెందిన ఓ యాపిల్ వ్యాపారిని కాల్చి చంపారు.



శ్రీనగర్‌లో మూతపడిన యాపిల్ మార్కెట్

**డీలాపడిన యాపిల్ రైతు**

వరుస హత్యలు కశ్మీర్ యాపిల్ మార్కెట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. షోపియాన్ పండ్ల మార్కెట్‌కు చెందిన మొహమ్మద్ అశ్రఫ్ మాట్లాడుతూ, 'ఎగుమతుల కోసం మేము ఇతర రాష్ట్రాల ట్రాన్స్‌పోర్టర్లపై ఆధారపడుతుంటాం. కానీ, ఇప్పుడు ఇక్కడికి రావడానికి అందరూ భయపడుతున్నారు' అని చెప్పారు. షోపియాన్ యాపిల్ మార్కెట్‌లో స్థానికులకు చెందినవి 215 ట్రక్కులు ఉన్నాయి. కానీ ఈ సీజన్‌లో తమకు 8 వేలకు పైగా ట్రక్కులు అవసరమని అశ్రఫ్ చెప్పారు. ఉగ్రవాదుల భయానికి తాము చెట్ల నుంచి పండ్లు కూడా కోయలేకపోతున్నామని మరికొందరు రైతులు వాపోయారు. పండ్లు కోయడానికి కూలీలకు గతేడాది తాము రోజు రూ.550 చెల్లించామని, కానీ ఈసారి రూ.900 చెల్లించినా ఉగ్రవాదుల భయానికి ఎవరూ రావడం లేదని చెప్పారు.


GITAM
(DEEMED TO BE UNIVERSITY)
(Estd. u/s 3 of the UGC Act, 1956)
VISAKHAPATNAM ■ HYDERABAD ■ BENGALURU
A+ Grade

NOTIFICATION

10th CONVOCATION
(For Candidates of Hyderabad Campus only)

The Convocation for Candidates who have qualified for the award of Degrees/Diplomas during 2018-19 from Hyderabad Campus of GITAM (Deemed to be University) will be held on Friday, the 15th November, 2019 at its Campus in Rudraram, Hyderabad-502329.

Last date for submission of applications : 02-11-2019
With late fee : 06-11-2019

For further details, please visit www.gitam.edu

Visakhapatnam
Date: 16-10-2019
REGISTRAR



మన ఆర్థికవ్యవస్థ మందగమనం భీతిగొల్పుతున్నది. అది మునుముందు 5.5 నుంచి 6 శాతానికి పడిపోతుంది. ప్రభుత్వం చెబుతున్న స్థాయిలో ఆర్థికాభివృద్ధి ఉండాలంటే వృద్ధిరేటు 8 నుంచి 10 శాతం నమోదు కావాలె. అప్పుడే ఉద్యోగ కల్పన సాధ్యం.

**డాక్టర్ మన్మోహన్ సింగ్, మాజీ ప్రధాని**

మనం తప్పకుండా ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థకు చేరుకుంటాం. 2020-21లో వృద్ధిరేటు 8 నుంచి 8.5 శాతానికి చేరుకుంటుంది. ఆర్థిక మందగమనం గురించి కలత చెందాల్సిన పనిలేదు.

**రాజీవ్‌కుమార్, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్**



**చరిత్రలో నేడు**



1386

హైడెల్‌బెర్గ్ యూనివర్సిటీ ప్రారంభం.

1967

వాల్ డిస్నీ 'జంగిల్ బుక్' సినిమా విడుదల.





2007

బేనజీర్ భుట్టోపై మానవబాంబుల దాడి. గాయాలతో బయటపడ్డ భుట్టో.

అమెరికా, చైనా తమ వాణిజ్యయుద్ధాన్ని విరమించడానికి అంగీకారానికి వచ్చినట్టు తెలుస్తున్నది. చైనాపై ఆంక్షల వల్ల అమెరికా రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ట్రంప్ చైనాతో ఒప్పందానికి రావలసి వస్తున్నది. అయితే రెండుపక్షాలు జాగ్రత్తగా వ్యవహరించాలె. అంగీకారానికి వచ్చినప్పటికి ఒప్పందం కుదరకుండా చర్చలు విఫలం కావడం గతంలో అనేకసార్లు జరిగింది. ఈ వాణిజ్య యుద్ధ ప్రభావం జపాన్ మీద కూడా పడ్డది. అందువల్ల రెండు దేశాల మధ్య సయోధ్య కుదురడం జపాన్‌కు సంతోషంగా ఉన్నది.

**ది జపాన్ టైమ్స్**

దేశంలోకి వలసలను ప్రోత్సహించే విషయంలో కెనడాలోని లిబరల్, కన్సర్వేటివ్ పార్టీల వైఖరి ఒకేవిధంగా ఉన్నది. దేశంలోకి నైపుణ్యం గల కార్మికులు రావడం వల్ల దేశ ఆర్థికవ్యవస్థ మెరుగుపడుతుందనేదే రెండు పార్టీల వైఖరి. ప్రైవేట్ స్పాన్సర్‌షిప్ ద్వారా వచ్చే వలసపై పరిమితిని ఎత్తివేస్తామని కన్సర్వేటివ్స్ అంటున్నారు. దరఖాస్తు రుసుం ఎత్తివేస్తామని లిబరల్ పార్టీ వారు అంటున్నారు. ఎవరు అధికారానికి వచ్చినా కాపలా లేని అమెరికా సరిహద్దు మీదుగా వలసలు సాగడం పెద్ద సమస్యగా ముందుకు వస్తుంది. ట్రంప్ విధానాల వల్ల చాలామంది కెనడాకు వస్తున్నారు.

**ది గ్లోబ్ అండ్ మెయిల్**



# ఐరాస సంక్షోభం

ప్రపంచ శాంతి పరిరక్షణకు, దేశాల మధ్య సౌహార్ద్ర సంబంధాలకు, సామాజిక పురోగతికి, సాంస్కృతిక వికాసానికి వేదికగా భాసిల్లుతున్న ఐక్యరాజ్యసమితికి సిబ్బంది జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి దాపురించడం ఆందోళనకరం. సభ్యదేశాలు తమ వాటా మొత్తం చెల్లించకపోవడం, ఆలస్యంగా ఇవ్వడం వంటి కారణాల వల్ల ఐక్యరాజ్యసమితి తన కార్యకలాపాలను నిర్వహించుకోలేకపోతున్నది. ఇప్పటికే ఏసీలు, హీటర్ల వాడకంపై పరిమితులు విధించడం, ఎస్కలేటర్లు నిలిపివేయడం, డాక్యుమెంట్లు ముద్రించకపోవడం వంటి అనేక పొదుపు చర్యలు తీసుకున్నారు. ప్రయాణాలు, సమావేశాలు కూడా రద్దుచేసుకోవడం వల్ల సమితి సమర్థత దెబ్బతింటున్నది. ఆర్థికంగా ఇదే పరిస్థితి కొనసాగితే డిసెంబర్ నుంచి సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి కూడా సొమ్ము ఉండదు. గతేడాది నుంచి మిగులు నిధులన్నీ ఖర్చయిపోతున్నాయి. సమితి గతేడాది 488 మిలియన్ డాలర్ల లోటును ఎదుర్కొన్నది. ఈ ఏడాది లోటు ఇంకా ఎక్కువే ఉంటుందని అంచనా. శాంతి పరిరక్షణ కార్యకలాపాలు కొన్ని విరమించుకోవడం వల్ల వచ్చిన మిగులుతో నెట్టుకువస్తున్నారు. సమితిలో మొత్తం 193 దేశాలకు సభ్యత్వం ఉన్నది. వీటిలో భారత్‌తోపాటు కొన్ని దేశాలు క్రమబద్ధంగా తమ వాటాను చెల్లిస్తున్నాయి. దాదాపు మూడింట రెండు వంతుల దేశాలు పూర్తిగా చెల్లించకపోవడం లేదా జాప్యం చేయడం వల్ల ఈ సంక్షోభం తలెత్తుతున్నది. స్థూల జాతీయాదాయం, చెల్లింపు స్థోమత, రుణాలు మొదలైన అంశాల ప్రాతిపదికగా ఒక్కో దేశం వాటాను నిర్ణయిస్తారు. పేద దేశాల వాటా చాలా తక్కువగా ఉంటుంది. కానీ అత్యంత పెద్ద ఆర్థికవ్యవస్థ అయిన అమెరికా తన వాటా ఇవ్వకుండా సతాయించడం ఐక్యరాజ్యసమితి సంక్షోభానికి ప్రధాన కారణం.

**దేశాల మధ్య వివాదాలను పరిష్కరించే అంతర్జాతీయ వేదిక లేకపోవడం వల్లనే అనేక యుద్ధా లు తలెత్తాయి. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత నానాజాతి సమితి ఏర్పాటు జరిగింది. ఈ వేదికను సద్వినియోగం చేసుకోలేకపోవడం వల్లనే రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. ఈ మారణహోమాలు మళ్లా జరుగకూడదనే ఉద్దేశంతోనే ఐక్యరాజ్యసమితి ఏర్పాటైంది. అమెరికా, బ్రిటన్ తదితర ఐదు దేశాలకు వీటో అధికారం ఇవ్వడం ద్వారా వాటి బాధ్యత పెరిగింది. ఎక్కువ నిధులు చెల్లించడంతో పాటు ఈ సమితి ద్వారా ఐదు పెద్ద దేశాలు లబ్ధి పొందాయి కూడా. అనేక సందర్భాల్లో ఐక్యరాజ్యసమితి విఫలమైన మాట నిజం.**

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలోని ఐదు వీటో అధికారం కలిగి ఉన్న దేశాలు మిగతా దేశాల కన్నా ఎక్కువ నిధులు ఇవ్వవలసి ఉంటుంది. ఐక్యరాజ్యసమితికి వచ్చే ఆదాయంలో ఇరువై రెండు శాతం అమెరికా చెల్లించాలె. కానీ అంతర్జాతీయ రాజకీయాల్లో ఒంటెద్దు పోకడ పోతున్న అమెరికాకు ఐక్యరాజ్యసమితి నిర్ణయాలు నచ్చడం లేదు. తమ సొమ్ము తింటున్న ఐక్యరాజ్యసమితి తమకు వ్యతిరేకంగా తీర్మానాలు చేస్తున్నదనేది అమెరికా ఆగ్రహం. 1994లో అమెరికా దిగువసభ శాంతి పరిరక్షణ కార్యకలాపాల చెల్లింపుపై పరిమితి విధించింది. దీంతో అమెరికా ఈ అవసరాలకు దాదాపు రెండు వందల నలభై కోట్ల డాలర్ల మేర చెల్లించవలసి ఉన్నది. సాధారణ బడ్జెట్‌కు బకాయిలు వంద కోట్ల డాలర్ల మేర ఉన్నాయి. సమితి బడ్జెట్‌లో చైనా వాటా పన్నెండు శాతంగా ఉన్నది. చైనా ఆర్థిక శక్తిగా వేగంగా ఎదుగుతున్నందువల్ల వచ్చే పదేండ్లలో అమెరికా వాటాతో సమానంగా చెల్లించవలసి ఉంటుందనే ఆశాభావం వ్యక్తమవుతున్నది. కానీ తక్షణ సమస్య తీరవలసి ఉన్నది. ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కడానికి వెంటనే తమ వాటాలు చెల్లించాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ సభ్య దేశాలకు లేఖలు రాస్తున్నారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చిన తర్వాత ఐక్యరాజ్యసమితి పట్ల మరింత వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు. సమితి నిధులను దుబారా చేస్తున్నదని ట్రంప్ విమర్శిస్తున్నారు. కానీ సమితిని బలహీనపరుచడం ట్రంప్ విధానమనే అభిప్రాయం కలుగుతున్నది. ప్రపంచ వాణిజ్య సంస్థను కూడా పనిచేయకుండా నిర్వీర్యం చేయడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ప్యారిస్ ఒడంబడిక నుంచి అమెరికా బయటికి వెళ్లిపోయింది. ట్రంప్ బహుళపక్ష వేదికలనుఖా తరు చేయడమే లేదు.

దేశాల మధ్య వివాదాలను పరిష్కరించే అంతర్జాతీయ వేదిక లేకపోవడం వల్లనే అనేక యుద్ధాలు తలెత్తాయి. మొదటి ప్రపంచయుద్ధం తర్వాత నానాజాతి సమితి ఏర్పాటు జరిగింది. ఈ వేదికను సద్వినియోగం చేసుకోలేకపోవడం వల్లనే రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. ఈ మారణహోమాలు మళ్లా జరుగకూడదనే ఉద్దేశంతోనే ఐక్యరాజ్యసమితి ఏర్పాటైంది. అమెరికా, బ్రిటన్ తదితర ఐదు దేశాలకు వీటో అధికారం ఇవ్వడం ద్వారా వాటి బాధ్యత పెరిగింది. ఎక్కువ నిధులు చెల్లించడంతో పాటు ఈ సమితి ద్వారా ఐదు పెద్ద దేశాలు లబ్ధి పొందాయి కూడా. అనేక సందర్భాల్లో ఐక్యరాజ్యసమితి విఫలమైన మాట నిజం. సెర్బియా, ఇరాక్, లిబియా, ఆఫ్ఘనిస్థాన్, సిరియా తదితర దేశాలపై అమెరికా సాగించిన దాడులు అంతర్జాతీయ న్యాయసూత్రాలకు విరుద్ధమే. రువాండా, కాంగో మొదలైన చోట్ల మారణహోమాలు అంతర్జాతీయ సమాజ నిస్సహాయతకు నిదర్శనాలు. అయినప్పటికీ ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అనేక ఉద్రిక్తతలను సడలించడానికి ఐక్యరాజ్యసమితి నిర్వహించిన ప్రశంసనీయమైంది. ఆహార వ్యవసాయ సంస్థ, యునెస్కో, యూనిసెఫ్ వంటి సంస్థలు సాగిస్తున్న కృషి తక్కువేమీ కాదు. పేదరిక నిర్మూలనకు, గౌరవ ప్రదమైన జీవనానికి, భూ తాపం పెరుగకుండా నివారించడానికి ఐక్యరాజ్యసమితి చేస్తున్న కృషి అసాధారణమైనది. ఏ దేశమైనా తమకు నచ్చినట్టు వ్యవహరించకపోతే నిధులు ఇవ్వబోమని బ్లాక్‌మెయిల్ చేయడం తగదు. ఐక్యరాజ్యసమితి సమర్థతను దెబ్బతీస్తే ప్రపంచ శాంతికే భంగం వాటిల్లుతుంది.

**జనగళం**

## వ్యాధులపై అవగాహన అవసరం

వానకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులతో పాటు, డెంగ్యూ వంటి జ్వరాలు విజృంభిస్తాయి. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఎక్కువగా అనారోగ్యం పాలవుతుంటారు. ఇదే అదనుగా కొందరు వైద్యులు వ్యాపార ధోరణులతో ఆలోచించి జ్వర బాధితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. డెంగ్యూ జ్వరాన్ని ప్రాణాంతకవ్యాధిగా చెబుతూ ప్రజలను హడలగొడుతున్నారు. డెంగ్యూ జ్వరానికి సంబంధించి ప్రాథమిక లక్షణాలు రోగిలో కనిపిస్తే రక్తంలోని ప్లేట్‌లెట్స్‌లో కొంత తగ్గుదల కన్పించడం సాధారణమే. అయితే సకాలంలో వైద్యుడిని సంప్రదించి సరైన ఆహారం తీసుకుంటే రక్తంలో ప్లేట్‌లెట్స్‌లో పెరుగుదల కన్పిస్తుంది. కానీ చాలామంది వైద్యులు డెంగ్యూ నివారణ కోసమంటూ మోతాదుకి మించి యాంటిబయాటిక్స్ మందులను జ్వర బాధితులకు ఇస్తున్నారు. దీనివల్ల వారిలో మరికొన్ని ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తున్నాయి. యాంటి బయాటిక్స్‌తో ప్లేట్‌లెట్స్ సంఖ్య కూడా పడిపోయే అవకాశం ఉన్నది. మనిషి ఆరోగ్యం, వయస్సును బట్టి ప్లేట్‌లెట్స్ సంఖ్య సుమారు ఒక లక్షా యాభై వేల నుంచి నాలుగు లక్షల యాభై వేల వరకు మన శరీరంలో ఉంటాయి. వైరల్ జ్వరాలు వచ్చినప్పుడు కూడా ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గుతూ ఉంటుంది. అయితే యాభై వేల వరకు ప్లేట్‌లెట్స్ సంఖ్య పడిపోయినప్పటికీ రోగి ప్రాణానికి ముప్పు ఉండదు. అయితే జ్వర బాధితులు తక్షణమే రక్తపరీక్షలు చేయించుకొని సకాలంలో మందులు వాడాలి. టైఫాయిడ్ వంటి బ్యాక్టీరియా వల్ల వచ్చే జ్వరాల వల్ల ప్లేట్‌లెట్ల సంఖ్య పెద్దగా తగ్గిపోదు. ఎక్కువగా వైరల్ జ్వరాలలోనే ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గుదల కనిపిస్తుంది. వైద్యుని సూచన మేరకు తగిన ఆహారాన్ని తీసుకోవాలి. బొప్పాయి, క్యారెట్, బీన్స్, తాజా ఆకుకూరలను ఆహారంగా తీసుకుంటే ప్లేట్‌లెట్స్‌లో గణనీయమైన పెరుగుదల కన్పిస్తుందని వైద్య నిపుణులు తెలియజేస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ దోమలు కుట్టకుండా, నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. అంతేగాక గోరువెచ్చని నీరు తాగితే చాలారకాల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. వానకాలంలో వచ్చే ఈ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది మరింత చైతన్యం కలిగించాల్సి అవసరం ఉన్నది.

**- యం.రాంప్రదీప్, సామాజిక కార్యకర్త**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



**డాక్టర్ రామకృష్ణ బండారు**

# వ్యాపారంగా పర్యాటకం

ప్రతి పది మందిలో ఒకరు పర్యాటక రంగంలో ఉపాధి పొందుతున్నారు. ప్రత్యక్ష ఉద్యోగ కల్పన కన్నా పరోక్ష ఉపాధి కల్పన ఈ రంగం ప్రత్యేకత. పెట్టుబడుల విషయానికి వస్తే, 2018లో ఈ రంగంలో సుమారు 940.9 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రవాహం జరిగింది. ఇది మొత్తం ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల పెట్టుబడుల ప్రవాహంలో 4.4 శాతం. ఈ గణాంకాలు చాలు పర్యాటక రంగం ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవడానికి.

ఒకప్పుడు పర్యాటకరంగాన్ని దేశాల మధ్య వారధిగా, తమ దేశ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే మార్గంగా వ్యాపారేతర దృష్టితో చూసేవారు. కానీ గత దశాబ్దకాలంగా పర్యాటకరంగాన్ని పక్కా 'వ్యాపార దృక్పథంతో' చూస్తున్నారు. తమ దేశాభివృద్ధికి దోహదం చేసే ఒక వ్యాపార సేవగా పరిగణించి పర్యాటకులను ఆకర్షించేవిధంగా పర్యాటక విధి విధానాలు రూపొందించుకుంటున్నాయి ప్రపంచదేశాలు. ముఖ్యంగా విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే ధ్యేయంగా దేశీయ విధానాలను సరళీకరిస్తున్నారు. దీనివల్ల విదేశీ పర్యాటకులతో విలువైన విదేశీ ద్రవ్యం లభించడమే కాకుండా ఈ రంగం దేశాలకు ఆదాయ వనరుగా, ఆర్థికవ్యవస్థకు ఇంధనంగా మారుతుంది. ఇటీవల జరిగిన 'టెక్సాస్ ఇండియా ఫోరమ్' లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. ప్రతిఒక్కరు తమవంతుగా కనీసం ఐదుగురు విదేశీయులను భారత్‌కు టూరిస్టుల రూపంలో పంపాలని కోరారు. ఇది పర్యాటకరంగ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తున్నది. ప్రజలు కూడా తమ దైనందిన జీవితంలో పర్యాటకాన్ని నిత్యావసర వస్తువుగా భావిస్తున్నారు. నిత్యం ఎన్నో సమస్యలు, ఒత్తిడితో కూడుకున్న జీవితానికి దూరంగా గడుపడానికి పర్యాటకం వైపు మొగ్గు చూపుతున్నారు. అందుకే పర్యాటకం ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు నిత్యావసర సేవగా, ప్రభుత్వాలకు ఆదాయ మార్గంగా మారింది. కొన్నేండ్లుగా ప్రపంచవ్యాప్తంగా పర్యాటకరంగంలో నమోదవుతున్న వృద్ధే దీనికి నిదర్శనం.

ప్రపంచ పర్యాటక సంస్థ ప్రకారం 2000 సంవత్సరంలో ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకుల సంఖ్య 456 మిలియన్లు. 2018 సంవత్సరం నాటికి మొత్తం పర్యాటకుల సంఖ్య 1.40 బిలియన్లకు చేరుకున్నది. ఆదాయపరంగాను మిగిలిన సేవ రంగాలకంటే పర్యాటక రంగం ముందంజలో ఉన్నది. 2000 సంవత్సరంలో ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ఆదాయం 570.98 బిలియన్లు ఉన్నది. 2018 నాటికి 1.7 ట్రిలియన్లకు చేరుకున్నది. ప్రపంచ పర్యాటక ప్రయాణ మండలి 2019 గణాంకాల ప్రకారం, ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో పర్యాటకరంగం వాటా సుమారు 10.4 శాతం. ప్రపంచవ్యాప్తంగా 319 మిలియన్ల మంది ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ప్రతి పది మందిలో ఒకరు పర్యాటక రంగంలో ఉపాధి పొందుతున్నారు. ప్రత్యక్ష ఉద్యోగ కల్పన కన్నా పరోక్ష ఉపాధి కల్పన ఈ రంగం ప్రత్యేకత. పెట్టుబడుల విషయానికి వస్తే, 2018లో ఈ రంగంలో సుమారు 940.9 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రవాహం జరిగింది. ఇది మొత్తం ప్రపంచవ్యాప్తంగా అన్ని రంగాల పెట్టుబడుల ప్రవాహంలో 4.4 శాతం. ఈ గణాంకాలు చాలు పర్యాటక రంగం ప్రాముఖ్యాన్ని అర్థం చేసుకోవడానికి. అందుకే ప్రపంచ దేశాలు పర్యాటక రంగాన్ని అభివృద్ధి పరిచి దానిని వారి దేశాభి వృద్ధిలో ఒక కీలకరంగంగా మలుచుకున్నాయి. ఇండోనేషియా, సింగపూర్, థాయిలాండ్, చైనా, అమెరికా, ఫ్రాన్స్, టర్కీ వంటి దేశాలే ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మన దేశంలో మొదటిసారిగా పర్యాటక రంగం ఆవశ్యకతను 1982 లో అప్పటి ప్రభుత్వం గుర్తించింది. మొదటి పర్యాటక విధానం ద్వారా పర్యాటక అభివృద్ధికి నాంది పలికింది. ఆ తర్వాత 2002లో అప్పటి ప్రధాని వాజపేయి తిరిగి నూతన పర్యాటక విధానాన్ని ప్రకటించి పర్యాటకరంగ అభివృద్ధికి కృషి చేశారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వం కూడా 2015లో నూతన పర్యాటక విధానం ద్వారా విదేశీ పర్యాటకుల ఆకర్షణ, భద్రతా, పరిశుభ్రత వంటి విషయాలపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా 2015లో ఈ-పర్యాటక వీసాను కేంద్రం ప్రవేశపెటింది. గత ప్రభుత్వాలతో పోలిస్తే ప్రస్తుత మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధిలో ముందంజలోఉన్నదని చెప్పాలి. దేశంలో ఐదు పర్యాటక సర్క్యూట్ల అభివృద్ధి కోసం 2015లో 'స్వదేశ్ దర్శన్' అనే పథకం ద్వారా సుమారు రూ.500 కోట్లు ఖర్చుచేసింది. అదే సంవత్సరంలో పిలిగ్రిమేజ్ పర్యాటకం అభివృద్ధిలో భాగంగా 'ప్రసాద్' అనే పథకం ద్వారా సుమారు 200 కోట్లు ఖర్చుచేసింది. ప్రత్యేక పథకాలు ప్రకటించి దేశ పర్యాటకాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. అయితే ఆశించిన ఫలితాలు మాత్రం సాధించలేకపోతున్నాం. అంతర్జాతీయ స్థాయిలో మనదేశ పర్యాటక ప్రస్థానం చూస్తే 2017 లెక్కల ప్రకారం అంతర్జాతీయ పర్యాటకుల రాకలో మనదేశం వాటా 1.17 శాతం మాత్రమే. ఈ జాబితాలో మన దేశం 26వ స్థానంలో ఉన్న ది. అలాగే పర్యాటక ఆదాయ ఆర్జన విషయంలో మన దేశం వాటా 2.05 శాతం మాత్రమే. ఈ జాబితాలో మనం 13వ స్థానంలో ఉన్నాం. అదే విధంగా మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో పర్యాటక రంగం వాటా 9.5 శాతం ఉన్నది. అదే సింగపూర్‌లో 10.2 శాతం, మలేషియాలో 13.4 శాతం చైనాలో 11 శాతం, టర్కీలో 11.6 శాతం థాయిలాండ్ లో 21.2 శాతంగా ఉన్నది. 7,517 కిలో మీటర్ల సముద్ర తీరం చారిత్రాత్మక కట్టడాలు, ప్రకృతి రమణీయత గల ఎన్నో ఆకర్షణీయ ప్రదేశాలున్నాయి. మనకున్న పర్యాటక వనరులతో మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో పర్యాటకం వాటా మిగిలిన దేశాలతో పోలిస్తే తక్కువ. చిన్నచిన్న దేశాలు కూడా పర్యాటకం ద్వారా విలువైన విదేశీ ద్రవ్యాన్ని ఆర్జిస్తుంటే మరి మనమెందుకు వెనుకబడి ఉన్నాం? ముఖ్యంగా వ్యాపారాత్మక దృష్టితో పర్యాటక రంగాన్ని చూడలేకపోవడమే దీనికి కారణం.

పర్యాటకం అనగానే దేశ సంస్కృతీ సం ప్రదాయాలు ప్రతిబింబించే ఒక సాధనంగా చూస్తున్నాం. అంతే తప్ప దానిని వ్యాపారసేవగా చూడలేకపోతున్నాం. పర్యాటకుడిని ఒక వినియోగదారునిగా ప్రభుత్వాలు గుర్తించలేకపోతున్నాయి. పర్యాటకులు ఏమి కోరుకుంటున్నారు? ఎటువంటి ప్రదేశాలు చూడాలనుకుంటున్నా రు? ఏ సమయంలో పర్యటనలు చేస్తున్నారు? ఇలా పర్యాటకుల ప్రవర్తన మీద ప్రభుత్వాలకు అవగాహన లేదు. అలాగే ప్రభుత్వం ఏటా కేటాయించే నిధుల్లో ఎక్కువ భాగం ఉన్న పర్యాటక ప్రదేశాల అభివృద్ధికే ఖర్చుపెడుతున్నారు. కానీ కొత్త పర్యాటక ప్రదేశాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టడం లేదు. ఈ సంవత్సరం దేశ బడ్జెట్‌లో పర్యాటకరంగానికి కేటాయించిది 2,189 కోట్ల రూపాయలే. ఇది మొత్తం బడ్జెట్లో 0.07 శాతం. భారతదేశం అనగానే హెరిటేజ్ పిలిగ్రిమాజ్ టూరిజం మాత్రమే అన్న భావన కూడా విదేశీ పర్యాటకుల రాకమీద ప్రభావం చూపుతుంది. లీజర్ టూరిజం అభివృద్ధి మీద ప్రభుత్వం చూపిస్తున్న అశ్రద్ధ కూడా ఒక కారణం. ప్రపంచ పర్యాటక మండలి పరిశోధన పత్రాల ప్రకారం ప్రపంచంలో సుమారు 65 శాతం పర్యాటకులు కేవలం లీజర్ టూరిస్ట్ ప్రదేశాలను సందర్శనకే మొగ్గుచూపుతు న్నారు. సింగపూర్, థాయిలాండ్, ఇండోనేషియా, అమెరికా మొదలగు దేశాలు పర్యాటక ఆదాయంలో ముందువరుసలో ఉండటానికి కారణం ఆ దేశంలో లీజర్ టూరిజమే. ఆదాయ సముపార్జనలోను ఈ టూరిస్ట్ ప్రాంతాలే ముందుంటాయి. నిజానికి ఒక చారిత్రక ప్రదేశానికి వచ్చే పర్యాటకుడు పెట్టే ఖర్చు కన్నా లీజర్ టూరిస్ట్ ప్రదేశాలను సందర్శించే పర్యాటకుడు పెట్టే ఖర్చు ఎక్కువ. ఇలా మనదేశంలో ఎన్నో కారణాలతో పర్యాటకరంగం ఆశించిన స్థాయిలో పురోగమించకున్నా, రానున్న రోజుల్లో పర్యాటకరంగ వృద్ధిపై ఆశలు రేపుతున్నాయి.

**ఇటీవల మోదీ హ్యూస్టన్ పర్యటనలో చిన్న కోరికే అంటూ ప్రతి ప్రవాస భారతీయుడు కనీసం ఐదుగురు విదేశీ పర్యాటకులను భారత్‌కు పం పాలని కోరడం హర్షించదగినదే. 2018లో సుమారు కోటి మంది విదేశీ పర్యాటకులు మనదేశాన్ని దర్శించారు. దీనిద్వారా సుమారు 1,94, 882 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇక ప్రధాని కోరిక వాస్తవ రూపం దాలిస్తే భారతదేశం వెలుపల ఉన్న సుమారు 3 కోట్ల మంది ప్రవాస భారతీయులు సగటున ఒక్కరిని మన దేశానికి పంపించినా, ఈ సంఖ్య ఎంతో పెరుగు తుంది. మన దేశ ఆదాయం కూడా పెరుగుతుంది. ఇది పర్యాటకరంగ అభివృద్ధికి వ్యూహాత్మక ప్రకటనగా భావించవచ్చు.**

ఇటీవల మోదీ హ్యూస్టన్ పర్యటనలో చిన్న కోరికే అంటూ ప్రతి ప్రవాస భారతీయుడు కనీసం ఐదుగురు విదేశీ పర్యాటకులను భారత్‌కు పం పాలని కోరడం హర్షించదగినదే. 2018లో సుమారు కోటి మంది విదేశీ పర్యాటకులు మనదేశాన్ని దర్శించారు. దీనిద్వారా సుమారు 1,94, 882 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. ఇక ప్రధాని కోరిక వాస్తవ రూపం దాలిస్తే భారతదేశం వెలుపల ఉన్న సుమారు 3 కోట్ల మంది ప్రవాస భారతీయులు సగటున ఒక్కరిని మన దేశానికి పంపించినా, ఈ సంఖ్య ఎంతో పెరుగుతుంది. మన దేశ ఆదాయం కూడా పెరుగుతుంది. ఇది పర్యాటకరంగ అభివృద్ధికి వ్యూహాత్మక ప్రకటనగా భావించవచ్చు. అలాగే కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు ద్వారా పరిస్థితులను పర్యాటకానికి అనుకూలంగా మార్చాలి. ఇది మన దేశానికి పర్యాటకరంగం ఒక వరంగా మారే అవకాశం ఉంటుంది. అంతేకాదు ప్రపంచంలోనే అద్భుత కట్టడంగా భావిస్తున్న తెలంగాణ రాష్ట్రంలోని 'కాళేశ్వరం ప్రాజెక్ట్'ను ఒక గొప్ప లీజర్ పర్యాటక ప్రాంతం గా అభివృద్ధి చేయాలి. కేంద్రం నూతన పర్యాటక ప్రాంతాల అభివృద్ధి భద్రత వంటి అంశాపై దృష్టిపెట్టాలి. పర్యాటకాన్ని సామాజిక దృష్టితో కాకుండా వ్యాపారదృష్టితో చూడాలి. అప్పుడే ఈ రంగం శక్తి సామర్థ్యాలు తెలుస్తాయి.

**(వ్యాసకర్త: పోస్ట్ డాక్టోరల్ ఫెలో, కామర్స్ విభాగం, ఓయూ)**

# అక్షయపాత్రను మట్టిపాలు చేయొద్దు

ఆర్టీసీ



**ఇలపావులూరి మురళీమోహనరావు**





జీవితాంతం కలిసిమెలిసి ఒకే కప్పు కింద కాపురం చేసే భార్యాభర్తల మధ్యన అప్పుడప్పుడు పొరపొచ్చాలు వస్తుంటాయి. అలాంటి అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు వారే కలిసి మాట్లాడుకొని సామరస్యంగా పరిష్కరించుకుంటారు. ఇది లోక సహజం. అంతే తప్ప వీధికెక్కి ఇరుగు పొరుగు దగ్గరికి వెళ్లి తమ ఇంటిగుట్టు వారితో చెప్పుకోరు.

తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు సకలజనుల సమ్మె జరిగినప్పుడు అందులో ఆర్టీసీ కూడా భాగస్వామి. రోడ్డు రవాణా సంస్థ కార్మికులు చేసిన ఉద్యమాన్ని తక్కువ చేయలేం. ఆ సమ్మెలో ప్రభుత్వంలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు దాదాపు నాలుగు లక్షల మంది పాల్గొన్నారు. కాబట్టి తెలంగాణ ఉద్యమం క్రెడిట్ ఒక్క రవాణా సంస్థ కార్మికులకు మాత్రమే దక్కదు. అప్పుడు వారు పోరాడింది సమైక్య పాలకుల మీద. కానీ, ప్రస్తుతం పాలిస్తున్నది స్వజాతీయులే తప్ప అన్యులు కారు. ఈ పాయింట్ మీదనే ఆర్టీసీ కార్మికుల సమ్మెకు ప్రజామద్దతు లభించడం లేదు. మన కంటిని మన వేళ్లతోనే పొడుచుకుంటామా? అని ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు ప్రజలు.

ఏ రంగంలోనైనా, కార్మికులకు అనేక సమస్యలు ఉంటాయి. వాటిని కార్మిక సంఘాల ద్వారా యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించుకుంటారు. సమస్యలు అన్నీ ఒకేసారి తీర్చడం ఎవరివల్లా కాదు. కార్మికులు కూడా అంత దురాశకు పోరు. మధ్యేమార్గంగా ఎక్కడో ఒక్కచోట రాజీకి వస్తారు. ఇక్కడ ఆర్టీసీ అనేది ఇతర శాఖల వంటిది కాదు. ప్రభుత్వంలోని ఇతర శాఖల ఉద్యోగులు ఆఫీసులకు వెళ్లి తమ విధులను నిర్వహించి సాయంత్రం ఇళ్లకు వెళ్లిపోతారు. కానీ, ఆర్టీసీ విధులు ప్రజలతో పెనవేసుకున్నవి. ప్రతిరోజూ కోట్లాది మందిని వారి గమ్యాలకు చేర్చడం వారి విధి. ఈ విధి నిర్వహణలో వారికి ప్రజలతో ఒకరకమైన ఆత్మీయ సంబంధాలు ఏర్పడుతాయి. కండక్టర్, డ్రైవర్ అంటే ప్రజల్లో ఏదో చెప్పలేని అభిమానం ఉంటుంది. కండక్టర్ సీటు పక్కనే కూర్చోవడం, డ్రైవర్ బస్సును నడుపుతున్నప్పుడు అతనితో రెండు మాటలు మాట్లాడటం అంటే అదేదో చాలా గొప్ప విషయంగా భావిస్తారు ప్రయాణికులు. వారిద్దరూ ప్రయాణికులను కోపంగా మందలించినా, వారి మాటలను సీరియస్‌గా తీసుకోరు. దారిలో ఎక్కడైనా హోటల్ ముందు బస్సును ఆపి కాఫీ, టిఫిన్లకు ఆపినప్పుడు డ్రైవర్, కండక్టర్ దగ్గర హోటల్ వాళ్లు డబ్బులు తీసుకోరు. అదీ ప్రజాబాహుళ్యంలో వారికి లభించే గౌరవం. ఇప్పుడు వారు చేస్తున్న యుద్ధం ప్రభుత్వం మీదనా? తమను గౌరవించే ప్రయాణికుల మీదనా?

**హైకోర్టు తమ తీర్పులో ప్రభుత్వానికి, కార్మిక సంఘాలకు కొన్ని సూచనలు చేసింది. ఆ సూచనల ప్రకారం కార్మికుల సమస్యలు ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కారం కావాలి తప్ప, పనిలేని ప్రతిపక్షాల జోక్యం అవసరం లేదు. పన్నెండు రోజుల సమ్మె తర్వాత కూడా కార్మికుల సమ్మెను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. వారి తిప్పలు వారు పడుతున్నారు తప్ప ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెట్టడం లేదు. ఇప్పటికే ఇద్దరు కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడి తమ కుటుంబాలను అనాథలను చేశారు. కాబట్టి కార్మికసంఘాలు, ప్రభుత్వం భేషజాలు వదులుకొని కలిసి కూర్చుని సామరస్యంగా ప్రజాక్షేమాన్ని, ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రగతి రథచక్రాలను రహదారుల మీదికి ఎక్కించడం తక్షణ కర్తవ్యం.**

జీతాలు ఎక్కువో తక్కువో నేను చెప్పలేను కానీ, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నందుకు కృతజ్ఞతగా ఆర్టీసీ కార్మికులకు వారు అడుగకుండానే ఒకేసారి నలభై నాలుగు శాతం జీతాలు పెంచారు కేసీఆర్. అలాగే పదహారు శాతం ఇంటెరిమ్ రిలీఫ్ కూడా ఇచ్చారు. ఇంత భారీగా జీతాలు పెంచడం ఆర్టీసీ చరిత్రలో మొదటిసారి కావచ్చు. వారికి ఇంకా డిమాండ్స్ ఉంటే నేరుగా ముఖ్యమంత్రితో కూర్చొని చర్చించగలరు. కానీ, ఇక్కడ దురదృష్టం కొద్దీ కార్మిక సంఘాలు విపక్షాల మాయమాటల్లో పడ్డాయి. ప్రజల చేత మొన్నటి ఎన్నికల్లో ఘోరంగా తిరస్కరించబడిన పక్షాల నాయకులకు కార్మికుల ఆకలి కేకలు మధుర సంగీతంలా వినిపిస్తున్నాయి. వారి ఆకలి బాధలను తీర్చే శక్తి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి తప్ప విపక్షాలకు ఉంటుందా? ఏదోవిధంగా కేసీఆర్‌ను ఆగం పట్టిద్దామనే దురుద్దేశం తప్ప ప్రతిపక్షాలు ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించగలవా? ప్రభుత్వం, కార్మికసంఘాల మధ్య మరిన్ని మంటలు రాజేయడం, ఆ మంటల్లో రాజకీయ ప్రయోజనాలు చూసుకోవడం తప్ప ప్రతిపక్షాలు కార్మికుల సమస్యలను తీర్చలేవు.

ఇప్పటికే హైకోర్టు తమ తీర్పులో ప్రభుత్వానికి, కార్మిక సంఘాలకు కొన్ని సూచనలు చేసింది. ఆ సూచనల ప్రకారం కార్మికుల సమస్యలు ప్రభుత్వంతో చర్చల ద్వారా పరిష్కారం కావాలి తప్ప, పనిలేని ప్రతిపక్షాల జోక్యం అవసరం లేదు. పన్నెండు రోజుల సమ్మె తర్వాత కూడా కార్మికుల సమ్మెను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదు. వారి తిప్పలు వారు పడుతున్నారు తప్ప ప్రభుత్వాన్ని శాపనార్థాలు పెట్టడం లేదు. ఇప్పటికే ఇద్దరు కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడి తమ కుటుంబాలను అనాథలను చేశారు. కాబట్టి కార్మికసంఘాలు, ప్రభుత్వం భేషజాలు వదులుకొని కలిసి కూర్చుని సామరస్యంగా ప్రజాక్షేమాన్ని, ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రగతి రథ చక్రాలను రహదారుల మీదికి ఎక్కించడం తక్షణ కర్తవ్యం. ఒకరినొకరు దెప్పిపొడుచుకోవడం, విమర్శించుకోవడం ఏ మాత్రం ప్రయోజనకరం కాదు.

**(వ్యాసకర్త: సీనియర్ రాజకీయ విశ్లేషకులు)**

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# కిడ్నీ బాధితుడికి మంత్రి కేటీఆర్ భరోసా

హైదరాబాద్‌లో వైద్య సాయానికి ఏర్పాట్లు

**సిరిసిల్ల టౌన్:** నిరుపేద వైద్యానికి ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఆపన్నహస్తాన్ని అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సుందరయ్యనగర్‌కు చెందిన పల్లపు కాశీరామ్‌కు భార్య పద్మ, ముగ్గురు పిల్లలున్నారు. కూలీ పనిచేసి కుటుంబాన్ని పోషించే కాశీరాం కొద్దిరోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో మంచానికే పరిమితమయ్యాడు. ఆరోగ్యం క్షీణించడంతో స్థానిక మాజీ కౌన్సిలర్ వనజ.. ఈ విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికితీసుకెళ్లారు. స్పందించిన మంత్రి హైదరాబాద్ దవాఖానలో మెరుగైన వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం



కాశీరాం కుటుంబసభ్యులకు ప్రయాణ ఖర్చులు అందజేస్తున్న టీఆర్ఎస్ నేత బత్తుల రమేశ్

బాధితుడికి టీఆర్ఎస్ నేత బత్తుల రమేశ్ ప్రయాణ ఖర్చుల కోసం రూ.5 వేలు అందజేసి హైదరాబాద్‌కు పంపించారు.



ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తలపెట్టిన సహస్ర చండీయాగం గురువారం సహస్ర చండీ పూర్ణాహుతితో ముగిసింది. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలో నిర్వహించిన ఈ యాగం చివరిరోజు పూజలకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తారాధికారి స్వాత్మానందేంద్ర స్వామి ముఖ్యఅతిథులుగా హాజరై భక్తులకు శుభాశీస్సులు అందించారు. యాగానికి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు నిరంజన్‌రెడ్డి, ఈటల రాజేందర్, ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తదితరులు హాజరయ్యారు. - కల్లూరు



వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కుటుంబ సమేతంగా గురువారం భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. - భద్రాచలం, నమస్తే తెలంగాణ





వరంగల్‌లో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ప్రణాళికలు

- పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**వరంగల్ ప్రధాన ప్రతినిధి. నమస్తే తెలంగాణ:** ధాన్యం, పత్తికొనుగోళ్లలో అలసత్వం ప్రదర్శించకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని అమలుచేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం వరంగల్‌అర్బన్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్‌భవన్‌లో వరంగల్‌అర్బన్, రూరల్ జిల్లాల వరి, పత్తి కొనుగోళ్లపై వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖలకు, సీసీఐ, రైస్ మిల్లర్లు, జిన్నింగ్‌మిల్లర్లు, ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాల, హమాలీ కార్మికుల ప్రతినిధులు, రైతు సమన్వయ సమితిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొనుగోళ్ల విషయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో నాణ్యమైన పత్తి పండుతున్నదని అయితే సీసీఐ గతానుభవాలను దృష్టిలో ఉంచుకొని సీసీఐ కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని ఆదేశించారు.

మహబూబ్‌నగర్‌లో 30 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా గురువారం ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పట్టణంలో పర్యటించారు. అన్నివార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. - మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ



## 'కృష్ణా'కు స్వల్ప వరద

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు గురువారం స్వల్ప వరద కొనసాగుతున్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 21,824 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, అంతే నీటిని దిగువకు వదిలారు. నారాయణపుర ప్రాజెక్టుకు 20,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 13,000 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. జూరాలకు 44,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 49,654 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టుకు నీటి ప్రవాహం తగ్గింది. 52,569 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి చేరగా.. ఎగువ ప్రాంతాల నుంచి 71,728 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. గురువారం కూడా రెండు క్రస్టుగేట్ల ద్వారా 16,200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టుకు 2000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. పులిచింతలప్రాజెక్టుకు 54,701 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 19,000 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. కర్ణాటకలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతున్నది. 14,768 క్యూసెక్కు ఇన్‌ఫ్లో ఉండగా, 14,444 క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు.

**శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు స్వల్ప ఇన్‌ఫ్లో నమోదువుతున్నది. ప్రాజెక్టుకు 6,347 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 883 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లి పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన లక్ష్మీ (మేడిగడ్డ) బరాజ్‌లో నీటి ప్రవాహం తగ్గింది. 36,000 ఇన్‌ఫ్లో ఉండగా, అంతేస్థాయిలో అవుట్‌ఫ్లో నమోదవుతున్నది. బుధవారం 6 గేట్లను ఎత్తిన అధికారులు, గురువారం 3 గేట్లను మాత్రమే ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు.



గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో టిమ్స్‌తో టికెట్ అందజేస్తున్న దృశ్యం



సంగారెడ్డిలోని కొత్త బస్టాండులో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



ఖమ్మం బస్టాండ్‌లో ప్లాట్‌ఫారాలపై ఉన్న బస్సులు

# పల్లెలకూ బస్సు పరుగులు

13వ రోజూ ఆగని ప్రగతిచక్రం

సర్కారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో కనిపించని సమ్మె ప్రభావం

రాష్ట్రంలో సాఫీగా సాగుతున్న ప్రయాణాలు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:**

ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యామ్నాయ చర్యలతో రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణాలు సాఫీగా సాగుతున్నాయి. పల్లెలకు సైతం బస్సులు పరుగులు పెడుతున్నాయి. ఆర్టీసీ జేఏసీ సమ్మె గురువారం 13వ రోజుకు చేరినా.. ప్రజారవాణాకు ఇబ్బందిలేకుండా సర్కారు పకడ్బందీగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో తిరిగాయి. గురువారం జిల్లాలో ఆర్టీసీ, అద్దె బస్సులు, ప్రైవేట్ బస్సులు మొత్తం కలిపి 381 బస్సులు నడిచాయి. ఖమ్మం డిపోలో ఆర్టీసీ 67, అద్దె బస్సులు 58, సత్తుపల్లి డిపోలో ఆర్టీసీ 70, అద్దె బస్సులు 29, మధిర డిపోలో ఆర్టీసీ 38, అద్దె బస్సులు 20, రవాణాశాఖ ఏర్పాటుచేసిన ప్రైవేట్ బస్సులు 29, మాక్సీక్యాబ్‌లు 70 వరకు సేవలందించాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం డిపోల పరిధిలో 268 బస్సులకుగాను 149 ఆర్టీసీ బస్సులు, 64 హైర్ బస్సులు కలిపి మొత్తం 213 బస్సులను తిప్పుతున్నారు. 70 శాతం బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. హైదరాబాద్, ఖమ్మం, విజయవాడ, వరంగల్ ప్రాంతాలకు బస్సులను నడిపారు.

**కరీంనగర్‌లో 96.66 శాతం సర్వీసులు**

కరీంనగర్ రీజియన్‌లోని నాలుగు జిల్లాల్లో గురువారం 96.66 శాతం బస్సులు నడిచాయి. అధికారులు 659 బస్సులకుగాను 637 బస్సులను నడిపించారు. ఇందులో 438 ఆర్టీసీ, 199 అద్దె బస్సులు ఉన్నాయి. అత్యధికంగా సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, సిరిసిల్ల డిపోల్లో 119 బస్సులు ఉండగా, గురువారం నడపాల్సిన బస్సులకంటే అధికంగా నడిపారు. జిల్లాలో 103 బస్సులు నడపాల్సి ఉండగా 108 బస్సులు తిరిగి, 104.85 శాతం బస్సు సర్వీసులు నడిచాయి. జగిత్యాల జిల్లాలో 198 బస్సులకుగాను 197, పెద్దపల్లి జిల్లాలో 149 బస్సులకుగాను 143, కరీంనగర్ జిల్లాలో 209 బస్సులకుగాను 189 బస్సులు తిరిగాయి.

**దూర ప్రాంతాలకూ కదిలిన చక్రాలు**

ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని ఆరు డిపోల్లో 82 శాతం బస్సులు నడిచాయి. రీజియన్‌లో 552 బస్సులకుగాను 457 బస్సులు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేరవేశాయి. ఆదిలాబాద్ డిపో పరిధిలో 114 బస్సులకు 87, ఆసిఫాబాద్ డిపో పరిధిలో 66 బస్సులకు 57, భైంసా డిపోలో 81 బస్సులకు 67 బస్సులు, మంచిర్యాల డిపో పరిధిలో 126 బస్సులకు 97 బస్సులు, నిర్మల్ డిపోలో 131 బస్సులకు 124 బస్సులు, ఉట్నూర్ డిపో పరిధిలో 32 బస్సులకు 25 బస్సులు తిరిగాయి. మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్‌తోపాటు సూపర్ లగ్జరీలు, రెండు రాజధాని బస్సులు నడిచాయి. నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్ పరిధిలో 86 శాతం సర్వీసులు తిరిగాయి. పల్లెవెలుగుతోపాటు నాన్‌స్టాప్ మినీ బస్సులు, ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు మొత్తం 458 బస్సులు సేవలందించాయి.



కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికులు

**ఉమ్మడి మెదక్‌లో 87 శాతం తిరిగిన బస్సులు**

ఉమ్మడి మెదక్ జిల్లాలోని రీజియన్ పరిధిలో 87 శాతం బస్సులు తిరిగాయి. రీజియన్‌లోని 8 డిపోల పరిధిలో 617 బస్సులకుగాను 542 బస్సులు నడిచాయి. వీటిలో 371 ఆర్టీసీ బస్సులు, 171 ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. మెదక్ డిపోలో 98 బస్సులకుగాను 85, నారాయణఖేడ్ డిపోలో 57 బస్సులకుగాను 48 బస్సులు, సంగారెడ్డి డిపోలో 100 బస్సులకుగాను 95 బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. సిద్దిపేట డిపోలో 105 బస్సులకుగాను 95 బస్సులు, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో 69 బస్సులకుగాను 65 బస్సులు, జహీరాబాద్ డిపోలో 93 బస్సులు ఉండగా, 75 బస్సులు, దుబ్బాక డిపోలో 40 బస్సులకుగాను 34 బస్సులు, హుస్నాబాద్ డిపోలో 55 బస్సులకుగాను 47 బస్సులు తిరిగాయి. ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లోని వరంగల్ 1, 2, హన్మకొండ, భూపాలపల్లి, పరకాల, మహబుబాబాద్, నర్సంపేట, తొర్రూర్, జనగామ డిపోలకు చెందిన 930 బస్సులకుగాను 700 సర్వీసులు నడిచాయి.

**పల్లె సర్వీసులు సైతం..**

నల్లగొండ జిల్లాలోని నాలుగు డిపోల నుంచి 308 బస్సులు నడింపించిన అధికారులు.. సుమారు 70 వేలమంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. మునుపటిలాగే నల్లగొండ డిపో నుంచి హైదరాబాద్‌కు 10 నిమిషాలకో నాన్‌స్టాప్ బస్సు నడుపుతుండగా.. గ్రామీణ ప్రాంతాలకు పల్లెవెలుగు బస్సులను నడిపిస్తున్నారు. సూర్యాపేట డిపో పరిధిలో 65 ఆర్టీసీ, 45 ప్రైవేట్, 12 స్కూల్ బస్సులు కలిపి మొత్తం 122 బస్సులు తిరిగాయి. కోదాడ డిపో పరిధిలో 72 బస్సులు, యాదాద్రి భువనగిరి జిల్లాలో 58 ఆర్టీసీ బస్సులు, 15 అద్దె బస్సులు, 60 ఇతర బస్సులతో కలిపి మొత్తం 133 బస్సులు నడిచాయి. వికారాబాద్ డిపోలో 58, తాండూరు డిపోలో 65, పరిగి డిపోలో 63 బస్సులు ఇలా మొత్తం 186 బస్సులు సర్వీసులను అందించాయి. మహబూబ్‌నగర్ డిపో నుంచి 75 ఆర్టీసీ, 35 హైర్ బస్సులు నడిచాయి. జిల్లాలో బస్సుల ద్వారా 17 వేల మందికిపైగా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరినట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నారాయణపేట జిల్లాలో 44 ఆర్టీసీ బస్సులు, 33 హైర్ బస్సులు, వనపర్తి డిపో పరిధిలో 82 బస్సులు, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాలుగు డిపోల పరిధిలో 146 బస్సులు తిరిగాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని డిపోలో 102 బస్సులకుగాను 101 బస్సులు నడిచాయి.

## అయ్యో.. సత్తయ్య!

- బతికుండగానే వైకుంఠధామానికి చేరిన వ్యక్తి మృతి
- వైద్యం అందించని భార్య, కూతురుపై కేసు

**శంకర్‌పల్లి రూరల్:** బతికుండగానే వైకుంఠధామానికి చేరిన సత్తయ్య(56) గురువారం ప్రాణాలు వదిలాడు. అనారోగ్యంతో బాధపడుతున్న భర్తను వైకుంఠధామంలో వదిలేసిన భార్య, కుమార్తెపై పోలీసులు కేసు నమోదుచేశారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని ఎల్వర్తి గ్రామంలో ఈ హృదయవిదారకర ఘటన చోటుచేసుకున్నది. 'బతికుండగానే వైకుంఠధామానికి' శీర్షికన 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన కథనం చర్చనీయాంశమైంది. జిల్లా కోర్టు ఆదేశాల మేరకు చేవెళ్ల ఏసీపీ వెంకట్‌రెడ్డి, శంకర్‌పల్లి సీఐ లింగయ్య, ఎస్సై సంజీవ, ఇతర అధికారులు ఎల్వర్తిని సందర్శించారు. సత్తయ్యను.. భార్య యాదమ్మ, కుమార్తె సంతోష కలిసి గ్రామశివారులోని వైకుంఠధామంలో వదిలి వెళ్లారని స్థానికులు వారికి తెలిపారు. పోలీసులు గురువారం సత్తయ్యను 108 వాహనంలో దవాఖానకు తరలిస్తుండగా మృతిచెందినట్టు చెప్పారు. సత్తయ్యకు సకాలంలో వైద్యం అందించనందున భార్య, కూతురుపై కేసు నమోదుచేసినట్టు ఎస్సై సంజీవతెలి పారు.

## భెల్ ఉద్యోగిని ఆత్మహత్య



నేహా (ఫైల్)

**చందానగర్, నమస్తే తెలంగాణ:** ఉన్నతాధికారుల వేధింపులు తాళలేక బీహెచ్ఈఎల్(భెల్)లో ఓ మహిళా ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. కోల్‌కతాకు చెందిన నేహా చౌక్సే భోపాల్‌లోని భెల్ పరిశ్రమలో అకౌంట్స్ విభాగంలో పనిచేస్తూ.. ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. భర్తతో కలిసి మియాపూర్‌లో ఉంటున్నారు. గురువారం భర్త ఇంట్లో ఉండగానే, బెడ్‌రూం తలుపులు పెట్టుకొని నేహా ఉరేసుకున్నది. అక్కడ లభించిన సూసైడ్‌నోట్ ఆధారంగా భెల్ ఉన్నతాధికారితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

# మూడు జిల్లాల్లో భారీ వర్షం

- 13 జిల్లాల్లో ఓ మోస్తరు
- మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో పిడుగులుపడి.. ముగ్గురి దుర్మరణం
- కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో 6 సెం.మీ. నమోదు





కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో కురిసిన వర్షానికి రోడ్డుపైకి చేరిన వరద.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ కార్గిల్ సెంటర్లో నిలిచిన వర్షపు నీరు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం సూర్యాపేట, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో భారీగా, 13 జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. పిడుగుపాటుకు మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరు కూలీలు, నల్లగొండలో ఒకరు మరణించారు. భూపాలపల్లి సింగరేణి గనిలోబొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. అత్యధికంగా కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది. శుక్ర, శనివారాల్లో రాష్ట్రంలోని పలుచోట్ల ఓ మోస్తరు, మరికొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ కేంద్రం వెల్లడించింది. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట, శంకరపట్నం, మానకొండూర్, తిమ్మాపూర్ మండలాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా సైదాపూర్‌లో 6 సెం.మీ. వర్షం పడింది. సూర్యాపేట జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అత్యధికంగా మద్దిరాల మండలంలో 4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ నగరంలో అరగంటపాటు భారీ వర్షం కురిసింది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి, ఖమ్మం, పెద్దపల్లి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది.

**ఉమ్మడి వరంగల్‌లో..**

వరంగల్ నగరంలో ఈదురు గాలులతో కూడిన వర్షం పడటంతో హన్మకొండ బస్టాండ్, జంక్షన్, ప్రధాన రోడ్లపైకి వరద నీరు చేరింది. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం వ్యాప్తంగా వర్షం కురిసింది. ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఓ మోస్తరు వాన పడింది.

**సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం..**

వర్షం కారణంగా భూపాలపల్లి ఏరియా కేటీకే ఓసీపీ-2 గనిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. మధ్యాహ్నం వర్షం పడటంతో రెండో షిఫ్టు, మూడో(నైట్) షిఫ్టులో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. రెండు షిఫ్టుల్లో సుమారు 2,600 టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది.

**దెబ్బతిన్న పంటలు**

కామారెడ్డి జిల్లా లింగంపేట్, భిక్కనూరు మండలాల్లో వర్షం కురువడంతో చేతికి వచ్చిన వరి పంట నేలవాలింది. లింగంపేటలో వంద ఎకరాల వరకు వరి పంట నష్టపోయినట్టు రైతులు తెలిపారు. భిక్కనూరులో ఆరబెట్టిన మక్కలు తడిసిపోయాయి.

**పిడుగులు పడి ముగ్గురు మృతి..**

పిడుగుపాటుకు మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం బంగారంపల్లికి చెందిన వడ్డె ఎల్లమ్మ(32), వడ్డె వెంటకమ్మ(38) మరణించారు. పత్తి చేనులో కలుపు తీస్తుండగా పిడుగుపడటంతో వీరు మరణించగా పక్కనే ఉన్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లిలో పోతరాజు లక్ష్మమ్మ(25) పిడుగుపాటుకు మరణించింది.

**గ్రేటర్ హైదరాబాద్‌లో ఓ మోస్తరు..**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి 8.30 వరకు గచ్చిబౌలిలో అత్యధికంగా 2.3 సెం.మీలు, చార్మినార్‌లో 2.2 సెం.మీలు, సైదాబాద్‌లో 2.1 సెం.మీలు, మల్కాజిగిరిలో 1.6 సెం.మీలు, నాంపల్లిలో 1.5 సెం.మీ. వర్షపాతం నమోదైనట్టు అధికారులు వెల్లడించారు.

**వచ్చే మూడ్రోజుల్లో వాన..**

అరేబియా సముద్రంలో అల్పపీడనం, కేరళ, కర్ణాటక, రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల మూడు రోజుల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్‌వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

**నేడు, రేపు రాష్ట్రంలో భారీ వర్షాలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లక్షద్వీప్ ప్రాంతం నుంచి తెలంగాణ వరకు ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్న ట్టు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. మరికొన్నిచోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నట్టు వారు పేర్కొన్నారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతంలో నూ ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు తెలిపారు.

## పారా మెడికల్ కోర్సుల భర్తీకి నోటిఫికేషన్

**పోచమ్మమైదాన్ (వరంగల్ అర్బన్):** రాష్ట్ర వ్యాప్తంగా పారామెడికల్ కోర్సుల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి మొదటి విడుత నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ అధికారులు గురువారం ప్రకటన జారీచేశారు. ఈ నెల 19వ తేదీ ఉదయం 7 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 2 వరకు వెబ్‌కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బ్యాచిలర్ ఆఫ్ నర్సిం గ్, బీపీటీ, బీఎస్సీ ఎంఎల్‌టీ కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని, తుది మెరిట్ జాబితాను విడుదల చేసినట్టు వివరించారు. అర్హులైన అభ్యర్థులు కోర్సు, కళాశాలల వారీగా నిర్దేశించిన గడువులోగా ఆప్షన్లను నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 18న కళాశాల వారీగా ఖాళీలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామన్నారు.

**హోమియోపతిలో ప్రవేశాలు..**

ప్రైవేట్ హోమియో కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీకి కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు బ్యాచిలర్ ఆఫ్ హోమియోపతిక్ మెడిసిన్ అండ్ సర్జరీ (బీహెచ్ఎంఎస్) కోర్సులో బీ,సీ క్యాటగిరీ సీట్లకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులకు మరో అవకాశం లభించిందని అధికారులు చెప్పారు. నీట్-2019లో అర్హత సాధించి, ఆసక్తి కలిగిన అభ్యర్థులు 18 నుంచి 20వరకు హైదరాబాద్‌లోని పీజీఆర్ఆర్ సీడీఈ, ఓయూ క్యాంపస్‌కు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

వివాహేతర సంబంధం కొనసాగదేమోనని

## పురుగులమందు తాగి ఇద్దరి ఆత్మహత్య



సైదులు, భవాని (ఫైల్)

**నకిరేకల్, నమస్తే తెలంగాణ:** వివాహేతర సంబంధం కొనసాగదేమోనని కలత చెంది ఇద్దరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం తాటికల్‌లో గురువారం వెలుగు చూసింది. తాటికల్‌కు చెందిన భవాని (27) భర్త కొంత కాలం క్రితం మృతి చెందాడు. కుమారుడితో కలిసి గ్రామంలో ఉంటున్నది. కాగా ఆమె అదేగ్రామానికి చెందిన సైదులు(36)తో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నది. సైదులుకు వివాహమై భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వివాహేతర సంబంధం గురించి భవాని కుటుంబసభ్యులకు తెలియడంతో సైదులును తీవ్రస్థాయిలో హెచ్చరించారు. దీంతో తమ వివాహేతర సంబంధం కొనసాగదేమోనని కలతచెంది ఇద్దరు బుధవారం సాయంత్రం గ్రామశివారులో తోటలోకి వెళ్లి.. కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

## ప్రేమించి పెండ్లాడి.. ప్రాణం తీశాడు!

భార్యను భవనంపై నుంచి తోసిన భర్త



సీమ, దిలీప్ (ఫైల్)

**వనస్థలిపురం:** ప్రేమించి పెండ్లి చేసుకున్న వ్యక్తిని నమ్మి వందల మైళ్ల దూరం వచ్చిన ఓ మహిళ.. నెలరోజులు తిరగకుండానే భర్త చేతిలో బలైపోయింది. సంచలనం సృష్టించిన ఈ ఘటన గ్రేటర్ హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకా రం.. మధ్యప్రదేశ్‌లోని బాల్‌గ్రా జిల్లా బొమ్మన్‌వాడకు చెందిన సీమ మొహ్రె (22)ను అదే ప్రాంతానికి చెందిన దిలీప్ (22) నెలరోజుల క్రితం ప్రేమ వివాహం చేసుకుని హైదరాబాద్ తీసుకొచ్చాడు. భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్న వీరిద్దరికి చింతల్‌కుంటలోని వాసవి శ్రీనిలయం అపార్ట్‌మెంట్‌లో పదిరోజుల క్రితం పని లభించడంతో అక్కడే ఉంటున్నా రు. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో వంట చేసుకునేందుకు కట్టెలు తీసుకొద్దామని సీమను మూడో అంతస్తుపైకి తీసుకెళ్లిన దిలీప్.. అక్కడి నుంచి ఆమెను కిందికి తోసేసి పరారయ్యాడు. దీంతో తల, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలైన సీమ.. దవాఖానలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నిందితుడి కోసం గాలిస్తున్నారు.



ఓరుగల్లు కోటను పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్ గురువారం సందర్శించారు. ఇటీవల కోటలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. - ఖిలావరంగల్

# ప్రోత్సాహకాలు కల్పించినా జాప్యమా?

'బిల్ట్' పునరుద్ధరణ పనులపై మంత్రి కేటీఆర్ అసంతృప్తి

రాయితీలు రద్దుచేసి, కంపెనీని కొత్తవారికి అప్పగిస్తామని హెచ్చరిక

■ వచ్చే ఏడాది ఆగస్టులోగా వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభిస్తామన్న యాజమాన్యం

■ కార్మికులకు రూ.10 వేల అడ్వాన్స్ ఇచ్చేందుకు అంగీకారం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బల్లార్‌పూర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (బిల్ట్) పునరుద్ధరణకు కావలసిన ప్రోత్సాహకాలను కల్పించినప్పటికీ యాజమాన్యం చేపట్టిన పనులు మందకొడిగా సాగుతుండటం పట్ల ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారక రామారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. బిల్ట్ పునరుద్ధరణ పనులపై గురువారం ఆయన మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సంస్థపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధవహించి పలు ప్రోత్సాహకాలను కల్పించిందని, అయినప్పటికీ యాజమాన్య తీరువల్ల పునరుద్ధరణ పనులు ఆలస్యమవుతున్నాయని అన్నారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే రాయితీలను రద్దుచేసి సంస్థను కొత్త యాజమాన్యానికి అప్పగించాల్సి వస్తుందని హెచ్చరించారు. 'బిల్ట్' కార్మికుల ప్రయోజనాలు, ఉపాధి విషయంలో ప్రభుత్వం పట్టుదలతో ఉన్నదని మంత్రి స్పష్టంచేస్తూ.. వారి వేతన బకాయిల చెల్లింపు కోసం యాజమాన్యంతో చేసుకున్న ఒప్పందాన్ని సమీక్షించారు. దీపావళి పండుగ సందర్భంగా కార్మికులకు రూ.10 వేలు చొప్పున అడ్వాన్స్ ఇచ్చేందుకు కంపెనీ అంగీకరించింది. తమ పనులు ప్రారంభమయ్యాయని, వచ్చే ఆగస్టు నాటికి వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభిస్తామని వారు తెలిపారు. గతంలో కొన్ని అనివార్య కారణాలతో పనులు కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం ప్రభుత్వానికి తెలిపిన గడువులోగా పునరుద్ధరణ పనులు పూర్తిచేస్తామని కంపెనీ సీవోవో నేహర్ అగర్వాల్ హామీ ఇచ్చారు. దీంతో ఈ విషయమై కంపెనీ నుంచి హామీ పత్రాన్ని తీసుకోవాలని, పనులను ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్‌ను మంత్రి కేటీఆర్ ఆదేశించారు. ఈ కన్సల్టెంట్లు ఓ నివేదికను సిద్ధం చేశారని, మరిన్ని పెట్టుబడుల కోసం ఆ నివేదికను బ్యాంకులకు సమర్పించనున్నామని కంపెనీ ప్రతినిధులు మంత్రికి వివరించారు. కంపెనీ పునరుద్ధరణలో భాగంగా ఐటీ నెట్‌వర్కింగ్ సమావేశంలో బిల్ట్ సీజీఎం హరిహరన్ కూడా పాల్గొన్నారు.

# పంచాయతీలకు రూ.339 కోట్లు

అక్టోబర్ నెల నిధులు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామపంచాయతీలకు రూ.339 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.203 కోట్లు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ (గ్రాంటు రూ. 136 కోట్లు కలిపి విడుదల చేసింది. నెలకు రూ.339 కోట్లు విడుదల చేయాలని సీఎం కేసీఆర్ పల్లెప్రగతి కార్యాచరణ ప్రణాళిక అమలుకు ముందు అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. దాని ప్రకారం సెప్టెంబర్‌కు రూ.339 కోట్లు విడుదలచేయగా.. అక్టోబర్ నెల నిధులను తాజాగా విడుదలచేస్తూ పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ రఘునందన్‌రావు గురువారం ప్రొసీడింగ్స్ ఇచ్చారు. కొత్త పంచాయతీలతో పాటు 2020 సంవత్సరంలో గడువు ముగియనున్న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం, సారపాక, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్, వికారాబాద్ జిల్లా నారాయణపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా లింగోటం, పొల్కంపల్లి, పులిజాల, నడింపల్లి, లింగాపూర్, గుంపనపల్లి, చౌటపల్లి, పాలిశెట్టిపల్లి, పెద్దపల్లి జిల్లా కుందనపల్లి, లింగాపూర్, వెంకట్రావుపల్లి, ఎల్కపల్లి పంచాయతీ పరిధిలోని 9, 10 వార్డులకు, నల్లగొండ జిల్లా నకిరేకల్, మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పరిధిలోని 19 పంచాయతీలకు గ్రాంట్లు విడుదలచేయాలని కమిషనర్ ప్రొసీడింగ్స్‌లో సూచించారు.

## నేడు, రేపు అటవీశాఖ వర్క్‌షాప్

■ ఆరునెలల కార్యాచరణపై చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రానున్న ఆరునెలల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై దూలపల్లి అటవీ అకాడమీలో శుక్ర, శనివారాల్లో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం వర్క్‌షాప్‌ను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభిస్తారు. సీఎం కేసీఆర్ నిర్దేశించిన 30 రోజుల ప్రణాళికలో చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించనున్నారు. అలాగే డిసెంబర్ నుంచి మే వరకు అడవుల్లో అగ్నిప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నారు. ఈ సదస్సుకు అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌తివారీ, పీసీసీఎఫ్ ఆర్ శోభతో పాటు పలువురు అటవీశాఖ ఉన్నతాధికారులు హాజరుకానున్నారు.



# లిక్కర్ షాపులకు నేడు లక్కీడ్రా

■ 2,216 మద్యం దుకాణాలకు 48,401 దరఖాస్తులు

■ దరఖాస్తుల ద్వారా ప్రభుత్వానికి రూ.968 కోట్ల ఆదాయం

■ అత్యధికంగా రంగారెడ్డి డివిజన్‌లో 422 షాపులకు 8,892 దరఖాస్తులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ తుది అంకానికి చేరుకున్నది. శుక్రవారం లక్కీ డ్రా ద్వారా 2,216 షాపులకు దుకాణదారులను ఎంపికచేయనున్నారు. ఇందుకోసం అన్నిజిల్లాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మొత్తం 2,216 దుకాణాలకు 48,401 దరఖాస్తులు వచ్చినట్టు ఎక్సైజ్‌శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వానికి రూ.968.02 కోట్ల ఆ దాయం వచ్చినట్టు చెప్పారు. డివిజన్లవారీగా చూస్తే అత్యధికంగా రంగారెడ్డిలోని 422 మద్యం షాపులకు 8,892 దరఖాస్తులు వచ్చాయి. దీం తో ప్రభుత్వానికి రూ.177.84 కోట్ల ఆదాయం సమకూరింది. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలకు పెంచినప్పటికీ మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. 2017లో దరఖాస్తుల ద్వారా రూ.412 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.968.02 కోట్లు సమకూరినట్టు అధికారులు తెలిపారు.

**ఎనిమిది షాపుల డ్రా నిలిపివేత**

నిజామాబాద్ జిల్లాలో ఐదు అంతకంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన మద్యం షాపులకు డ్రా నిలిపివేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. జిల్లాలో బోధన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మూడు, ఆర్మూర్ పరిధిలో మూడు, నిజామాబాద్ పరిధిలోని రెండు షాపుల డ్రాను నిలిపివేయనున్నారు. వ్యాపారులు సిండికేటుకు పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.

**డ్రాకు ఏర్పాట్లు పూర్తిచేశాం**

మద్యం షాపుల ఎంపిక కోసం 34 కేంద్రాల్లో లక్కీ డ్రా తీసేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎక్సైజ్ శాఖ కమిషనర్ సోమేశ్‌కుమార్ తెలిపారు. అన్నిజిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో లక్కీ డ్రా తీయనున్నట్టు చెప్పారు. ఈ ఏడాదిదరఖాస్తుల సంఖ్య పెరిగిందన్నారు. నవంబర్ ఒకటి నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వస్తుందని చెప్పారు.

డివిజన్లవారీగావివ రాలు

| డివిజన్ | దుకాణాలు | దరఖాస్తులు | వసూలు (రూ. కోట్లలో) |
|---|---|---|---|
| రంగారెడ్డి | 422 | 8,892 | 177.84 |
| వరంగల్ | 261 | 8,101 | 162.02 |
| ఖమ్మం | 165 | 7,711 | 154.22 |
| నల్లగొండ | 278 | 7,099 | 141.98 |
| కరీంనగర్ | 266 | 4,013 | 80.26 |
| మహబూబ్‌నగర్ | 164 | 3,383 | 67.66 |
| మెదక్ | 193 | 3,200 | 64 |
| ఆదిలాబాద్ | 163 | 2,956 | 59.12 |
| నిజామాబాద్ | 131 | 1,547 | 30.94 |
| హైదరాబాద్ | 173 | 1,499 | 29.98 |
| మొత్తం | 2,216 | 48,401 | 968.02 |

# వర్షంతో సీఎం సభ రద్దు



భారీ వర్షంలోనే సభాస్థలిలో కుర్చీలను తలపై పెట్టుకొని సీఎం కేసీఆర్ కోసం ఎదురుచూపులు

■ హెలికాప్టర్‌కు అనుమతించని ఏవియేషన్ అధికారులు

■ భారీగా తరలివచ్చి నిరాశతో వెనుదిరిగిన జనం

■ కిక్కిరిసిన హుజూర్‌నగర్ వీధులు

**హైదరాబాద్/ సూర్యాపేట ప్రతినిధి/ హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ:** ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హుజూర్‌నగర్‌లో నిర్వహించాల్సిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు బహిరంగసభ బలమైన ఈదురుగాలు, భారీవర్షం కారణంగా రద్దయింది. మెరుపులతో కూడిన భారీవర్షంతో పాటు పిడుగులు పడే అవకాశం ఉన్నదని ఏవియేషన్ అధికారులు సీఎం హెలికాప్టర్‌కు అనుమతి నిరాకరించడంతో సభ రద్దయినట్టు విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సభా వేదికపై ప్రకటించారు. పైలట్ల సూచన మేరకు హెలికాప్టర్‌కు అనుమతి రద్దుచేసినట్టు ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ గురువారం మధ్యాహ్నం 2 గంటలకు హుజూర్‌నగర్ బహిరంగసభకు హాజరుకావాల్సి ఉన్నది. మధ్యాహ్నం వరకు వాతావరణం పొడిగా ఉండటం.. స్వయంగా సీఎం కేసీఆర్ హాజరవుతుండటంతో టీఆర్‌ఎస్ కార్యకర్తలు, అభిమానులు భారీసంఖ్యలో సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే, అప్పటివరకు పొడిగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మేఘావృతంగా మారి.. ఈదురుగాలులు, ఉరుములతో భారీవర్షం కురిసింది. హుజూర్‌నగర్ వీధులన్నీ ప్రజలు, వాహనాలతో కిక్కిరిసిపోయాయి.

## వర్షంలోనూ సీఎం కోసం ఎదురుచూసిన కార్యకర్తలు: జగదీశ్‌రెడ్డి

**భారీ** వర్షంలోనూ కార్యకర్తలు సీఎం కేసీఆర్ రాకకోసం ఎదురుచూశారని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి తెలిపారు. ప్రచారం శనివారం ముగుస్తుండటంతో అనుసరించాల్సిన వ్యూహాలపై గురువారం హుజూర్‌నగర్‌లోని టీఆర్‌ఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షం కురుస్తున్నా అధినేతను చూడాలనే ఆరాటం ప్రజల్లో కనిపించిందన్నారు. ఎలాంటి ఏర్పాట్లు చేయకున్నా స్వచ్ఛందంగా తరలివచ్చారని,



సీఎం కేసీఆర్ ప్రయాణించే హెలికాప్టర్‌కు వర్షం కారణంగా అనుమతి లేకపోవడంతో సభ రద్దయినట్టు ప్రకటిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

వర్షంతో సభ రద్దు కావడంతో నిరాశ చెందారని చెప్పారు. ఉప ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలన్న కసి కార్యకర్తల్లో తొణికిసలాడిందని హర్షం వ్యక్తంచేశారు. సభ రద్దయిందని ప్రకటించే వరకూ ఒక్కరూ కూడా కదలకపోవడమే ఇక్కడ గులాబీ విజయానికి సంకేతమన్నారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కిశోర్, భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, లింగయ్య, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి పాల్గొన్నారు.



గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని పురపాలక కాంప్లెక్స్‌లో మంత్రి కే తారకరామారావుతో భేటీ అయిన పలు రియల్ ఎస్టేట్ సంఘాల ప్రతినిధులు

# నిర్మాణాల్లో పారదర్శక విధానం

■ దేశ ఉత్తమ విధానాల్లో మనదొకటి

■ రియల్ ఎస్టేట్‌లో హైదరాబాద్ టాప్

■ రియల్ ఎస్టేట్ సంఘాల ప్రతినిధులతో మంత్రి కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి రాష్ట్రంలో అనుసరిస్తున్న విధానం దేశంలోని ఉత్తమ విధానాల్లో ఒకటని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలకశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. భవన నిర్మాణ అనుమతుల కోసం రాష్ట్రంలో ఇప్పటికే పారదర్శక విధానాన్ని తీసుకొచ్చామని, మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్‌చేస్తూ మరింత పారదర్శకంగా ఉండే విధానానికి రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. రియల్ ఎస్టేట్ సంఘాల ప్రతినిధులు గురువారం మాసబ్ ట్యాంక్‌లోని పురపాలక కాంప్లెక్స్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిశారు. రాష్ట్రంలో భవన నిర్మాణ అనుమతులకు తీసుకొచ్చిన ప్రక్రియను ఈ సందర్భంగా వారికి వివరించారు. ఈ ప్రక్రియపై క్షేత్రస్థాయిలో వ్యక్తమవుతున్న స్పందనను అడిగి తెలుసుకున్నారు. దీన్ని మరింత సులభతరం చేసేందుకు మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారుల బృందం అధ్యయనం చేస్తున్నదని మంత్రి కేటీఆర్ పేర్కొంటూ.. బిల్డర్ల సంఘాల నుంచి ఒకరిద్దరు ప్రతినిధులు అధికారులతో కలిసి పనిచేయాలని సూచించారు. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి ప్రస్తుతం వివిధ రాష్ట్రాల్లో ఉన్న విధానాలను పరిశీలించి తెలంగాణ విధానాన్ని అత్యుత్తమమైనదిగా మార్చేందుకు సూచనలు చేయాలన్నారు. ఇప్పటికే అన్ని మున్సిపల్ విభాగాల్లో ఇ-ఆఫీస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నామని, దీంతో ఫైళ్ల అనుమతులు ఏ దశలో ఉన్నాయో ఎప్పటికప్పుడు తెలుస్తుందని తెలిపారు. దేశీయ రియల్ ఎస్టేట్ రంగంలో హైదరాబాద్ అగ్రగామిగా కొనసాగుతున్నదని, తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పలు చర్యలే ఇందుకు కారణమని చెప్పారు. హైదరాబాద్‌లో ఇప్పటికే భవన నిర్మాణ వ్యర్థాల రీసైక్లింగ్ ప్లాంట్లు ఏర్పాటుచేశామని, నిర్మాణ వ్యర్థాలను చెరువులు, ఖాళీ ప్రదేశాల్లో వేస్తే చర్యలు తప్పవన్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా రియల్ ఎస్టేట్ సంస్థలు జీహెచ్‌ఎంసీతో కలిసి పనిచేయాలని కోరారు. కేటీఆర్‌ను కలిసినవారిలో క్రెడాయ్ తెలంగాణ, క్రెడాయ్ హైదరాబాద్, ట్రెడా, తెలంగాణ బిల్డర్స్ ఫెడరేషన్, తెలంగాణ డెవలపర్స్ అసోసియేషన్ తదితరులున్నారు.

## రాష్ట్రానికి ఏడుగురు కొత్త ఐఏఎస్‌లు

■ ఏపీకి 9 మంది కేటాయింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం ఏడుగురు ఐఏఎస్ అధికారులను తెలంగాణ రాష్ట్రానికి కొత్తగా కేటాయించింది. కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వశాఖ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. 2019 బ్యాచ్‌కు చెందిన 180 మంది ఐఏఎస్ అధికారులను దేశంలోని అన్ని రాష్ట్రాలకు కేటాయించారు. ఆయా రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సిబ్బంది, శిక్షణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి ఎస్కే వర్మ సమాచారం అందించారు. ఆంధ్రప్రదేశ్‌కు 9 మంది ఐఏఎస్‌లను కేటాయించారు. తెలంగాణకు కేటాయించినవారిలో కే వరుణ్‌రెడ్డి, చిత్రామిశ్రా, పాటిల్ హేమంత్ కేశవ్ (మహారాష్ట్ర), గరిమా అగర్వాల్ (మధ్యప్రదేశ్), దీపక్ తివారి, ప్రతిమా సింగ్ (ఉత్తరాఖండ్), అంకిత్ ( ఉత్తరప్రదేశ్) ఉన్నారు. తెలంగాణకు చెందిన ముగ్గురు ఐఏఎస్‌లు ఇతర రాష్ట్రాల క్యాడర్‌గా ఆప్షన్ ఎంచుకున్నారు. వారిలో మహ్మద్ అబ్దుల్‌షాహిద్ (పశ్చిమ బెంగాల్), బీ వైష్ణవి (త్రిపుర), నీలం లలితాఆదిత్య ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకున్నారు.

# ఆర్టీసీ సమ్మెకు త్వరలో పరిష్కారం

■ సీఎం, సీఎస్‌ను కలిశాక నమ్మకం ఏర్పడింది

■ చర్చల్లో భాగస్వాములమవుతాం

■ ప్రభుత్వం మమ్మల్ని ఎప్పుడూ భయపెట్టలేదు

■ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ మమత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ సమ్మె త్వరలోనే పరిష్కారమవుతుందని, కార్మికులెవరూ అధైర్యపడవద్దని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ వీ మమత అన్నారు. కార్మికులు, ఉద్యోగులకు ఉద్యోగసంఘ జేఏసీ అండగా ఉన్నదని తెలిపారు. ఆర్టీసీ సమ్మెతోపాటు ఉద్యోగులకు సంబంధించిన 17 అంశాలపై ఉద్యోగ జేఏసీ గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి వినతిపత్రం సమర్పించింది. సీఎస్‌తో సుమారు గంటపాటు వివిధ అంశాలపై చర్చించింది. అనంతరం కారం రవీందర్‌రెడ్డి, మమత మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెతోపాటు ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలు త్వరలోనే పరిష్కారమవుతాయని తెలిపారు. ఇప్పటికే సీఎం కేసీఆర్‌ను కలిశామని, ఇప్పుడు సీఎస్‌ను కలిసి చర్చించాక నమ్మకం ఏర్పడిందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వరుసగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం కూడా కారణమేనని చెప్పారు. హుజూర్‌నగర్ ఉపఎన్నిక తర్వాత ఉద్యోగుల జేఏసీతో చర్చించి, సమస్యలు పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, సీఎస్ కూడా అదేవిషయం చెప్పారని తెలిపారు. ఆర్టీసీ చర్చల్లో ఉద్యోగ సంఘాల జేఏసీ భాగస్వామ్యం అవుతుందని, సెల్ఫ్ డిస్మిస్ అనే పదం ఎక్కడా లేదని, దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల కార్యాచరణకు సంఘీభావం ప్రకటిస్తున్నామని, బంద్ నేపథ్యంలో భోజన విరామ సమయంలో ఉద్యోగులు ప్రదర్శన తెలుపుతారని పేర్కొన్నారు. ఉద్యోగసంఘాల నేతలను ప్రభుత్వం భయపెడుతున్నదంటూ వదంతులు సృష్టిస్తున్నారని, 'లోగుట్టూ ఏ గుట్టూ లేదని.. రాష్ట్రంలోని ఎనిమిది లక్షల మంది ఉద్యోగుల గుట్టే మా లోగుట్టు' అని తెలిపారు. సమావేశంలో జేఏసీ సెక్రటరీలు మామిళ్ల రాజేందర్, ఏనుగుల సత్యనారాయణ, తెలంగాణ టీచర్స్ యూనియన్ అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ వంగ రవీందర్‌రెడ్డి, టీయూటీఎఫ్ మల్లారెడ్డి, ఇంటర్‌విద్య జేఏసీ కృష్ణకుమార్, టీసీటీజీవో అధ్యక్షుడు వెంకటయ్య, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు నర్సరాజు, పలు సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, టీఎన్జీవో, టీజీవో ప్రతినిధులు పాల్గొన్నారు.



సీఎస్ ఎస్కే జోషికి వినతిపత్రం సమర్పిస్తున్న ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు

**ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోండి: గవర్నర్**

ఆర్టీసీ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లుచేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్.. రాష్ట్ర రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మను ఆదేశించారు. ఆర్టీసీ సమ్మె, ప్రత్యామ్నాయ రవాణాఏర్పాట్లను గురువారం సునీల్‌శర్మ రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు వివరించారు. ఆర్టీసీ సమ్మెపై రాజకీయపార్టీలు, సంస్థలు పలు ప్రతిపాదనలు తీసుకొచ్చాయని ఈ సందర్భంగా గవర్నర్ తెలిపారు. ప్రస్తుతం 9వేల బస్సులు నడుస్తున్నాయని, ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేయకుండా అరికట్టడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశామని సునీల్‌కుమార్ పేర్కొన్నారు. టికెట్ల జారీకి యంత్రాలను వినియోగిస్తున్నామని తెలిపారు.

**హైకోర్టులో ఎండగడతాం: ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి**

ప్రభుత్వ వైఖరిని హైకోర్టులో ఎండగడతామని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. ప్రజలందరూ తమ సమ్మెకు మద్దతు తెలుపాలని, మేధావులు స్పందించాలని కోరారు. గురువారం టీఎంయూ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు ఆహ్వానిస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

## 'ఇన్నోవేషన్ ఇండెక్స్'లో తెలంగాణ @ 4

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నీతి ఆయోగ్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాంపిటీటివ్‌నెస్ సంయుక్తంగా విడుదల చేసిన 'ఇండియా ఇన్నోవేషన్ ఇండెక్స్-2019'లో తెలంగాణ నాలుగో స్థానం లో నిలిచింది. సీఎం కేసీఆర్ దూరదృష్టితో తీసుకొచ్చిన విధానాల అమలుతో తెలంగాణ ఉన్నత స్థితికి చేరింది. ఈ సూచీలో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తొలిమూడు స్థానాల్లో ఉన్నాయి. బీహార్, జార్ఖండ్, పంజాబ్ చివరి స్థానాల్లో ఉన్నాయి.

## సికింద్రాబాద్- పాట్నా మధ్య నాలుగు రైళ్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఛాత్ పండుగ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సికింద్రాబాద్- పాట్నా మధ్య 29, 30 తేదీల్లో నాలుగు రైళ్లు నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైళ్లు కాజీపేట, రామగుండం, బెల్లంపల్లి, సిర్పూర్, బల్లార్షలో ఆగుతాయని తెలిపింది.

**కాచిగూడ- నిజామాబాద్ మధ్య రెండు రైళ్లు**

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ- నిజామాబాద్ మధ్య ఈ నెల 18న రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్టు రైల్వే ప్రకటించింది.

# ఓటుతో రుణం తీర్చుకుందాం

■ తండాలను పంచాయతీలుగా మార్చింది టీఆర్‌ఎస్ ప్రభుత్వమే

■ హుజూర్‌నగర్ ఎన్నికల ప్రచారంలో మంత్రి సత్యవతి రాథోడ్

■ కేసీఆర్ పాలనలోనే సంక్షేమానికి స్వర్ణయుగం

■ టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి



చౌటపల్లిలో ప్రచారం చేస్తున్న టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి, (ఇన్‌సెట్) పుల్గంబండతండాలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

**నేరేడుచర్ల/మఠంపల్లి:** హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో టీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి విజయం ఖరారైందని గిరిజన, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గురువారం సాయంత్రం నేరేడుచర్ల మండలంలోని పుల్గంబండతండా గ్రామపంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గిరిజనుల హృదయాలను దోచుకునేలా లంబాడ భాషలో ప్రసంగించి టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి అభివృద్ధి చేస్తున్న టీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. కోదాడలో ఓడిపోయిన ఉత్తమ్ పద్మావతిని ఇప్పుడు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టి ప్రజలను మరోసారి మోసం చేయడానికి వస్తున్నారని విమర్శించారు. పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇక్కడ టీఆర్‌ఎస్ గెలిస్తే ప్రజలకు మరింత లాభంచేకూరుతుందని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ దుకాణం బంద్ అయ్యిందని, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఉంటేనే సాధ్యపడుతుందన్నారు. సీఎం కేసీఆర్ పాలనలోనే సంక్షేమానికి స్వర్ణయుగం వచ్చిందని, అన్ని వర్గాల సంక్షేమానికి అవసరమైన పథకాలను అమలు చేస్తున్న ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని టీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి చెప్పారు. మఠంపల్లి మండలంలో ఆయన ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ప్రజలంతా ఏకమై కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు.

## ఆర్టీసీపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

■ ప్రొఫెసర్ నాగేశ్వర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ కార్మికుల పట్ల కక్షపూరిత వైఖరిని విడనాడి ప్రభుత్వం చర్చలు జరుపాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ సూచించారు. ఆర్టీసీపై తప్పుడు ప్రచారాన్ని నిలిపివేయాలన్నారు. సంస్థను తనకిస్తే వేల కోట్ల లాభాల్లో నడిపిస్తానని చెప్పారు. ఆర్టీసీ కార్మికులు ఈ నెల 19న జరుపతలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతుగా.. గురువారం ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన వామపక్షాల సామూహిక దీక్షను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. డీజిల్ ధరలను ప్రభుత్వం భరిస్తే ఆర్టీసీకి నష్టాలు రావన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్రకార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్రకార్యదర్శి చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న ఆటోబంద్‌ను నిర్వహిస్తున్నట్టు తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ జేఏసీ తెలిపింది.

**విలీన పిటిషన్‌పై 21న హైకోర్టు విచారణ**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ హైకోర్టులో టీఎస్‌ఆర్టీసీ బహుజన కార్మిక యూనియన్ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ ఈ నెల 21కి వాయిదాపడింది.





వనపర్తి బస్టాండ్‌లో బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

# ప్రత్యామ్నాయం పక్కాగా..

■ రోడ్డెక్కిన 74.56 శాతం బస్సులు

■ పూర్తిస్థాయిలో నడిపేందుకు అధికారుల చర్యలు

■ మిషన్లతో టికెట్ల జారీ ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న ప్రత్యామ్నాయ చర్యలు పూర్తిస్థాయిలో విజయవంతమవుతున్నాయి. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వందశాతం బస్సులను నడిపేదిశగా అధికారులు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నారు. రెండ్రోజులుగా పరిశీలిస్తే రోడ్డెక్కుతున్న బస్సుల శాతం క్రమంగా పెరుగుతున్నది. ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఉన్నతాధికారులతో ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ సమీక్షిస్తున్నారు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ తగిన సూచనలు ఇస్తున్నారు. గురువారం అత్యధికంగా 74.56 శాతంతో 6,672 బస్సులు నడిచినట్టు ఆర్టీసీ యాజమాన్యం ప్రకటించింది. ఇందులో 4,705 ఆర్టీసీ బస్సులు కాగా, 1,967 అద్దె బస్సులు ఉన్నాయి. రోజువారీ పద్ధతిలో 4,705 మంది ప్రైవేట్ డ్రైవర్లు, 6,672 మంది కండక్టర్లు విధులు నిర్వహించారు. 1,941 బస్సుల్లో టికెట్ల జారీప్రక్రియ ప్రారంభం కాగా, 1,024 బస్సుల్లో టిమ్స్ ద్వారా టికెట్లు ఇచ్చారు. ప్రభుత్వం ఆదేశించిన వందశాతం బస్సులను నడిపించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వీలైనంత త్వరలోనే సాధారణ స్థితి వస్తుందని అధికారులు తెలిపారు.

## ఏపీపీఎస్సీలో ఇంటర్వ్యూలు రద్దు

■ మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు భర్తీ: సీఎం జగన్

**అమరావతి:** ఏపీపీఎస్సీ ద్వారా 2020 జనవరి నుంచి భర్తీచేసే ఉద్యోగ నియామకాల్లో ఇంటర్వ్యూ విధానాన్ని రద్దు చేయాలని ఏపీ సీఎం వైఎస్ జగన్ నిర్ణయించారు. ఇకనుంచి కేవలం రాత పరీక్షల్లో మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ఏపీపీఎస్సీ జారీచేసే ప్రతి నోటిఫికేషన్ కోర్టు కేసులకు దారితీస్తున్నదని అధికారులు చెప్పగా, ఇకపై అలాంటి తప్పులు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు.

## హెబియస్ కార్పస్‌పై కౌంటర్‌కు కోర్టు ఆదేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై నలమాస కృష్ణ, మద్దిలేటిలను అరెస్టు చేసిన విషయమై పోలీసులు సోమవారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. కృష్ణ, మద్దిలేటి కుటుంబసభ్యులు దాఖలుచేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన ధర్మాసనం.. అరెస్టుల సందర్భంగా సీఆర్పీసీ సెక్షన్ 41 (బీ)ని అనుసరించారా? అని పోలీసుల తరపు న్యాయవాదిని ప్రశ్నించింది.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,052 | 11,586 |
| ↗453 | ↗122 |

ముడి చమురు (బ్రెంట్) ↗ 59.59 డాలర్లు

| బంగారం ధరలు | |
|---|---|
| న్యూఢిల్లీ (రూ.లలో) | |
| 24 క్యారెట్లు | 38,985 |
| 22 క్యారెట్లు | --- |
| వెండి (కిలో) | 47,318 |

## సైయెంట్ లాభంలో భారీ క్షీణత

రూ.6 మధ్యంతర డివిడెండ్ ప్రకటన

**హైదరాబాద్, అక్టోబర్ 17:** హైదరాబాద్ కేంద్రంగా ఐటీ సేవలు అందిస్తున్న ప్రముఖ టెక్నాలజీ సంస్థ సైయెంట్ నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.98.5 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.127.1 కోట్ల లాభంతో పోలిస్తే 22.5 శాతం క్షీణించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం కూడా రూ.1,187 కోట్ల నుంచి రూ.1,158.9 కోట్లకు పడిపోయింది. ఎబిటా మార్జిన్లు తగ్గడం, ఇతర మార్గాల ద్వారా రావాల్సిన ఆదాయంలో గండిపడటం వల్లనే నికర లాభం భారీగా పడిపోయిందని సైయెంట్ ఎండీ, సీఈవో కృష్ణ బొడనపు తెలిపారు. డాలర్ రూపంలో కంపెనీ నికర 22.8 శాతం తగ్గి 13.8 మిలియన్ డాలర్లకు పడిపోగా, ఆదాయంలో 2.8 శాతం గండిపడి 164.2 మిలియన్ డాలర్లకు పడిపోయిందన్నారు.

# ఆఫీస్‌కు హైదరాబాదే అడ్డా

- జూలై-సెప్టెంబర్‌లో 41 లక్షల చదరపు అడుగులకు డిమాండ్
- రెండింతలకుపైగా వృద్ధి.. దేశంలోనే ఆకర్షణీయం
- తాజా సీబీఆర్‌ఈ గణాంకాల్లో వెల్లడి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:** అన్ని రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్‌లో ఆఫీసులను ఏర్పాటు చేసుకోవడానికి దేశ, విదేశీ ప్రముఖ సంస్థలు పోటీపడుతున్నాయి. అందుబాటులో సకల సదుపాయాలు, సుస్థిర రాజకీయ, మెరుగైన సాంకేతిక వనరులుండటంతో భాగ్యనగరం.. కార్యాలయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోతున్నది. అందుకే దేశంలోనే ఆకర్షణీయ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌గా వెలుగొందుతున్నది. ప్రాపర్టీ కన్సల్టెంట్ సీబీఆర్‌ఈ తాజా వివరాల ప్రకారం ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో గతంతో పోల్చితే ఏకంగా రెండింతలకుపైగా ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఏర్పడింది. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 1.7 మిలియన్ (17 లక్షలు) చదరపు అడుగుల లీజింగ్ జరుగగా, ఈసారి 4.1 మిలియన్ (41 లక్షలు) చదరపు అడుగుల లీజింగ్ అయినట్లు గురువారం సీబీఆర్‌ఈ తమ 'భారత కార్యాలయ విపణి ముఖచిత్రం-3వ త్రైమాసికం 2019' నివేదికలో స్పష్టం చేసింది. హైదరాబాద్‌లో దాదాపు అన్ని జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు కేంద్రాలుండగా, కొన్నింటికి ప్రధాన కేంద్రాలూ ఉన్నాయి. గ్లోబల్ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్.. అమెరికాయేతర దేశాల్లో అతిపెద్ద క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇక ఐటీ రంగం గురించైతే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నగర శివార్లలో ఔషధ తయారీ కేంద్రాలూ ఉన్న సంగతి విదితమే. వివిధ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకూ ఇక్కడ ప్రధాన కార్యాలయాలున్నాయి.

### ఇతర నగరాల్లో..

క్రిందటిసారితో చూస్తే.. చెన్నైలో కార్యాలయాల ఏర్పాటు కోసం స్థలాల లీజు 0.7 మిలియన్ చదరపు అడుగుల నుంచి 1.8 మిలియన్ చదరపు అడుగులకు పెరిగింది. పుణెలో ఇది 1.3 మిలియన్ చదరపు అడుగుల నుంచి 1.4 మిలియన్ చదరపు అడుగులకు చేరింది. అయితే దేశ వాణిజ్య రాజధాని ముంబైలో 1.5 మిలియన్ చదరపు అడుగులకు పడిపోయింది. నిరుడు 1.7 మిలియన్ చదరపు అడుగులుగా ఉండటం గమనార్హం. చివరకు బెంగళూరులోనూ 4.4 మిలియన్ చదరపు అడుగుల నుంచి 4 మిలియన్ చదరపు అడుగులకు డిమాండ్ దిగజారింది. కొచ్చిలోనైతే లక్ష చదరపు అడుగుల నుంచి 10 వేల చదరపు అడుగులకు పతనమైంది. ఇక దేశ రాజధాని ఢిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఆఫీస్ స్పేస్ డిమాండ్ 2.3 మిలియన్ చదరపు అడుగుల వద్ద స్థిరంగా ఉన్నది. కోల్‌కతా (2 లక్షల చదరపు అడుగులు), అహ్మదాబాద్ (లక్ష చదరపు అడుగులు)లూ యథాతథంగా ఉన్నాయి. దీంతో హైదరాబాదే ఆకర్షణీయంగా ఉన్నట్లు తేలింది. కాగా, మొత్తం ఈ 9 నగరాల్లో పోయినసారితో పోల్చితే 23 శాతం వృద్ధి నమోదై 15.4 మిలియన్ చదరపు అడుగులకు ఆఫీస్ స్పేస్ డిమాండ్ చేరిందని సీబీఆర్‌ఈ తెలియజేసింది.

### 60 మిలియన్ల మార్కుకు..

ఈ ఏడాది ఆరంభం నుంచి సెప్టెంబర్ ముగింపు వరకు 47 మిలియన్ చదరపు అడుగులకుపైగా ఆఫీసు స్థలం లీజుకు పోయిందని సీబీఆర్‌ఈ తెలియజేసింది. నిరుడు కండే 30 శాతానికిపైగా పెరిగిందని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే డిసెంబర్ ఆఖరుకల్లా 60 మిలియన్ చదరపు అడుగుల మార్కును దాటవచ్చన్న విశ్వాసాన్ని భారత్, ఆగ్నేయాసియా, మధ్య ప్రాచ్య, ఆఫ్రికా దేశాల సీబీఆర్‌ఈ విభాగం చైర్మన్, సీఈవో అన్షుమన్ మ్యాగజైన్ వ్యక్తం చేశారు. ముఖ్యంగా టెక్నాలజీ సంస్థలు విస్తరణ బాట పడుతుండటం ఆఫీస్ స్పేస్ మార్కెట్‌కు కలిసొస్తున్నదని అభిప్రాయపడింది. దేశీయ రియల్ ఎస్టేట్‌లో గృహ నిర్మాణ రంగం ఏండ్ల తరబడి మందగమనాన్ని చవిచూస్తున్నా.. వాణిజ్య నిర్మాణ రంగం మాత్రం దూసుకుపోతున్నదని సీబీఆర్‌ఈ పేర్కొన్నది. ఇక మొత్తం లీజుల్లో టెక్నాలజీ సంస్థల వాటా మూడో వంతుకు సమానంగా ఉంటే, రిసెర్చ్, కన్సల్టింగ్, అనలిటిక్స్ కంపెనీలు 19 శాతంతో తర్వాతి స్థానంలో ఉన్నాయి. లీజుల్లో ఫ్లెక్సిబుల్ స్పేస్ ఆపరేటర్లు (15 శాతం), ఇంజినీరింగ్, తయారీ సంస్థలూ (7 శాతం) ఆకట్టుకున్నాయి.

### మాంద్యంలోనూ మనమే..



దేశవ్యాప్తంగా తొమ్మిది ప్రధాన నగరాల్లోగల ఆఫీస్ స్పేస్‌కున్న డిమాండ్ వివరాలను సీబీఆర్‌ఈ ఈ సందర్భంగా వెల్లడించగా, అందులో హైదరాబాద్‌దే అగ్రస్థానం. భాగ్యనగరంతోపాటు చెన్నై, పుణె, ముంబై, బెంగళూరు, కొచ్చి, ఢిల్లీ-ఎన్‌సీఆర్, కోల్‌కతా, అహ్మదాబాద్ నగరాల్లో గత మూడు నెలల్లో జరిగిన ఆఫీస్ స్పేస్ లీజింగ్ గణాంకాలను సీబీఆర్‌ఈ విడుదల చేసింది. ఇందులో లీజులపరంగా, వృద్ధిపరంగా హైదరాబాద్‌దే పైచేయి. అన్ని నగరాల్లోకెల్లా అత్యధికంగా 41 లక్షల చదరపు అడుగుల లీజింగ్‌తో, దాదాపు 150 శాతం వృద్ధితో భాగ్యనగరం సత్తా చాటింది. ముఖ్యంగా ఆర్థిక మందగమనం పరిస్థితులు వేధిస్తున్నా.. ముంబై, బెంగళూరు, ఢిల్లీలను అధిగమించి వ్యాపార, పారిశ్రామిక సంస్థలను ఆకట్టుకున్నది.

## సత్య నాదెళ్ల వేతనం రూ.305 కోట్లు

2018-19లో 66 శాతం పెరిగిన జీతం



**వాషింగ్టన్, అక్టోబర్ 17:** టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సీఈవో, భారత సంతతికి చెందిన సత్య నాదెళ్ళ.. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను 42.9 మిలియన్ డాలర్ల వార్షిక వేతనాన్ని అందుకున్నారు. మన కరెన్సీలో ఇది రూ.305 కోట్లు. అంతక్రితం ఏడాది పొందిన వేతనంతో పోలిస్తే ఇది 66 శాతం అధికమని మీడియా రిపోర్ట్ వెల్లడించింది. గతేడాదికిగాను నాదెళ్ల జీతం 2.3 మిలియన్ డాలర్లు పెరుగగా, కంపెనీకి చెందిన స్టాకులు అత్యధికంగా లాభపడటం ఆయన ఆదాయం పెరుగడానికి దోహదం చేసిందని సీఎన్‌ఎన్ బిజినెస్ వెల్లడించింది. 2018-19లో 29.6 మిలియన్ డాలర్లు స్టాక్ రూపంలో లభించగా, 10.7 మిలియన్ డాలర్లు నాన్-ఈక్విటీ రాయితీలు, మరో 1.11 లక్షల డాలర్లు ఇతర పరిహారం కింద పొందారు. గతేడాది సంస్థ ఆర్థిక పనితీరు రికార్డు స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకున్నదని, వాటాదారులకు అత్యధికంగా పంచిన ఏడాదని, 30.9 బిలియన్ డాలర్లను షేర్లను తిరిగి కొనుగోలు చేయడానికి, డివిడెండ్ రూపంలో పంచినట్లు కంపెనీ ఇండిపెండెంట్ డైరెక్టర్ తెలిపారు. సత్య నాదెళ్ల నాయకత్వంలో సంస్థ అన్ని రంగాల్లో దూసుకుపోయిందని, ముఖ్యంగా షేరు హోల్డర్లు గట్టి నమ్మకాన్ని వ్యక్తంచేశారని, గడిచిన ఐదేండ్లలో కంపెనీ మార్కెట్ విలువ 509 బిలియన్ డాలర్ల (302 బిలియన్ డాలర్ల నుంచి 811 బిలియన్ డాలర్లకు) మేర పెరిగిందన్నారు. నూతన టెక్నాలజీ, ఇతర మార్కెట్లో ప్రవేశించడానికి ఆయన తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇచ్చాయని చెప్పారు. హైదరాబాద్‌లో జన్మించిన నాదెళ్ల.. 2017-18 ఏడాదికిగాను 25.8 మిలియన్ డాలర్ల వేతనాన్ని పొందారు. కంపెనీ జూలై 1 నుంచి జూన్ 30 మధ్యకాలాన్ని ఆర్థిక సంవత్సరంగా వ్యవహరిస్తున్నది. 2014లో మైక్రోసాఫ్ట్ సీఈవోగా నియమితులైన నాటి నుంచి కంపెనీ క్లౌడ్ కంప్యూటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. కాగా, 2018 సంవత్సరంలో యాపిల్ సీఈవో టిమ్ కుక్ 18.7 మిలియన్ డాలర్ల(రూ.133 కోట్లు) వేతనాన్ని అందుకోగా, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ 1.9 మిలియన్ డాలర్ల(రూ.13.51 కోట్లు) పొందిన జీతం కంటే సత్య నాదెళ్ల అత్యధికంగా అందుకోవడం విశేషం.





హానర్ అక్వాంటిస్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న హానర్ హోమ్స్ డైరెక్టర్లు స్వప్న కుమార్, బాలు చౌదరి, పీ వెంకటేశ్వర్లు, ఎస్ రాజమౌళి

## హానర్ హోమ్స్ రెండో ప్రాజెక్టు

రూ.800 కోట్లతో నిర్మించతలపెట్టిన సంస్థ

**హైదరాబాద్, అక్టోబర్ 17:** రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో అనతికాలంలో దూసుకుపోతున్న హానర్ హోమ్స్ తన రెండో ప్రాజెక్టైన 'హానర్ అక్వాంటిస్'ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. గచ్చిబౌలికి అత్యంత సమీపంలోని గోపన్‌పల్లి వద్ద 10.5 ఎకరాల స్థలంలో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టుకోసం రూ.750 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు కంపెనీ డైరెక్టర్ బాలు చౌదరి తెలిపారు. మొదటి ప్రాజెక్టుకు వినియోగదారుల నుంచి వచ్చిన విశేషణ స్పందన నేపథ్యంలో రెండో ప్రాజెక్టును అత్యంత వైభవంగా ప్రారంభించినట్లు, ప్రారంభ ఆఫర్ కింద చదరపు అడుగు ధరను రూ.5,499గా నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులోభాగంగా ఆరు టవర్లలో 1,310 చదరపు అడుగుల టూ బెడ్‌రూంతోపాటు 1,965 చదరపు అడుగుల 3 బెడ్ రూమ్ కలిగిన 1,216 అపార్టుమెంట్లను నిర్మిస్తున్నది సంస్థ. చట్టపరమైన అనుమతులతోపాటు తెలంగాణ రెరా ఆమోదం కలిగిన ఈ బృహత్ ప్రాజెక్టును వచ్చే ఐదేండ్లలో పూర్తి చేయగలమనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తంచేశారు. కాలీ స్థలంలో టెన్నిస్ కోర్ట్, బాస్కెట్ బాల్ కోర్ట్, క్రికెట్ ప్రాక్టిస్ నెట్, వాకింగ్ చేయడానికి ప్రత్యేక ట్రాక్, క్లబ్ హౌజ్‌లను కూడా నెలకొల్పనున్నది.

## హైదరాబాద్‌లో జినోమ్‌ల్యాబ్ ప్లాంట్

- మార్కెట్లోకి తినే కప్పులు

**హైదరాబాద్, అక్టోబర్ 17:** హైదరాబాద్ కేంద్రస్థానంగా పనిచేస్తున్న పరిశోధన సంస్థ జినోమ్‌ల్యాబ్స్ బయో ప్రైవేట్ లిమిటెడ్..మార్కెట్లోకి తినగలిగే కప్పులను విడుదల చేసింది. టీ, కాఫీ తాగిన తర్వాత ఈ కప్పులను బిస్కెట్ల మాదిరిగా తినడానికి ప్రత్యేక రుచితో తయారు చేసింది సంస్థ. ప్రస్తుతానికి విదేశాల నుంచి దిగుమతి చేసుకొని వీటిని విక్రయిస్తున్న సంస్థ..వచ్చే పది నెలల్లో వీటిని తయారు చేయడానికి హైదరాబాద్‌లో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు కంపెనీ ఈడీ సురేశ్ రాజు తెలిపారు. ఇందుకోసం హైదరాబాద్‌కు సమీపంలో యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి రూ.25 కోట్ల వరకు పెట్టుబడి పెడుతున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం ఒక్క కప్పు ధర రూ.25 ఉండగా, హైదరాబాద్‌లో తయారైతే ఈ ధర రూ.10కి తగ్గనున్నదని చెప్పారు. ప్లాస్టిక్, పేపర్ కప్పులకు ప్రత్యామ్నాయంగా వీటిని వినియోగిస్తే వాతావరణం కాలుష్యం కాదని, అలాగే ఆహార నియంత్రించడానికి వీలుంటుందని ఆయన తెలిపారు.

# అమ్మో.. ఈ సంక్షోభం పెద్దదే

- 2008 కంటే దారుణంగా ఆర్థిక మందగమనం
- పెద్ద ఎత్తున ఉద్దీపనలు అవసరం: గోల్డ్‌మన్స్ సాచ్స్
- వినిమయ సామర్థ్యం పెంచాలని సూచన





**ముంబై, అక్టోబర్ 17:** దేశ ఆర్థిక వ్యవస్థలో ప్రస్తుతం నెలకొన్న మందగమనం.. చాలా పెద్దదని, 2008లో సంభవించిన ఆర్థిక మాంద్యం కంటే తీవ్రమైనదని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ గోల్డ్‌మన్స్ సాచ్స్ ఆందోళన వ్యక్తం చేసింది. వినిమయ సామర్థ్యం దారుణంగా పడిపోయిందని, ఇది భారత ఆర్థిక వ్యవస్థను ఎంతగానో దెబ్బతీస్తున్నదని వెల్లడించింది. ప్రస్తుత ఈ ఆర్థిక ఇబ్బందులకు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల సంక్షోభం అసలు కారణం కాదన్న గోల్డ్‌మన్ సాచ్స్.. పెద్ద ఎత్తున ఉద్దీపనల అవసరం ఉందని అభిప్రాయపడింది. వినిమయంలో ఏర్పడిన మందగమనం.. ఎన్‌బీఎఫ్‌సీ సంక్షోభం వల్లేనని చాలా మంది అంటున్నారని, అందులో ఎంత మాత్రం కూడా నిజం లేదని గోల్డ్‌మన్ సాచ్స్ ముఖ్య ఆర్థికవేత్త ప్రాచీ మిశ్రా అన్నారు. ఎన్‌బీఎఫ్‌సీ సంక్షోభానికి కారణమైన ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ గతేడాది ఆగస్టు-సెప్టెంబర్‌లో దివాలా తీసిందని, కానీ నిరుడు జనవరి నుంచే వినియోగ సామర్థ్యం పడిపోయిందని ఆమె గుర్తుచేశారు. ఎన్‌బీఎఫ్‌సీలకు బ్యాంకుల నుంచి రుణాలు తదితర ఆర్థిక సాయం ఆగిపోవడమే దీనికి ప్రధాన కారణమని గురువారం ఇక్కడ స్వీయ నేతృత్వంలో జరిగిన ఓ కార్యక్రమంలో పేర్కొన్నారు. దేశ జీడీపీ పతనంలో మూడో వంతు వాటా.. దిగజారిన వినిమయానిదేనని ఆమె అన్నారు. అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులూ భారత వృద్ధిరేటు క్షీణతకు కారణంగా నిలిచాయని చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) వృద్ధిరేటు 6 శాతమేనన్న మిశ్రా.. రిజర్వ్ బ్యాంక్ వరుస వడ్డీరేట్ల కోతలతో ద్వితీయార్ధంలో పరిస్థితులు చక్కబడే వీలుందన్నారు. ఇప్పటి ఆర్థిక సంక్షోభం కంటే 2008 ఆర్థిక మాంద్యం స్వభావం తాత్కాలికంగా కనిపించిందని ఈ సందర్భంగా ఆమె వ్యాఖ్యానించారు. కాగా, ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంక్‌లతోపాటు ప్రముఖ దేశ, విదేశీ రేటింగ్ ఏజెన్సీలు భారత జీడీపీ అంచనాలను ఈ ఆర్థిక సంవత్సరానికిగాను పెద్ద ఎత్తున కోత పెట్టిన విషయం తెలిసిందే. అయితే ఆర్థిక సంస్కరణల బాట పట్టిన నరేంద్ర మోదీ సర్కారు మాత్రం.. జీడీపీ ఆశాజనకంగా ఉంటుందన్న విశ్వాసాన్ని కనబరుస్తున్నది. ప్రస్తుత మందగమనాన్ని తాత్కాలిక పరిణామంగా అభివర్ణిస్తున్నది.

### తగ్గనున్న ఎగమతులు: జీజేఈపీసీ

ఈ ఆర్థిక సంవత్సరంలో రత్నాలు, ఆభరణాల ఎగుమతులు గత ఆర్థిక సంవత్సరం (2018-19)తో పోల్చితే 5 నుంచి 10 శాతం తగ్గవచ్చని రత్నాలు, ఆభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) అంచనా వేసింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం, హాంకాంగ్‌లో నిరసన జ్వాలలు, మధ్య ప్రాచ్యంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్) అమలు వంటివి భారత ఎగుమతులను ప్రభావితం చేస్తున్నాయని జీజేఈపీసీ వైస్ చైర్మన్ కోలిన్ షా ఇక్కడ పీటీఐతో అన్నారు. గత నెల రత్నాలు, ఆభరణాల ఎగుమతులు 7.43 శాతం క్షీణించాయని తెలిపారు.

# నిందలు ఆపండి..!

- ప్రతీ సమస్యకు కారణం మేమేనా?
- కేంద్రంపై మన్మోహన్ ధ్వజం



**ముంబై, అక్టోబర్ 17:** ప్రతీ ఆర్థిక సంక్షోభానికి యూపీఏ ప్రభుత్వాన్ని నిందించడం ప్రస్తుత మోదీ సర్కారుకు ఓ అలవాటైపోయిందని మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ మండిపడ్డారు. బుధవారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అమెరికాలో మన్మోహన్ సింగ్, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్‌లపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. దేశంలో బ్యాంకింగ్ రంగ సంక్షోభానికి కారణం ఈ ఇరువురేనని విరుచుకుపడ్డ సంగతీ విదితమే. ఈ నేపథ్యంలో గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'మా పాలనలో జరిగిన తప్పుల నుంచి మోదీ సర్కారు గుణపాఠాలు నేర్చుకుంటే బాగుండేది. ఇప్పుడున్న సమస్యలకు చక్కని పరిష్కారాలు దొరికేవి. నీరవ్ మోదీ, ఇతర రుణ ఎగవేతదారులు విదేశాలకు పారిపోయి ఉండేవారు కాదు. బ్యాంకుల పరిస్థితి మరింత దిగజారేది కాదు' అని చురకలంటించారు.

### ఐదున్నరేండ్లు చాల్లేదా..

గత ప్రభుత్వ లోపాలను సరిదిద్దడానికి ఐదున్నరేండ్లు చాల్లేదా?.. అని మన్మోహన్ సింగ్ ఈ సందర్భంగా ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని నిలదీశారు. పదేండ్ల పాలనలో మేము అన్నీ తప్పులనే చేస్తే.. ఈ ఐదున్నరేండ్లలో మీరేం వెలగబెట్టారన్నారు. ప్రజలకు చక్కని పాలనను అందించడానికి కావాల్సినంత సమయం ఈ ప్రభుత్వానికి లభించిందని, అయినా ఆ పని చేయకుండా.. గత ప్రభుత్వాలపై ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా ఈ చౌకబారు ఆరోపణల్ని ఆపేసి, పాలనాపరమైన అంశాలపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

### ఆ కల నెరవేరదు

దేశ ఆర్థిక వ్యవస్థను 2024కల్లా 5 లక్షల కోట్ల డాలర్లకు చేర్చాలన్న మోదీ సర్కారు కల నెరవేరే అవకాశాలే లేవని మన్మోహన్ జోస్యం చెప్పారు. ఏటేటా వృద్ధిరేటు క్షీణిస్తూ పోతున్నదని, ఇలాంటి తరుణంలో అలాంటి లక్ష్యం ఎలా? సాధ్యమని ప్రశ్నించారు.

# పెట్టుబడులకు భారతే ఉత్తమం

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



**వాషింగ్టన్, అక్టోబర్ 17:** పెట్టుబడులు పెట్టడానికి ప్రపంచంలో భారత్ కంటే అనుకూలమైన దేశం లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆమె బుధవారం ఇక్కడ అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విదేశీ మదుపరులనుద్దేశించి మాట్లాడుతూ 'నేటికీ అత్యంత వృద్ధిదాయక దేశం భారతే. మా దేశంలో అత్యుత్తమ నైపుణ్యం కలిగిన కార్మిక శక్తి ఉన్నది' అన్నారు. తమ ప్రభుత్వం సంస్కరణలను ఆపబోదని స్పష్టం చేశారు. భారత్ ఓ స్వేచ్ఛాయుత, పారదర్శక విధానాల దేశమని, అనుమతులకు ఆలస్యం ఉండదని, కాబట్టి పెట్టుబడులతో రావాలని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య మండలితో కలిసి ఫిక్కీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. అంతకుముందు ఫిక్కీతోపాటు బ్యాంక్ ఆఫ్ అమెరికా, సిటీ బ్యాంక్‌లతో కలిసి అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య మండలి.. సంస్థాగత మదుపరులతో న్యూయార్క్‌లో సమావేశం నిర్వహించింది. బీమా, రుణ పునర్వ్యవస్థీకరణ, ప్రైవేట్ ఈక్విటీ సంస్థలు, ఈక్విటీ మదుపరులు, బ్యాంకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# 39 వేలపైకి సెన్సెక్స్

453 పాయింట్లు లాభపడిన సూచీ.. 122 పాయింట్లు ఎగిసిన నిఫ్టీ





**ముంబై, అక్టోబర్ 17:** స్టాక్ మార్కెట్లు వరుసగా ఐదోరోజు భారీ లాభాల్లో ముగిశాయి. బ్రిటన్, యూరోపియన్ దేశాల మధ్య కుదిరిన బ్రెగ్జిట్ ఒప్పందం త్వరలో పూర్తికానున్నట్లు బ్రిటన్ ప్రకటించడంతో అంతర్జాతీయ మార్కెట్లు ఒక్కసారిగా పుంజుకున్నాయి. వీటికితోడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరిన్ని ఉద్దీపన చర్యలు ఉంటాయని గ్లోబల్ పెట్టుబడిదారులకు సంకేతాలు ఇవ్వడం మార్కెట్లో జోష్‌ను మరింత పెంచింది. మధ్యాహ్నం వరకు తీవ్ర ఒడిదుడుకుల మధ్య కొనసాగిన మార్కెట్లకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ తిరిగి 39 వేల మార్కును దాటింది. చివరకు 453.07 పాయింట్లు(1.17 శాతం) ఎగబాకి 39,052.06 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ నిఫ్టీ కూడా మరో 122.35 పాయింట్లు(1.07 శాతం) అధికమై 11,586.35 వద్దకు చేరుకున్నది. గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బ్రెగ్జిట్ ఒప్పందం చివరి దశకు చేరుకున్నదని బ్రిటన్ వ్యాఖ్యలతో ఆ దేశ స్టాక్‌లు ఉవ్వెత్తున ఎగబాకడం దేశీయ సూచీలు పుంజుకోవడానికి దోహద పడ్డాయని మార్కెట్ పండింతలు వెల్లడిస్తున్నారు. పడిపోతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి మరోదఫా ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించడానికి సిద్ధంగా ఉన్నట్లు నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు కూడా మార్కెటు పుంజుకోవడానికి దోహదం చేశాయని జియోజిట్ ఫైనాన్షియల్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. వీటితోపాటు ప్రస్తుత పండుగ సీజన్, వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం, వడ్డీరేట్లు తగ్గుతుండటం మార్కెట్లో సెంటిమెంట్‌ను బలపరిచిందన్నారు.

### భారీగా లాభపడ్డ యెస్ బ్యాంక్

గత కొన్ని నెలలుగా తీవ్రంగా నష్టపోయిన యెస్ బ్యాంక్ షేరు భారీగా లాభపడింది. మార్కెట్ ముగిసే సమయానికి బ్యాంక్ షేరు ధర 15.19 శాతం పుంజుకున్నది. టాటా మోటార్స్ 9.82 శాతం, ఎస్బీఐ 3.73 శాతం, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 5.13 శాతం, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, మారుతిలు లాభాల్లో ముగిశాయి. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, వేదాంతా, పవర్ గ్రిడ్, కొటక్ బ్యాంక్, ఇన్ఫోసిస్, ఓఎన్‌జీసీ, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు ఒక్క శాతం వరకు పడిపోయాయి. రంగాలవారీగా చూస్తే వాహన, బ్యాంకెక్స్, ఫైనాన్స్, ఇంధనం, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, హెల్త్ కేర్, విద్యుత్ రంగ సూచీలు మూడు శాతం వరకు లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు రెండు శాతం వరకు అధికమయ్యాయి. ఎడల్‌వైజ్-కొరా ఒప్పందానికి సీసీఐ అనుమతించడంతో ఎడల్‌వైజ్ ఫైనాన్షియల్ షేర్లు 5 శాతం ఎగబాకాయి. మరోవైపు ఇండియాబుల్స్ హౌజింగ్ ఫైనాన్స్ షేరు 14 శాతం లాభపడింది. కంపెనీ రేటింగ్‌ను మార్చుతున్నట్లు క్రిసిల్ ప్రకటించడం ఇందుకు దోహదం చేసింది. ఇంట్రాడేలో 18 శాతం లాభపడ్డ షేరు చివరకు 14.03 శాతం లాభంతో రూ.197.15 వద్ద ముగిసింది.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
నం. 11/T7/DEE/DSE/SEW/2019-20, తేది: 11-10-2019
NIT నం.23/T7/T2/DEE/DSE/SEW/2019-20, తేది: 11-10-2019, పనిపేరు: వరంగల్ అర్బన్ జిల్లాలో కాజీపేట్-పెద్దమ్మగడ్డ రోడ్ లో కి.మీ. 2/450 వద్ద బాక్స్ కల్వర్ట్ (1V ఆఫ్ 2.0mX1.50m)తో పునర్నిర్మాణం, 2వపిలుపు, అంచనా మొత్తం: రూ.14.00 లక్షలు. పై 1పనికొరకు e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్ళను e-మార్కెట్ ప్లేస్ అనగా www.eprocurement.gov.in నుండి 18-10-2019 నుండి సా.4.00 గం.నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. పై పనులకొరకు టెండర్ల స్వీకరణకు ఆఖరి తేదీ, సమయం: 25-10-2019, మ.3.30 గం.వరకు. తదుపరి వివరాలను www.eprocurement.gov.inలో చూడవచ్చును.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B), రీజనల్ ఆఫీస్, వరంగల్
DIPR RO. No. 1398-DP/CL/Advt/1/2019-20, Dt:17/10/2019

Telangana State Co-operative Marketing Federation Ltd.
5-2-68, 3rd Floor Mahathma Gandhi Markfed Bhavan, Jambagh, Hyderbad-500095.
www.tsmarkfed.com Ph.No: 040-2460 7106, 7288879808, (Mobile)
SHORT TENDER NOTIFICATION
Sealed Tenders are invited from the interested firms for supply of below mentioned material to MARKFED Cotton Ginning & Pressing unit at Rampoor Road, Adilabad.

| S. No | Name of the Materials | Specifications | Approx. Quantity Required | E.M.D (Rs.) |
|---|---|---|---|---|
| 1. | Bales strips (Plastic) | Polyester strappings (width 19.05 mm, thickness 1.27mm, conforming to type II of IS 15559:2004, color green) | 72,000 No's | 1,00,000 |
| 2. | Packing Covers | 100% cotton cloth (20x20 count, 48x40 R&P, 127cm width, weight 122 gms per Sq meters). | 24,000 No's | 10,000 |

The interested firms may purchase the tender schedule from the above address up to 24-10-2019 and last date for submission of tenders is 12:00 Noon 25-10-2019. For further details, interested firms can contact the above address and also visit our website www.tsmarkfed.com. MARKFED reserves the right to cancel any or all the tenders without assigning any reasons.
Sd/-
MANAGING DIRECTOR

తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ (రి), గురుకులం, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్
టెండరు ప్రకటన
Rc.No.B1/Acad/840/2019-20 తేది: 14-10-2019
రాష్ట్ర వ్యాప్తముగా (46) తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2019-20 విద్యా సంవత్సరమునకు సైన్స్ ల్యాబ్ ఎక్విప్‌మెంట్ మరియు విడిభాగాలు సరఫరా చేయుటకు టెండరు ఫారములో తెలిపిన నియమ నిబంధనలపై నమోదిత సంస్థలు/ సరఫరాదారుల నుండి నిర్ణీత నమూనాలో సీల్డు టెండర్లు కోరబడుతున్నవి. టెండరు ఫారాలు/ డాక్యుమెంట్లు సెక్రటరీ, TTWREI సొసైటీ, హైదరాబాద్ పేరున D.D. రూపంలో రూ. 5,000/-ల వాపసురాని చెల్లింపుపై 18-10-2019 నుండి 31-10-2019 న ఉ. 11.00 గం.ల నుండి సా. 5.00 గం.ల మధ్య అన్ని పని రోజులలో TTWREI సొసైటీ (గురుకులం), గురుకుల భవన సముదాయం, DSS భవన్, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్ నుండి పొందవచ్చును. అన్ని వివరాలు టెండరు డాక్యుమెంటులో తెలియజేయబడినవి. టెండరు దాఖలు కొరకు చివరి తేది: 31-10-2019 సా. 5.00 గం.ల వరకు గలదు. తదుపరి వివరాల కొరకు సంప్రదించండి : 9491063511 లేదా http://www.tgtwgurukulam.telangana.gov.in/ని దర్శించండి.
సం/- సెక్రటరీ, TTWREI సొసైటీ (గురుకులం), హైదరాబాద్
DIPR RO No. 432-pp/CL/Advt/1/2019-20, Dt: 17/10/2019

## బంగ్లా ప్రధానికి క్యాబ్ ఆహ్వానం

**రాంచీ:** నవంబర్ 22 నుంచి 26 వరకు భారత్ – బంగ్లాదేశ్ మధ్య కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా రెండో టెస్టు జరుగనుంది. ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు హాజరు కావాలని బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనాకు కోల్‌కతా క్రికెట్ సంఘం(క్యాబ్) ఆహ్వానం పంపింది. భారత ప్రధాని నరేంద్ర మోదీ, బీసీసీఐకి కాబోయే అధ్యక్షుడు సౌరవ్ గంగూలీని ఆహ్వానించినట్టు వార్తలొస్తున్నా.. క్యాబ్ మాత్రం ధ్రువీకరించలేదు. 'బంగ్లాదేశ్ ప్రధానికి ఆహ్వానం పంపిన విషయాన్ని కచ్చితంగా చెప్పగలను. మన ప్రధాని మోదీకి, గంగూలీకి ఆహ్వానం పంపిన విషయంపై వస్తున్న వార్తలను ధ్రువీకరించలేను.. కొట్టేయలేను' అని క్యాబ్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి గురువారం చెప్పారు. నవంబర్‌లో స్వదేశానికి వచ్చే బంగ్లాదేశ్‌తో భారత్ మూడు టీ20లు(3,7,10 తేదీలు), రెండు టెస్టులు (14-18, 22-26) ఆడనుంది.

# మళ్లీ నిరాశే..



### అన్‌సీడెడ్ చేతిలో సింధు ఓటమి..
### ప్రిక్వార్టర్స్‌లోనే నిష్క్రమణ.. సాయి ప్రణీత్, సమీర్‌వర్మ కూడా..
### డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

**డెన్మార్క్ ఓపెన్‌లో భారత్ పోరాటం ముగిసింది. ప్రపంచ చాంపియన్‌గా అవతరించాక వరుసగా మూడో టోర్నీలోనూ భారత స్టార్ షట్లర్ పీవీ సింధు పేలవ ప్రదర్శన కొనసాగించింది. గత రెండు టోర్నీల్లో క్వార్టర్స్‌కు చేరకుండానే వెనుదిరిగిన తెలుగమ్మాయి.. తాజాగా డెన్మార్క్ ఓపెన్‌లో అన్‌సీడెడ్ క్రీడాకారిణిపై ప్రిక్వార్టర్స్‌లోనే ఓటమి చెంది ఇంటిముఖం పట్టింది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో టాప్‌సీడ్ మొమోటా ముందు సాయి ప్రణీత్ నిలువలేకపోగా.. సమీర్ వర్మ కూడా పరాజయం పాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లోనూ సాత్విక్‌సాయిరాజ్ - చిరాగ్‌శెట్టి జోడీ వరుస సెట్లలో పరాజయం చెందగా.. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎన్.సిక్కిరెడ్డి - ప్రణవ్ జెర్రీ చోప్రా చివరి వరకు పోరాడి నిష్క్రమించారు.**

**ఒడెన్స్(డెన్మార్క్) :** ప్రపంచ చాంపియన్‌షిప్ మినహా ఈ ఏడాది మరే టోర్నీలోనూ స్థాయికి తగ్గ ఆట ప్రదర్శించని భారత షట్లర్లు.. మరోసారి నిరాశ పరిచారు. డెన్మార్క్ ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్–750 టోర్నీలో ప్రిక్వార్టర్స్‌లోనే పోరాటాన్ని ముగించారు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లోనే పీవీ సింధు పరాజయం చెందగా, పురుషుల సింగిల్స్‌లో సాయిప్రణీత్, సమీర్ వర్మ ఔటయ్యారు. పురుషుల, మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ఇదే సీన్ రిపీటైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో ఐదో సీడ్ పీవీ సింధు 14–21, 17–21తో 17 ఏండ్ల కొరియా అన్‌సీడెడ్ ప్లేయర్ అన్‌సే యంగ్ చేతిలో పరాజయం పాలైంది. 40నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో ఏ దశలోనూ స్థాయికి తగ్గప్రదర్శన చేయలేకపోయింది. తొలి గేమ్ ప్రారంభంలో కొరియా ప్లేయర్ దూకుడుగా ఆడడంతో సింధు 1–6తో వెనుకబడింది. అయితే వరుస పాయింట్లు సాధించి ప్రత్యర్థి ఆధిక్యాన్ని 7–8కి తగ్గించగలిగింది. మళ్లీ తడబడి గేమ్‌ను 14–21తో కోల్పోయి తెలుగమ్మాయి ఒత్తిడిలో పడింది. రెండో గేమ్‌లో ఓ దశలో 2–4తో వెనుకబడిన సమయంలో వరుసగా ఆరుపాయింట్లు సాధించి 8–4లో ఆధిక్యంలో వచ్చింది. అయితే ఆ తర్వాత ప్రత్యర్థి యంగ్ 9–8తో ముందుకెళ్లింది. ఆ తర్వాత పోరు హోరాహోరీగా సాగగా.. 16–14తో ఆధిక్యంలోకి నిలిచిన సమయంలో సింధు తీవ్రంగా తడబడింది. ప్రత్యర్థికి వరుసగా ఆరుపాయింట్లు సమర్పించింది. చివరి పాయింట్‌ను చేయకుండా యంగ్‌ను ఎక్కువసేపు నిలువరించలేక ఓటమి పాలైంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం తర్వాత బరిలోకి దిగిన చైనా ఓపెన్‌లో రెండో రౌండ్‌లో పరాజయం చెందిన సింధు.. ఆ తర్వాత కొరియా టోర్నీలో తొలి రౌండ్‌లోనే ఘోర ప్రదర్శన చేయగా.. ఇప్పుడు డెన్మార్క్ టోర్నీలోనూ కనీసం క్వార్టర్స్‌కు చేరలేకపోయింది. ఇక మరో స్టార్ ప్లేయర్ సైనా నెహ్వాల్ మంగళవారమే టోర్నీ నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే.

**గాయాలతో సైనా సతమతం**



భారత స్టార్ షట్లర్, ప్రపంచ ఎనిమిదో ర్యాంకర్ సైనా నెహ్వాల్ ఈ ఏడాదిలో గాయాల కారణంగా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నది. జనవరిలో జరిగిన ఇండోనేషియా మాస్టర్స్ టైటిల్ గెలిచిన తర్వాత ఏ టోర్నీలోనూ స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్నది. ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్ ముందు జరిగిన థాయ్‌లాండ్ ఓపెన్‌లో రెండో రౌండ్‌లోనే నిష్క్రమించగా.. అంతకు ముందు జరిగిన రెండో టోర్నీలకు ఫిట్‌నెట్ లేని కారణంగా బరిలోకి దిగలేదు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాస్త రాణించి.. క్వార్టర్స్ చేరి చివరి వరకు పోరాడి ఓడింది. ఆ తర్వాత ఆడిన చైనా ఓపెన్‌లో తొలి రౌండ్‌లోనే పేలవ ప్రదర్శనతో నిష్క్రమించింది. ఇక ఆ తర్వాత జరిగిన కొరియా ఓపెన్‌లో గాయం కారణంగా ప్రారంభ రౌండ్‌లోనే వైదొలగగా.. తాజాగా డెన్మార్క్ ఓపెన్‌లోనూ తొలి రౌండ్‌లోనే అన్‌సీడెడ్ ప్లేయర్ చేతిలోనే మరోసారి ఓడింది.

### ఇలా అయితే కష్టమే

'2020 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణమే నా లక్ష్యం. అంతకుముందు ఆడే ప్రతీ టోర్నీ కీలకమే. విశ్వక్రీడల కోసం ఫిట్‌నెస్‌ను కాపాడుకునేందుకు ఎంచుకున్న టోర్నీల్లోనే ఆడతా' అని సింధు కొద్ది రోజుల క్రితం చెప్పింది. అయితే ప్రపంచ చాంపియన్‌గా నిలిచాక ఆమె ప్రదర్శన తీవ్రంగా పడిపోయింది. మూడు టోర్నీల్లో బరిలోకి దిగితే... చైనా ఓపెన్‌లో రెండో రౌండ్, కొరియా ఓపెన్‌లో తొలి రౌండ్, డెన్మార్క్ ఓపెన్ ప్రిక్వార్టర్స్‌లో అన్‌సీడెడ్ ప్లేయర్లను సైతం ఓడించలేక తీవ్రంగా నిరాశ పరిచింది. ప్రపంచ చాంపియన్‌గా నిలిచి.. ఒలింపిక్స్ స్వర్ణంపైనా ఆశలు రేకెత్తించిన సింధు.. పేలవ ప్రదర్శన చేస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 26 వరకు టోర్నీల్లో ప్రదర్శన బట్టి విశ్వక్రీడల్లో షట్లర్లకు చోటు దక్కనుంది. చాంపియన్‌షిప్ విజయంతో విశ్వక్రీడల్లో సింధు అర్హత సాధించే అవకాశాలు ఎక్కువే ఉన్నా.. టోక్యోలో రాణించాలంటే మాత్రం ముందటి టోర్నీల్లో గెలిచి ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగాల్సి ఉంటుంది. మరి సింధు ముందుగా అనుకున్నట్టు ఎంపిక చేసిన టోర్నీల్లోనే బరిలోకి దిగుతుందా.. మరింత సన్నద్ధత కోసం అన్ని టోర్నీల్లో పోటీకి దిగుతుందా అనేది చూడాలి.

## ప్రణీత్, సమీర్ ఔట్



పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో... ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత భమిడిపాటి సాయి ప్రణీత్ 6–21, 14–21తేడాతో టాప్ సీడ్ కెంటో మొమోటా (జపాన్) చేతిలో ఓటమిపాలయ్యాడు. 33 నిమిషాల్లో ఏ దశలోనూ ప్రత్యర్థిని నిలువరించలేకపోయిన ప్రణీత్.. తొలిగేమ్ ప్రారంభంలోనే ఏకంగా వరుసగా తొమ్మిది పాయింట్లు సమర్పించుకొని 0–9తో నిలిచాడు. మొమోటా స్మాష్‌లు, డ్రాప్ షాట్లకు తెలుగబ్బాయి వద్ద సమాధానం లేకపోయింది. దీంతో తొలిగేమ్‌ను భారీ తేడాతో కోల్పోయాడు. రెండో గేమ్‌లో కాస్త పోటీతో ఓ దశలో 6–6తో నిలిచినా.. ఆ తర్వాత మొమోటా దూకుడుతో సాయి ప్రణీత్ ఓటమి చెందక తప్పలేదు. మరో భారత ప్లేయర్ సమీర్ వర్మ 12–21, 10–21తో ఐదో సీడ్ చెన్ లాంగ్(చైనా) చైనా చేతిలో ఓడిపోయాడు.

పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకీరెడ్డి – చిరాగ్‌శెట్టి 16–21, 15–21తేడాతో ఆరో సీడ్ చైనా జోడీ హన్ చెంగ్ కై – జౌహా డాంగ్ చేతిలో పరాజయం పాలై, నిష్క్రమించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఎన్.సిక్కిరెడ్డి – ప్రణవ్ చోప్రా ద్వయం 24–26, 21–13, 11–21 తేడాతో చాన్ పెంగ్ సూన్ – జోలింగ్ ఇంగ్ (మలేషియా) జంట చేతిలో చివరి వరకు పోరాడి ఓటమి చెందారు. దీంతో డెన్మార్క్ ఓపెన్‌లో భారత పోరు ముగిసింది



## ఆనంద్ 'మైండ్ మాస్టర్'

### డిసెంబర్ 11న విశ్వనాథన్ పుస్తకం విడుదల

**న్యూఢిల్లీ:** చదరంగ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ ఆత్మకథ త్వరలో విడుదల కానుంది. 'మైండ్ మాస్టర్: విజేత చరిత్రలోని గెలుపు పాఠాలు' పేరుతో రానున్న ఈ పుస్తకం డిసెంబర్ 11న అందుబాటులోకి రానుంది. ఆనంద్ సాధించిన అత్యుత్తమ విజయాలు, పరాజయాలు, ఎత్తులు పైఎత్తులకు సంబంధించిన పూర్తి వివరాలు ఇం దులో పొందుపరిచారు. భారత తొలి గ్రాండ్‌మాస్టర్, ఐదు సార్లు ప్రపంచ చాంపియన్ ఆనంద్ ప్రస్తుతం ఇస్లే అంతర్జాతీయ టోర్నీ లో పాల్గొంటున్నాడు. ఈ సందర్భంగా అతడు మాట్లాడుతూ.. 'నా జీవితంలో ఎదురైన మధుర విజయాలు, ఘోర పరాజయాల గురించి చెప్పబోతున్నా. వాటన్నింటినీ లిఖిత రూపంలోకి తేవడం కష్టమైంది. ఇందులో అనేక ఆసక్తికర కథలు, అనుభవాలు ఉన్నాయి' అని అన్నాడు. ఆనంద్‌ను రోల్‌మోడల్‌గా భావించే యువతరానికి ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందని పుస్తక ప్రచురణకర్త పాలోమి చటర్జీ పేర్కొన్నారు.



## ప్రాక్టీస్‌కు కోహ్లీ, రోహిత్ దూరం

**రాంచీ:** ఫ్రీడమ్ సిరీస్‌లో భాగంగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో టెస్టు కోసం చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ చెమటోడ్చుతున్నాడు. వైజాగ్, పుణె టెస్టుల్లో చోటు దక్కించుకోలేకపోయిన కుల్దీప్ రాంచీలో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేశాడు. గురువారం జరిగిన ఆప్షనల్ ప్రాక్టీస్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ దూరంగా ఉంటే.. కుల్దీప్, రహానే, పుజార, మయాంక్, ఇషాంత్ నెట్స్‌లో శ్రమించారు. అంతకు ముందు భారత చీఫ్ కోచ్ రవిశాస్త్రి, బౌలింగ్ కోచ్ భరత్ అరుణ్ పిచ్‌ను పరిశీలించారు. పొడిగా ఉన్న వికెట్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'ఈ వికెట్‌పై స్పిన్నర్లు ప్రభావం చూపగలరు. పొడిగా ఉన్న పిచ్ నుంచి రివర్స్ స్వింగ్ లభించొచ్చు. ఈ మ్యాచ్‌లో స్పిన్నర్లు, రివర్స్‌స్వింగ్ కీలక పాత్ర పోషిస్తాయనుకుంటున్నా' అని దక్షిణాఫ్రికా కెప్టెన్ డుప్లెసిస్ పేర్కొన్నాడు. కెప్టెన్‌తో పాటు బవుమా, డిబ్రుయన్, డికాక్, ముత్తుస్వామి ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు.

## మేరీతో బౌట్ పెట్టండి..

### కేంద్ర క్రీడా మంత్రి కిరణ్‌కు నిఖత్ జరీన్ లేఖ



**న్యూఢిల్లీ:** తెలంగాణ యువ బాక్సర్ నిఖత్ జరీన్, స్టార్ బాక్సర్ మేరీకోమ్ మధ్య ఒలింపిక్స్ అర్హత టోర్నీ ఎంపిక చిలికి చిలికి గాలివానలా మారుతున్నది. ఎలాంటి ట్రయల్స్ నిర్వహించకుండా మేరీకోమ్‌ను ఎలా ఎంపిక చేస్తారంటూ నిఖత్ తన నిరసన గళాన్ని వినిపిస్తున్నది. చైనా వేదికగా వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే టోక్యో(2020) ఒలింపిక్స్ అర్హత టోర్నీకి మేరిని ఎంపిక చేయడాన్ని నిరసిస్తూ నిఖత్..కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజుకు గురువారం లేఖ రాసింది. ట్రయల్స్ బౌట్ నిర్వహించి గెలిచిన వారికి అవకాశమివ్వాలంటూ జరీన్ తన లేఖలో పేర్కొంది. ఇటీవలి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించిన మేరీకోమ్‌ను భారత బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్ఐ) నేరుగా అర్హత టోర్నీలో ఆడించేందుకు సిద్ధమైన నేపథ్యంలో నిఖత్...క్రీడా మంత్రికి లేఖ రాసింది. 'పారదర్శకంగా ట్రయల్స్ నిర్వహించడం ద్వారా సత్తాను నిరూపించుకునే అవకాశం లభిస్తుంది. దేశానికి ప్రాతినిధ్యం వహించాలంటే ఒలింపిక్స్ స్వర్ణం గెలిచిన వాళ్లు కూడా తిరిగి పోరాడాల్సి ఉంటుంది. నా యుక్త వయసు నుంచి మేరీకోమ్‌ను ఆదర్శంగా తీసుకుని పెరిగాను. ఆమె లాగా ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే నా ప్రతిభకు న్యాయం చేయండి. ఒలింపిక్స్ అర్హతతో సంబంధం లేకుండా దిగ్గజ మేరీ ట్రయల్స్‌లో బరిలోకి దిగితే బాగుంటుంది. బీఎఫ్ఐ ఆదేశిస్తే.. నిబంధనలకు అనుగుణంగా ట్రయల్స్‌లో మేరీ పాల్గొనాలి' అని నిఖత్ తన లేఖలో రాసుకొచ్చింది.

**బింద్రా మద్దతు:** నిఖత్ జరీన్‌కు స్టార్ షూటర్ అభినవ్ బింద్రా మద్దతుగా నిలిచాడు. 'మేరీకోమ్ అంటే నాకు చాలా గౌరవం. అథ్లెట్‌గా ఎవరైనా నిన్నటి కంటే ఈ రోజు మెరుగని నిరూపించుకోవాల్సి ఉంటుంది. క్రీడల్లో నిన్న అనేది లెక్కలోకి రాదు' అని బింద్రా ట్వీట్ చేశాడు.

## ప్రధాన మంత్రులను అడగండి

### పాక్‌తో ద్వైపాక్షిక సిరీస్‌పై దాదా



**కోల్‌కతా:** బీసీసీఐ కొత్త అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టనున్న టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తొలిసారి పాకిస్థాన్ సిరీస్‌పై పెదవి విప్పాడు. భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలపై తన అభిప్రాయాలు వెల్లడించాడు. చిరకాల ప్రత్యర్థుల మధ్య సిరీస్‌లు కొనసాగాలంటే ఇరు దేశాల ప్రధానుల అనుమతి అవసరమని పేర్కొన్నాడు. పాక్‌తో క్రికెట్ పునరుద్ధరణపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులుగా 'ఈ ప్రశ్న మీరు మోదీజీ, పాక్ ప్రధానమంత్రిని అడగాలి. సిరీస్‌లు జరుగాలంటే ప్రభుత్వ అనుమతి తప్పనిసరి. అంతర్జాతీయ పర్యటనలు అన్నీ ప్రభుత్వ అంగీకారంతోనే సాగుతాయి. అందుకే దీనికి నేను సమాధానం చెప్పలేను' అని దాదా అన్నాడు. భారత్, పాక్ మధ్య చివరిసారిగా 2012లో ద్వైపాక్షిక సిరీస్ జరిగింది. అందులో భాగంగా ఇరు జట్లు రెండు టీ20లు, 3 వన్డేలు ఆడాయి. పుల్వామా ఉగ్రదాడి అనంతరం ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించిన విషయం తెలిసిందే.

## దాదా మంచి ఇన్నింగ్స్ ఆడుతాడు

### గంగూలీకి బీసీసీఐ అధ్యక్ష పదవిపై సచిన్ స్పందన



**ముంబై:** భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడిగా సౌరవ్ గంగూలీ మంచి ఇన్నింగ్స్ ఆడుతాడని క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఆశాభావం వ్యక్తంచేశాడు. కెరీర్‌లో ఎన్నో మరుపురాని ఇన్నింగ్స్‌లు ఆడిన బెంగాలీ బాబు బీసీసీఐ ప్రెసిడెంట్‌గాను తనదైన ముద్రవేస్తాడని సచిన్ పేర్కొన్నాడు. 'దాదా గురించి నాకు బాగా తెలుసు. ఆటగాడిగా అతడు ఎలాంటి ఇన్నింగ్స్‌లు ఆడాడో.. ఇకపై (బీసీసీఐ అధ్యక్షుడిగా) కూడా అలాగే ముందుకు సాగుతాడనుకుంటున్నా. దేశానికి సేవ చేయడంలో అతడు వెనకడుగు వేయడు. అదే కసి, దూరదృష్టితో నిర్ణయాలు తీసుకుంటాడని ఆశిస్తున్నా' అని మాస్టర్ అన్నాడు. ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో బీసీసీఐ నయా అధ్యక్షుడిపై సచిన్ టెండూల్కర్ తన అభిప్రాయాలను వెల్లడించాడు. ఈ కార్యక్రమంలో మాస్టర్‌తో పాటు బ్రియన్ లారా, బ్రెట్‌లీ, జాంటీరోడ్స్, వీరేంద్ర సెహ్వాగ్ తదితరులు పాల్గొన్నారు.

**ఒకప్పటి విండీస్‌లా: లారా**

ప్రస్తుత టీమ్‌ఇండియా బౌలింగ్ దళం.. ఒకప్పటి వెస్టిండీస్ బృందాన్ని తలపిస్తున్నదని బ్యాటింగ్ దిగ్గజం బ్రియన్ లారా పేర్కొన్నాడు. ఒకప్పుడు ప్రపంచ దేశాలను గడగడలాడించిన కరీబియన్ బౌలర్లకు ప్రస్తుత భారత బౌలర్లు ఏమాత్రం తీసిపోరని కొనియాడాడు. 'టీమ్‌ఇండియా పేసర్లు అదరగొడుతున్నారు. ఇటీవల వెస్టిండీస్ పర్యటనలో వారి ప్రదర్శన అద్భుతం. 80, 90 దశకాల్లో విండీస్ పేస్ బలంగా ఉండేది. ప్రస్తుతం బుమ్రా, షమీ, ఇషాంత్, ఉమేశ్, భువనేశ్వర్‌తో కూడిన భారత్ బౌలింగ్ అందుకు తక్కువేమి కాదు' అని అన్నాడు. రికార్డుల రారాజు విరాట్ కోహ్లీని కూడా లారా ప్రశంసలతో ముంచెత్తాడు. 'అతడు (కోహ్లీ) అత్యుత్తమ కెప్టెన్. ధోనీ నీడ నుంచి త్వరగానే బయటకొచ్చిన విరాట్.. జట్టును ముందుండి నడిపిస్తున్నాడు. ప్రస్తుతం భారత క్రికెట్ సరైన దిశలో పయనిస్తున్నది' అని చెప్పుకొచ్చాడు.



హాకీ టైటిల్‌తో ఆదిలాబాద్ జట్టు

## హాకీ చాంప్ ఆదిలాబాద్

**ఎదులాపురం:** జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన 65వ రాష్ట్రస్థాయి హాకీ టోర్నీలో ఆతిథ్య ఆదిలాబాద్ విజేతగా నిలిచింది. గురువారం జరిగిన ఫైనల్లో ఆదిలాబాద్ 1–0 తేడాతో మహబూబ్‌నగర్‌పై విజయం సాధించి టైటిల్‌ను దక్కించుకుంది. అంతకుముందు జరిగిన వేర్వేరు సెమీఫైనల్ మ్యాచ్‌ల్లో ఆదిలాబాద్ 3–0తో వరంగల్‌పై, మహబూబ్‌నగర్ 3–0తో మెదక్‌పై గెలిచాయి. ఆదిలాబాద్, పాలమూరు మధ్య తుది పోరు నువ్వా నేనా అన్నట్లు సాగింది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో ఆదిలాబాద్‌ను విజయం వరించగా, పాలమూరు రన్నరప్‌గా నిలిచింది. మెదక్‌కు మూడో స్థానం దక్కింది.

## పరుగులు చేయలేక..

### కోపంలో చేయి విరగ్గొట్టుకున్న సఫారీ ఓపెనర్ మార్క్‌రమ్



**రాంచీ:** భారత పర్యటనలో భాగంగా ఇప్పటికే రెండు టెస్టుల్లో ఘోరంగా ఓడి సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికాకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ఓపెనర్ ఎయిడెన్ మార్క్‌రమ్ గాయం కారణంగా చివరి టెస్టుకు అందుబాటులో లేకుండా పోయా డు. పుణె మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో ఔటై పెవిలియన్ చేరిన అనంతరం తన ప్రదర్శనతో అసంతృప్తి చెందిన మార్క్‌రమ్ చేతిని డ్రెస్సింగ్ రూమ్ గోడకు బలంగా గుద్దాడు. దీంతో కుడి చేతి ఎముక విరిగింది. ఈ మేరకు క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్ఏ) గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'రెండో ఇన్నింగ్స్‌లో ఔటై పెవిలియన్ చేరిన మార్క్‌రమ్.. తన ప్రదర్శనతో విసుగు చెంది చేతిని గాయపరుచుకున్నాడు. బలమైన గోడను కొట్టడం ద్వారా అతడి మణికట్టుకు తీవ్ర గాయమైంది' అని అందులో పేర్కొంది.

## హాకీ ప్రపంచకప్ ఆతిథ్యానికి భారత్ బిడ్

**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ప్రపంచకప్ (2023) ఆతిథ్య హక్కులు చేజిక్కించుకునేందుకు భారత్ బలంగా ప్రయత్నిస్తున్నది. ఇప్పటికే మూడుసార్లు ఈ మెగాటోర్నీని నిర్వహించిన భారత్.. మరోసారి ఆతిథ్యమిచ్చేందుకు బిడ్ వేసింది. 2023 జనవరి 13 నుంచి 29 మధ్య ప్రపంచకప్ నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హాకీ ఇండియా (హెచ్ఐ).. అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్)కు నివేదిక అందజేసింది. భారత్‌తో పాటు బెల్జియం, మలేషియా కూడా మెగాటోర్నీ ఆతిథ్య హక్కుల కోసం పోటీపడుతున్నాయి. అయితే ఆ రెండు దేశాలు 2022 జూలైలో టోర్నీని నిర్వహించేందుకు ముందుకొచ్చాయి. మహిళల ప్రపంచకప్ ఆతిథ్యానికి జర్మనీ, స్పెయిన్, నెదర్లాండ్స్, మలేషియా, న్యూజిలాండ్ ఆసక్తి కనబరుస్తున్నాయి. 'మెగాటోర్నీల నిర్వహణకు పోటీ నెలకొనడం ఆనందదాయకం. ఇది క్రీడాభివృద్ధికి దోహదం చేస్తుంది. నాలుగేండ్లకోసారి జరిగే ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చేందుకు ఎనిమిది దేశాల మధ్య పోటీ నెలకొంది' అని ఎఫ్ఐహెచ్ సీఈవో థెర్రీ వైల్ తెలిపారు. నవంబర్ 8న జరిగే ఎఫ్ఐహెచ్ తదుపరి సమావేశంలో చర్చించాక ఆతిథ్య దేశాలను ప్రకటించనున్నారు.

## పంచ్‌లకు పాట్రిక్ బలి




**చికాగో:** బాక్సింగ్ రింగ్‌లో ప్రమాదకర పంచ్‌లు తాళలేక ఈ ఏడాది ఇప్పటికే ముగ్గురు బాక్సర్లు మరణించిన విషయం మరువకముందే.. చికాగోలో మళ్లీ ఇలాంటి ఘటనే జరిగింది. బాక్సింగ్ పోటీలో తలకు తీవ్రగాయాలై నాలుగు రోజులు దవాఖానాలో చికిత్స పొందిన అమెరికన్ యువ బాక్సర్ పాట్రిక్ డే (27) గురువారం మృతి చెందాడు. చార్లెస్ కాన్‌వాల్‌తో గత శనివారం జరిగిన బౌట్‌లో తీవ్ర గాయాలవడంతో పాట్రిక్ బాక్సింగ్ రింగ్‌లోనే కుప్పకూలాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అతడి మెదడుకు శస్త్రచికిత్స చేసినా ఫలితం లేకపోయింది. నాలుగు రోజులు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడని ప్రమోటర్ లూడీ బెల్లా ప్రకటించాడు. అయితే, బౌట్ జరిగిన రెండు రోజుల తర్వాత పాట్రిక్ పరిస్థితి పట్ల కాన్‌వెల్ సామాజిక మాధ్యమాల్లో భావోద్వేగ సందేశం పోస్ట్ చేశాడు. 'ఇలా జరుగుతుందని నేను అనుకోలేదు. కేవలం గెలువాలనే ఆడా. ఆ పోటీని చాలాసార్లు చూశా. నీకే (పాట్రిక్) ఎందుకు ఇలా జరిగిందని ఎన్నోసార్లు మదనపడ్డా' అని కాన్‌వెల్ పేర్కొన్నాడు. అమెచ్యూర్ విభాగంలో పాట్రిక్ డే రెండు జాతీయ టైటిళ్లు, న్యూయార్క్ గోల్డెన్ గ్లావ్ టోర్నమెంట్‌ను కూడా గెలిచాడు. రష్యాకు చెందిన మాక్సిమ్ దాదాషెవ్, ఆల్ఫ్రెడో సంతిల్లాన్ (అర్జెంటీనా), బోరిస్ స్టానీచోవ్ (బల్గేరియా) ఈ ఏడాది బాక్సింగ్ బౌట్‌లలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన విషయం తెలిసిందే.

## బంగ్లా జట్టు ప్రకటన

**ఢాకా:** భారత్‌తో టీ20 సిరీస్ కోసం బంగ్లాదేశ్ జట్టును ప్రకటించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్ కోసం గురువారం 15 మందితో కూడిన జట్టును ఎంపికచేసింది. ఈ టీమ్‌కు స్టార్ ఆల్‌రౌండర్ షకీబుల్ హసన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఇటీవల ముక్కోణపు టోర్నీకి దూరమైన ఓపెనర్ తమీముల్ ఇక్బాల్ జట్టులోకి పునరాగమనం చేయగా.. లెఫ్టార్మ్ స్పిన్నర్ అరాఫత్ సన్నీ, పేసర్ అల్ అమీన్ హుస్సేన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. న్యూఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లాలో నవంబర్ 3న జరిగే తొలి మ్యాచ్‌తో సిరీస్ ప్రారంభం కానుంది. మిగిలిన రెండు మ్యాచ్‌లు రాజ్‌కోట్, నాగ్‌పూర్‌లో జరుగనున్నాయి.



**బంగ్లాదేశ్ జట్టు:** షకీబ్ (కెప్టెన్), తమీమ్, లిటన్ దాస్, సౌమ్యా సర్కార్, నయీమ్, ముష్ఫికర్, మహ్ముదుల్లా, అఫీఫ్, ముసద్దిక్, అమీనుల్ ఇస్లామ్, అరాఫత్, సైఫుద్దీన్, అల్ అమీన్, ముస్తఫిజుర్, షఫివుల్ ఇస్లామ్.

## హజారే టోర్నీలో క్వార్టర్స్ జట్లు ఖరారు

**బెంగళూరు:** దేశవాళీ వన్డే టోర్నీ విజయ్ హజారే ట్రోఫీలో క్వార్టర్ ఫైనలిస్టులు ఖరారయ్యారు. దేశవాళీల్లో బలమైన జట్లుగా ముద్రపడ్డ ముంబై, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీతో పాటు ఛత్తీస్‌గఢ్, గుజరాత్, పంజాబ్, పుదుచ్చేరి నాకౌట్‌కు అర్హత సాధించాయి. ఎలైట్ గ్రూప్ ఏ అండ్ బిలో వరుసగా తొలి 5 స్థానాల్లో నిలిచిన కర్ణాటక, ఢిల్లీ, పంజాబ్, ఛత్తీస్‌గఢ్, ముంబైతో పాటు.. గ్రూప్ సి నుంచి తమిళనాడు, గుజరాత్.. ప్లేట్ గ్రూప్ నుంచి పుదుచ్చేరి క్వార్టర్స్‌లో అడుగుపెట్టాయి. ఈనెల 30, 31న బెంగళూరులో జరిగే క్వార్టర్స్‌లో ఈ ఎనిమిది జట్లు బరిలో దిగనున్నాయి.











నమస్తే తెలంగాణ
# జిందగీ
శుక్రవారం 18 అక్టోబర్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

పండుగలు, పబ్బాలకే పిల్లలను రెడీ చేసే రోజులు పోయాయి. లంగాజాకెట్ల నుంచి ఫ్రాక్, క్రాప్‌టాప్‌లు వచ్చేశాయి. పిల్లలతో ప్రతీరోజునూ పండుగలాగే జరుపుకోవడానికి ఈ కొత్తరకం దుస్తులు బాగా నప్పతాయి. పండుగ, శుభకార్యం, పార్టీ.. సందర్భం ఏదైనా వెస్ట్రన్ స్టైల్ లుక్‌లో అదరగొట్టొచ్చు. మరీ మీ పిల్లల్ని చూడముచ్చటగా చూడాలనుకుంటున్నారా? వెస్ట్రన్ స్టైల్ లో ఉన్న కొన్ని డిజైన్లను మీకు అందిస్తున్నాం.

# చిన్నారులకు ఇండో వెస్ట్రన్‌లుక్







ట్రెండ్ ఫాలో అవ్వాలనుకుంటే దీన్ని ఎంచుకోండి. ఫ్లోరల్ ఆర్గంజా లాంగ్ ఫ్రాక్. లైట్ ఆరెంజ్ నెట్ క్లాత్‌పై సీక్వెన్స్ వర్క్ చేశాం. దీనికి సింగిల్ స్లీవ్ ఇచ్చాం. బ్లూ కలర్ ఆర్గంజా క్లాత్‌ను మూడు లేయర్లతో వేసి స్లీవ్ కుట్టాం. దీంతో ఫ్రాక్ మంచి లుక్ వచ్చింది.

సింపుల్‌గా కనిపించే ఈ లాంగ్‌ఫ్రాక్ గ్రాండ్ లుక్‌నిస్తుంది. పింక్ కలర్ బ్లౌజ్ ఎంచుకున్నాం. దీనికి థ్రెడ్ వర్క్‌తో పాటు మెరిసేందుకు సీక్వెన్స్ వర్క్ ఇచ్చాం. షైనింగ్ రాసిల్క్‌తో ఫ్రిల్స్‌కు బదులుగా పెటల్స్ కుట్టాం. హాఫ్‌షోల్డర్ స్లీవ్స్ హైలెట్. పిస్తాగ్రీన్ ఆర్గంజా క్లాత్‌ను బాటమ్‌గా తీసుకున్నాం. మధ్యలో థ్రెడ్‌వర్క్‌తో డిజైన్ చేశాం. ఆర్గంజా క్లాత్‌నే స్లీవ్స్‌గా ఇచ్చాం.

**సౌజన్యా రెడ్డి,**
ఫ్యాషన్ డిజైనర్
Sreemanvidesigns@Botique
చైతన్యపురి, హైదరాబాద్
Phone no. 8885482564
https:/www.instagram.com/
sreemanvi_designs



నేచులర్ లుక్‌లో కనిపించాలంటే ఈ కాంబినేషన్ ఎంచుకోండి. పీచ్ కలర్ బ్లౌజ్, ఎల్లో కలర్ లెహంగా అదిరిపోతుంది. పీచ్ కలర్ రాసిల్క్ క్లాత్‌పై ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం. దీనికి ప్లైన్ రాసిల్క్‌తోనే ఫ్రిల్స్ ఇచ్చాం. స్లీవ్‌లెస్ హ్యాండ్స్. ఎల్లో కలర్ నెట్ లెహంగాకు అక్కడక్కడా థ్రెడ్ వర్క్, చంకీలతో డిజైన్ చేశాం. బ్లౌజ్‌కు మ్యాచ్ అయ్యేలా టసెల్స్ వేలాడదీశాం.

ట్రెడిషనల్ లుక్ కోసం లంగాజాకెట్ వేయాల్సిందే. పర్పుల్ కలర్‌ను జాకెట్‌గా ఎంచుకున్నాం. నెక్‌కు పర్పుల్ వెల్‌వెట్ ప్లేన్ డిజైన్ చేసి దానిమీద గోల్డ్ కలర్ జర్దోసీ వర్క్ చేశాం. దీనిమీద సీక్వెన్స్ వర్క్‌తో అక్కడక్కడా బుటీస్ ఇచ్చాం. స్లీవ్స్ కూడా నెక్ మాదిరిగానే జర్దోసీ వర్క్ చేశాం. బ్లూ కలర్ రా సిల్క్ లంగా ఇచ్చాం. దీనిపైన థ్రెడ్‌వర్క్‌తో ఫ్లవర్స్‌లా డిజైన్ చేశాం. మధ్యలో గోల్డ్ కలర్ థ్రెడ్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది. గోల్డ్ కలర్ లేస్‌తో ఫినిషింగ్ ఇచ్చాం.

స్టైలిష్‌గా కనిపించేందుకు ఈ క్రాప్‌టాప్ సరైంది. పీచ్ కలర్ రాసిల్క్ బ్లౌజ్. నెట్ క్లాత్‌ను స్లీవ్స్‌గా ఇచ్చాం. చిన్న ఫ్రిల్స్‌తో స్లీవ్స్ కుట్టడంతో లుక్ రెట్టింపైంది. ప్యారెట్ గ్రీన్ నెట్ క్లాత్‌ను లెహంగాగా తీసుకున్నాం. దీనికి అక్కడక్కడా పీచ్, పింక్ కలర్‌తో ఎంబ్రాయిడరీ వర్క్ చేశాం.

## పట్టుదలతోనే ఫలితం!



**చిన్నప్పుడు తండ్రి నవ్వుతూ అన్న మాటలు ఆమెలో బలంగా నాటుకున్నాయి. ఎప్పటికైనా ఆ మాటలు నిజం చేయాలని నిర్ణయించుకుంది. కుటుంబ నేపథ్యం బాగోలేకపోయినా కష్టపడింది. అనుకున్నది సాధించింది.**

షీరత్ ఫాతిమా.. అలహాబాద్ యువతి. తండ్రి ఓ గవర్నమెంట్ ఆఫీస్‌లో అకౌంటెంట్. ఫాతిమా చదువుతున్నప్పుడు తండ్రి ఆమెను అప్పుడప్పుడూ ఆఫీస్‌కు తీసుకెళ్లేవాడు. అక్కడ ఓ 'లాల్ బత్తి' (ఎర్రబుగ్గ) కారు ఉండేది. తండ్రి దాన్ని ఫాతిమాకు చూపిస్తూ 'నువ్వెప్పటికైనా అందులో తిరగాలి' అని నవ్వుతూ అనేవాడు. అది చాలా కష్టమైన పని అనుకుంది ఫాతిమా. ఎందుకంటే కుటుంబ నేపథ్యం అలాంటిది. ఫాతిమాకు నలుగురు తోబుట్టువులు. ఈమెనే పెద్దది. కాబట్టి ఎక్కువ బాధ్యతలుండేవి. ఎలా అయినా ఐఏఎస్‌ఐ అయి, లాల్‌బత్తి కారులో తండ్రికి కనిపించాలనుకుంది ఫాతిమా. ఇటు చదువుకుంటూనే స్థానిక ప్రైమరీ పాఠశాలలో టీచర్‌గా చేరింది. మరోవైపు యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమైంది. తల్లిదండ్రులు కూడా ఇంటి పనులు చెప్పలేదు. తల్లి ఎప్పుడూ ఆహారాన్ని ఫాతిమా గదికి తెచ్చేది. ఫాతిమా పాఠశాలకెళ్లడానికి ఉదయం 6.30కే ఇంటి నుంచి వెళ్లి మూడుగంటలకు తిరిగొచ్చేది. మిగిలిన సమయం అంతా చదువుకొనేది. ప్రిలిమ్స్ కోసం ఇరవై రోజులు పాఠశాలకు సెలవు పెట్టింది. మొదటిసారి రాసిన ప్రిలిమ్స్ కొద్దిపాటి మార్కులతో తప్పింది. ఇది మరింత ఆత్మవిశ్వాసాన్ని ఫాతిమాలో పెంచింది. 2017లో మళ్లీ ప్రిలిమ్స్ రాసింది. అనుకున్నట్టుగానే ఆమె మంచి మార్కులతో మెయిన్స్‌కు అర్హత సాధించింది. మెయిన్స్ రాసిన 20 రోజులకు ఫాతిమాకు పెండ్లయింది. 15 రోజుల తర్వాత సివిల్స్ ఇంటర్వ్యూ కబురు అందుకుంది. భర్త, తల్లిదండ్రులు, అత్తమామలు ప్రోత్సహించారు. ఫాతిమా ఇంటర్వ్యూకు హాజరైంది. మూడ్రోజుల తర్వాత తను ఫలితాలు అందుకుంది. 990 మంది అభ్యర్థులలో ఫాతిమా 810 ర్యాంకు సాధించింది. ఆమె కల నెరవేర్చుకుంది. మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు మళ్లీ పరీక్షలు రాస్తానని ఫాతిమా అంటున్నది.

### వంటింటి చిట్కాలు



- బజ్జీలు చేసేందుకు కట్ చేసిన అరటి, ఆలూ ముక్కలకు కారం, ఉప్పు చేర్చి అరగంట పాటు పక్కన పెట్టుకోవాలి. తర్వాత నూనెలో బజ్జీలు తయారు చేసుకుంటే టేస్ట్ అదిరిపోతుంది.
- మెంతికూర వండేటప్పుడు కాస్త బెల్లం చేర్చుకుంటే.. అందులోని చేదు తొలిగి తీపి రుచి చేకూరుతుంది.
- అరటికాయ తరిగేటప్పుడు చేతుల్లో కాస్త సాల్ట్ వేసుకొని రుద్దితే చేతులు నలుపు తిరగవు.
- రాత్రిపూట మిగిలిన అన్నాన్ని మిక్సీ పట్టించి అందులో శనగపిండి, బియ్యంపిండి, ఉప్పు, కొంచెం మజ్జిగ చేర్చి రుబ్బుకొని వడియాలు పెట్టుకోవచ్చు.

## బతుకు బండికి విదేశాల్లో బాటలు




**ఉపాధి కోసం ఆమె దుబాయ్ వెళ్లింది. కానీ రాను రాను అక్కడి నుంచి ఇంటికి తిరిగివెళ్లాలనే నమ్మకాన్ని కోల్పోయింది. అక్కడే దీర్ఘకాలిక ఉద్యోగాన్ని అన్వేషించింది. ఆమె స్ఫూర్తి చూసిన ఎన్నో కంపెనీలే కాదు దుబాయ్ ప్రభుత్వమే ఇప్పుడు ఆమెను ఉద్యోగానికి ఆహ్వానిస్తున్నది.**

కేరళకు చెందిన సుజ థంకచన్ దుబాయ్‌లో ఇప్పుడు ఓ ఉద్యోగం చేస్తున్నది. నిజానికి అది వట్టి ఉద్యోగమే కాదు. మహిళగా ఆమె స్ఫూర్తికి, పట్టుదలకు గుర్తింపు. సుజది కేరళలోని కొల్లామ్ జిల్లా. నాలుగేండ్ల కింద ఆమె ఉపాధి కోసం దుబాయ్ వెళ్లింది. మహిళల మీద తీవ్ర ఆంక్షలుండే ఆ ప్రాంతంలో సుజ తాత్కాలిక ఉద్యోగంలో చేరింది. పరిస్థితులు మారాయి. కేరళ తిరిగి రావడానికి ఆమెకు నమ్మకం లేదు. ఏదైనా దుబాయ్‌లోనే సాధించాలనుకుంది. భారీ వాహనాలు నడపడం ఆమెకు చిన్నప్పటి నుంచీ అలవాటు. వాళ్ల మామయ్య బస్సులు, ట్యాంకర్లు నడుపుతుండే వాడు. ఆ ప్రభావం ఆమెపై పడింది. ఎప్పటికైనా ఆమె అలాంటి వాహనాలను నడపాలనుకుంది. కేరళలోనే తొలుత కొంచెం నేర్చుకుంది. దుబాయ్ వెళ్లిన తర్వాత తెలిసిన మిత్రుని ద్వారా ఓ ప్రైవేట్ స్కూల్ బస్సులో సహాయకురాలిగా చేరింది. పిల్లలకు సాయం, బస్సు శుభ్రత, స్కూల్‌లో చిన్న చిన్న పనులు అన్నీ చేసేది. దీంతో యాజమాన్యం సుజను చాలా నమ్మింది.అలా మెల్లిగా ఆమె డ్రైవింగ్ వైపు అడుగులేసింది. శిక్షణ తీసుకుంది. డ్రైవింగ్ లైసెన్స్ కోసం అక్కడ దరఖాస్తు చేసుకుంది. హెవీ వెహికిల్ లైసెన్స్ పొందాలంటే కఠినమైన శిక్షణ ఎదుర్కోవాలి. అవ్వన్నీ చేసింది సుజ. కానీ డ్రైవింగ్ టెస్టులో నాలుగైదు సార్లు విఫలమైంది. వాటినే అనుభవాలుగా మల్చుకొని చివరకు దుబాయ్ డ్రైవింగ్ లైసెన్స్‌ను పొందింది. భారీ వాహన లైసెన్స్ పొందిన భారతీయమహిళగా అక్కడ గుర్తింపు పొందింది. ఈమె గురించి విన్న ప్రైవేట్ ట్రావెల్స్, పాఠశాలలు ఉద్యోగాన్ని అందించేందుకు ముందుకు వచ్చాయి. చివరికి అక్కడి ప్రభుత్వం కూడా ఉద్యోగానికి ఆహ్వానించింది. కానీ ఈమె మాత్రం మొదట్లో తనకు అవకాశం ఇచ్చిన పాఠశాల బస్సులకే డ్రైవర్‌గా పని చేస్తానని నిర్ణయించుకుంది.

## వాటిని శుభ్రపరచండిలా!



**టాయిలెట్ చెత్తా చెదారాలతో మూసుకుపోయిందా? కొన్ని చిట్కాలతో మూసుకున్న డ్రైన్, టాయిలెట్‌ను ఇలా శుభ్రపరుచుకోవచ్చు.**

**బేకింగ్ సోడా, ఉప్పు :** ఈ రెండింటి మిశ్రమాన్ని మూసుకున్న డ్రైన్, టాయిలెట్స్‌లో పోయాలి. దీంతో బుడగలు రావడం మొదలవుతుంది. అడ్డుగా ఉండే వ్యర్థాన్ని గొట్టంలోకి వెళ్లేలా ప్లంగర్ టూల్‌తో నెట్టాలి.

**డిటర్జెంట్ :** డ్రైన్, టాయిలెట్స్ శుభ్రంగా తెరుచుకొని ఉండకపోతే డిటర్జెంట్ నీటిని పోయాలి. ఇది పాడిగా ఉన్న చెత్తను తడిగా మారుస్తుంది. తర్వాత ప్లంగర్‌తో చెత్తను నెట్టడం వల్ల టాయిలెట్లో అడ్డుకున్న చెత్త తొలుగుతుంది.

**వేడినీటితో :** బాగా వేడిగా ఉన్న నీటిని నెమ్మదిగా పోయాలి. దీని వల్ల టాయిలెట్లో చెత్తనె మ్మదిగా క్లియర్ అవుతుంది.

**వెనిగర్, నిమ్మరసం :** ఈ రెండింటికీ ఆమ్ల సంబంధమైన గుణాలు ఉంటాయి. ఈ మిశ్రమం చెత్తను, మురికిని సులువుగా తొలగిస్తుంది.

**బ్లీచింగ్ పౌడర్ :** టాయిలెట్స్ అందంగా పరిశుభ్రంగా కనిపించాలనుకుంటే.. బ్లీచింగ్ పౌడర్‌ను తప్పక ఉపయోగించాలి. ఇది సమస్యకు చక్కని పరిష్కారాన్నిస్తుంది.

## పాప పుట్టగానే వాంతులు..ప రిష్కారం ఏంటి?



అడుగండి చెబుతా

**మా చెల్లెలికి పాప పుట్టింది. అయితే పుట్టిన వెంటనే పసుపు, ఆకుపచ్చ రంగులో వాం తులు కావడం మొదలయ్యాయి. ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్ లాంటి పరీక్షలు చేసి పేగు బ్లాక్ అయిందని చెప్పారు డాక్టర్లు. ఒకట్రెండు రోజుల్లో వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. ఇలా పేగు ఎందుకు బ్లాక్ అయింది? సర్జరీ చేస్తే సమస్య పోతుందా?**
**- వినోద్,** హైదరాబాద్

పేగులో బ్లాక్స్ ఏర్పడడానికి కారణాలు చాలా ఉంటాయి. కడుపులో పేగులు సాధారణంగా 10 నుంచి 12 వారాల వయసులో తయారవుతాయి. ఇలా పేగు తయారయ్యేటప్పుడే దానిలో బ్లాక్ ఏర్పడొచ్చు. పేగు మడతపడడం వల్ల గానీ, పేగులోకి జరిగే రక్తసరఫరాలో ఇబ్బంది కలిగినా ఇలా బ్లాక్ అవుతుంది. ఆ భాగంలో పేగు కుళ్లిపోయి బ్లాక్ ఏర్పడుతుంది. పేగు మొత్తంలో ఎక్కడైనా ఇలా బ్లాక్ ఏర్పడొచ్చు. పెద్ద పేగులో కన్నా కూడా చిన్న పేగులో ఇలా బ్లాక్ ఏర్పడే అవకాశం ఎక్కువ.

నికోనియమ్ ఇలియస్ అనే సమస్యతో కూడా బ్లాక్ ఏర్పడుతుంది. ఇది సిస్టిక్ ఫైబ్రోసిస్‌కి సంబంధించిన సమస్య. దీనిలో మల పదార్థం గట్టిగా తయారై పేగును బ్లాక్ చేస్తుంది. కొందరిలో మ్యూకస్ మందంగా ఏర్పడుతుంది. కొందరిలో సాల్ట్ చానల్స్ అబ్‌నార్మాలిటీ, మరికొందరిలో క్లోరైడ్ చానల్ అబ్‌నార్మాలిటీ ఉండడం వల్ల మలం చాలా గట్టిగా బరువుగా ఉండి బ్లాక్ ఏర్పడేలా చేస్తుంది. దీనికి కాంట్రాస్ట్ స్టడీ అనే పరీక్ష చేస్తారు. ఈ సమస్యకు ముందుగా మందులే ఇస్తారు. ఎనీమా ఇచ్చి పరిష్కరించే ప్రయత్నం చేస్తారు. అయినా ఫలితం లేకపోతే ఆపరేషన్ చేయాల్సి వస్తుంది. ఇలాంటప్పుడు లాపరోటోమీ ద్వారా బ్లాక్ ఎక్కడుందో తెలుసుకుని మలవిసర్జన సాఫీగా సాగడం కోసం పేగుకు పొట్ట నుంచి ఇంకో దారి చేస్తారు. ఆరు నెలల తర్వాత ఈ కొత్త దారిని మూసివేయవచ్చు.

ఇకపోతే పుట్టేటప్పుడు రక్తసరఫరా సమస్య వల్ల బ్లాక్ ఏర్పడితే ఆ బ్లాక్ వరకు తీసేసి మిగిలిన పేగు భాగాలను తిరిగి అతికిస్తారు. చికిత్స తరువాత చాలావరకు సమస్య పోతుంది. అయితే చిన్నపేగు కనీసం 40 సెం.మీ. ఉండాలి. అలాగైతేనే జీర్ణసమస్యలు రావు. కాని కొందరిలో 15 సెం.మీ. మాత్రమే మిగులుతుంది. ఇలాంటప్పుడు ఐవి ద్వారా టోటల్ పేరెంట్రల్ న్యూట్రిషన్ ఇస్తారు. నెమ్మదిగా సమస్య కుదుటపడుతుంది. అరుదుగా ఎవరో ఒకరిలో చిన్న పేగు ట్రాన్స్‌ప్లాంట్ చేయాల్సిన అవసరం రావొచ్చు.

పేగుకి నరం సమస్య ఉండడం వల్ల కూడా బ్లాక్ ఏర్పడొచ్చు. ఇలాంటప్పుడు ఏర్పడేదాన్ని ఫంక్షనల్ బ్లాక్ అంటారు. ఈ సమస్య ఉన్నప్పుడు సాధారణంగా పుట్టిన మూడో రోజు వరకు పిల్లలు మలవిసర్జన చేయరు. దీన్ని హర్ష్‌ప్రంగ్ డిసీజ్ అంటారు. దీనికి ఎనీమా టెస్ట్ చేస్తారు. కొల్లాస్టమీ లేదా ఎండోరెక్టల్ పుల్‌త్రూ ద్వారా సర్జరీ చేస్తారు. ఆ తరువాత చాలావరకు నార్మల్ అవుతారు.

**డాక్టర్ లావణ్య**
కన్సల్టెంట్
పీడియాట్రిక్ సర్జన్,
పీడియాట్రిక్
యూరాలజిస్ట్
రెయిన్‌బో హాస్పిటల్స్
హైదరాబాద్



నమస్తే తెలంగాణ
# శాస్త్ర
[ కరీంనగర్ ]
శుక్రవారం 18 అక్టోబర్ 2019



శరీర నిర్మాణ శాస్త్రం

## మెదడు శుభ్రత ఇలా!

**అనవసరమైన జ్ఞాపకాలను మన మెదడు శుభ్రపరచుకొనే విధానాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. మనం నిద్రించే వేళ విడుదలయ్యే కొన్ని హార్మోన్ల వల్లే ఇది సంభవిస్తున్నట్టు తేలింది.**

**కారు** పార్కింగ్ స్థలం నుంచి పాత టెలిఫోన్ నంబరు వరకు చాలా విషయాలను చాలామంది అసంకల్పితంగా, ఇంకా ఒక్కోసారి నిద్ర తర్వాత మరిచిపోతుంటారు. ఇదంతా మన మెదడులో ఎలా సాధ్యమవుతుందన్నది శాస్త్రవేత్తలకు బోధపడడం లేదు. ఇంగ్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ హల్ పరిశోధకులు ఈ విషయంలో ఒక స్పష్టతను సాధించారు. వారు ఎలుకలపై జరిపిన పరిశోధనలో 'మెదడులో విడుదలయ్యే హార్మోన్లే' దీనికి మూలమని గుర్తించారు. గుర్తుంచుకోవడం, మరిచిపోవడం అన్నది మెదడులో రెండు దశలుగా జరుగుతున్నట్టు పై పరిశోధకులు అంటున్నారు. ఒక దఫాలో తొలగించుకోవడం, రెండో దఫాలో గుర్తుకు రాకుండా అడ్డుకోవడం. మెదడులోని పిట్యూటరీ గ్రంథి సమీపంలోని హైపోథాలమస్ (hypothalamus) అనే చిన్న ప్రదేశంలో విడుదలయ్యే హార్మోన్ స్రావాలే ఈ శుభ్రత (cleaning) క్రియకు మూలంగా వారు గుర్తించారు. ఇందులో 'మెలాటొనిన్ కాన్సెంట్రేటింగ్ హార్మోన్' (melatonin-concentrating hormone: MCH) న్యూరాన్లు ముఖ్యపాత్ర పోషిస్తున్నట్టు కూడా వారు కనుగొన్నారు.

జంతువిశేషాలు

### నల్లమాంబా పరుగు

నల్లమాంబా (Black Mamba) పాములది మహావేగం. ఇది గంటకు 12.5 మైళ్ల వేగంతో పరుగెత్తుతుంది. దీని బారిన పడ్డామో, అంతే. దానికంటే వేగంగా మనం పరుగెత్త గలిగితేనే బతికి బయటపడతాం. లేకపోతే, అది మనల్ని అందుకొని కాటు వేసిందా, కేవలం 20 నిముషాల్లో విష నిరోధక పదార్థం (anti-venom) తో చికిత్స చేయాల్సి ఉంటుంది. కింగ్‌కోబ్రా తర్వాత రెండో అతిపెద్ద విషపు పాము ఇదే. ఉప సహారా ఆఫ్రికా ప్రాంతానికి చెందినట్లుగా చెప్పే ఈ పాము బారిన పడి ఏటా 20,000 మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నట్టు అంచనా.





### కంగారూల దూకుడు!

కంగారూల దూకుడు తెలిస్తే మనకు ఆశ్చర్యమేస్తుంది. ఇవి ఒకే ఒక్క దఫాలో సుమారు 27 అడుగుల దూరం ఎగిరి గంతేస్తాయి. దీనికిగాను వాటికి ఉండే చిన్న ముందరి కాళ్లు, పొడవాటి, పటిష్ఠమైన తోక బాగా ఉపయోగపడుతాయి. అంత దూరానికి దూకినా పడిపోకుండా వాటితోనే బ్యాలెన్సు చేసుకొంటాయి.

వాతావరణ శాస్త్రం

# మరో ప్రోటాను ప్రళయం?

• వందేండ్లలో రానున్న సౌరతుపాను • సాంకేతికతల విధ్వంసం తప్పదా? • ఆన్‌లైన్ సమాచారానికి విఘాతమా?

**ఆధునిక మానవుడి మేధోసంపదలైన ఎలక్ట్రానిక్, కంప్యూటర్ సాంకేతికతలను సర్వనాశనం చేయగల మరొక 'ప్రోటాను ప్రళయం' (proton storm) ప్రపంచానికి పొంచి ఉన్నదని శాస్త్రవేత్తలు తాజాగా హెచ్చరిస్తున్నారు. సూర్యునిలో ఇలాంటి విధ్వంసకర తుపానులు సాధారణమే అయినా, ఇవి గతంలో అనుకొన్న దానికన్నా మరింత ఎక్కువగా తరచూ సంభవిస్తున్నట్టు వారు ఇటీవల గుర్తించారు. ఈ మేరకు క్రీ.శ. 8, 10, 19 శతాబ్దాలలో మూడు పర్యాయాలు ఇలాంటి భారీ అగ్నివర్షాలు ఇప్పటికే సంభవించాయని, ఇదే క్రమంలో నాలుగోది తలెత్తవచ్చునని వారు పేర్కొన్నారు. ఐతే, ఇది మరెంతో దూరంలో లేదని, వచ్చే వందేండ్లలోనే ఎదురు కావచ్చునని కూడా వారు సూచిస్తున్నారు. ఈ నిర్ధారణ నేపథ్యంలోని విశేషాలే ఇక్కడ చదువండి.**




**సుమారు** 2,600 సంవత్సరాల కిందట సంభవించినట్టుగా భావిస్తున్న ఒక భారీ సౌరతుపానుకు చెందిన శాస్త్రీయ సాక్ష్యాలను ఇటీవల శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇదే రకమైన అంతరిక్ష వాతావరణ దృష్టుటన అంతే భారీ స్థాయిలో ఇప్పుడూ కలుగవచ్చునని వారు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి గడచిన తాజా విపత్తు క్రీ.శ. 1859లో అమెరికాలో వెలుగుచూసింది. ఆ తర్వాతి నుంచీ మానవాళి పూర్తిగా విద్యుచ్ఛక్తిపైనే ఆధారపడుతున్నారు. ఒకవేళ మన కర్మకాలి అంతటి శక్తివంతమైన, భారీ సౌర ప్రళయమే కనుక మళ్లీ వస్తే ప్రపంచవ్యాప్త విధ్వంసం ఇంతా అంతా కాదు. మనిషి వైజ్ఞానిక ప్రగతి విద్యుచ్ఛక్తి దగ్గరే ఆగిపోకుండా, విద్యుత్‌కణం (ఎలక్ట్రానిక్స్)కు విస్తరించి, ఇందులో విప్లవాత్మక అభివృద్ధిని సాధించింది. ఇవాళ కంప్యూటర్, అంతర్జాల (ఇంటర్నెట్) సాంకేతికతలు అనేక దేశాల ప్రజల జీవన విధానానికి అత్యవసరమైనాయి. ఆర్థిక రంగం సైతం వీటిపైనే ఆధారపడి ఉన్నది. అనేక యాంత్రిక వ్యవస్థలు రోదసిలో భూమిచుట్టూ తిరుగాడుతున్న కృత్రిమ ఉపగ్రహాలపైనే ఆధారపడి పనిచేస్తున్నాయి. సూర్యుడు ప్రకోపించకూడదనే కోరుకొందాం. కానీ, కాలం ఎవరి చేతిలోనూ లేదు.

అంతరిక్షంలో ఏం జరుగుతున్నదీ ఖచ్చితంగా తెలుసుకొనే పరిస్థితి, అంతటి అద్భుత సాంకేతికతలను మానవులు ఇంకా సమకూర్చుకోలేదు. భూమిపైన వాతావరణమే మనకిప్పటికీ పెద్ద మిస్టరీగా ఉంటే, ఇక అంతరిక్షంలోని గ్రహాంతరాలలో, సూర్యుని ప్రభావిత శక్తుల నడుమ వాతావరణం అంచనాకైనా అందదు. ఈ నేపథ్యంలోనే స్వీడన్‌లోని పరిశోధకులకు గత సౌరతుపానులకు చెందిన బలమైన సాక్ష్యాధారాలు లభ్యమైనాయి. వీటి ఆధారంగానే సూర్యగోళంలో తరచూ విధ్వంసకర అగ్నిప్రకోపాలు తప్పవని వారు మానవాళిని హెచ్చరిస్తున్నారు. భూమికి పెనువిపత్తులంటూ ఏ గ్రహశకలాలతోనో కాకుండా సొంత కుటుంబ పెద్దయిన సూర్యుని నుంచే రానుందని తెలిశాక వారిలో ఒకింత ఆందోళన మొదలైంది. గతంలో వలె తీవ్రస్థాయి భీకర అగ్నివర్షం (Rain of Terror) పర్యవసానాలు ఊహిస్తేనే వారికి ఒళ్లు జల్లుమంటున్నది. పారదర్శకత కోసమైతేనేం, సౌలభ్యానికైతేనేం చాలావరకు సాంకేతిక వ్యవస్థలన్నీ గత కొన్నేండ్లుగా ఆన్‌లైన్‌లోకే వచ్చేశాయి, ఇంకా వస్తున్నాయి. శాస్త్రవేత్తలు అనుమానిస్తున్నట్టుగా తీవ్రస్థాయి 'సౌర వికిరణ విపత్తు' కనుక సంభవిస్తే భూమిపై ఊహింపశక్యం కాని మహోపద్రవం ఖాయమని ఈ సందర్భంగా వారు హెచ్చరిస్తున్నారు. ఈ విధ్వంసం ఎప్పుడైనా, ఎంతటి స్థాయిలోనైనా జరగవచ్చునని వారంటున్నారు. ప్రస్తుత మన యాంత్రిక, సాంకేతికతలన్నింటికీ తీవ్ర విఘాతం కలుగడమే కాకుండా, బ్యాంకులలో నిక్షిప్తమై ఉన్న ఆర్థిక లావాదేవీల సమాచారమంతా మాయమై పోవడమో (blackouts) లేదా మూతపడి పోవడమో (shutdown) జరగవచ్చునని శాస్త్రవేత్తలు అంటున్నారు.

మన సూర్యునిలోంచి అత్యంత తీవ్ర విద్యుదావేశిత కణాలు (CMEs: Coronal mass ejections) నిరంతరం విడుదలవుతూనే ఉంటాయి. వీటిలోంచి కొన్ని అత్యంత శక్తివంతమైనవి ఉండవచ్చు. అటువంటప్పుడు అవి మన వాతావరణ దుప్పటిని దాటుకొని భూవాతావరణంలోకి వస్తే మాత్రం పెను ప్రమాదమే ఎదురవుతుంది. అప్పుడు భూమిపై జీవ విఘాతం తప్పదు. ఈ రకమైన 'ప్రళయాంతక అగ్నివర్షాన్నే' వారు 'ప్రోటాను తుపాను' (Proton storm) గా పిలుస్తున్నారు. ఇది రోదసి వాతావరణంలోనే సంభవించినా భూమిని చేరితే, మానవజాతికి అత్యంత హానికరమని వారు అంటున్నారు.

అప్పుడు మన 'పవర్ లైన్స్' విస్తృత అగ్నిప్రమాదాలకు లోనుకావచ్చునని వారన్నారు. 2012లో ఒక భారీస్థాయి 'సీఎంఈ' సౌరతుపాను ఎలక్ట్రానిక్స్‌ను నాశనం చేసే ప్రమాదం కేవలం తొమ్మిది రోజులలోనే ప్రాకృతికంగానే తప్పిపోయిందన్న సంగతిని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ దుర్ఘటన 1859 నాటి క్యారింగ్టన్ (Carrington) సంఘటనతో పోల్చదగిందని వారన్నారు. 1855-67 మధ్యకాలంలో సంభవించినట్టుగా చెబుతున్న ఆ భూమ్యయస్కాంత తుపానుకు మూలం శక్తివంతమైన 'సీఎంఈ' విస్ఫోటనమేనని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆనాడు విద్యుత్ స్తంభాలు అంటుకొని, ఆపరేటర్లకు ఎలక్ట్రిక్ షాక్స్ తగిలాయని వారు చెప్పారు. ఈ స్థాయి తీవ్రతే కనుక మళ్లీ వస్తే సర్వవినాశనం తప్పదని కూడా వారు అంటున్నారు.

క్రీ.పూ. 660 ప్రాంతంలో సంభవించినట్టుగా భావిస్తున్న ప్రోటాను తుపానుతో పోల్చినప్పుడు 1859 నాటిది చిన్నదేనని కూడా శాస్త్రవేత్తలు అంటున్నారు. జపాన్‌లోని పౌరాణిక విజ్ఞానంతోపాటు గ్రీన్‌ల్యాండ్ మంచుఫలకల కింద లభ్యమైన శాస్త్రీయ ఆధారాలనుబట్టి వారు ఈ నిర్ధారణకు వచ్చారు. సుమారు 2,679 సంవత్సరాల కిందటి ఆ ఘోర ఉపద్రవాన్ని స్వీడన్‌లోని లండ్ (Lund) యూనివర్సిటీ పరిశోధకులు నిర్ధారించారు. ప్రోటాన్ తుపాను సృష్టించే బెరిలియమ్-10, క్లోరిన్-36, కార్బన్-14 పరమాణువులను మంచుగర్భంలోనే కాకుండా వారు అంతకు ముందే వృక్షవలయాల్లోనూ కనుగొన్నారు. ప్రాచీన కాలంలో సంభవించినట్టుగా భావిస్తున్న ప్రోటాను ప్రళయాలకు శాస్త్రీయ ఆధారాలను వారు ఈ మేరకు గుర్తించారు. క్రీ.శ. 774-775, క్రీ.శ. 993-994 మధ్య కాలాలలోనూ ఈ తరహా విపత్తులు సంభవించినాయనడానికి కావలసిన సాక్ష్యాలను మరికొందరు శాస్త్రవేత్తలు అదే పరిశోధనా పద్ధతిలోనే గుర్తించారు. అయితే, 1956 నాటి ప్రోటాన్ తుపానును ఈ మూడింటి కంటే చిన్నస్థాయిదిగా వారు భావిస్తున్నారు.

**- దోర్బల బాలశేఖరశర్మ**

### ఏం జరుగుతుంది?

*వ్యోమనౌకలు, విమానాల్లోని ఎలక్ట్రానిక్స్ వ్యవస్థలను ప్రోటాను తుపాను సర్వనాశనం చేస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. భూమి అయస్కాంతావరణను ఢీకొన్న వెంటనే భూమిపైకి చేరుకొంటుంది. తర్వాత అది భూమ్యయస్కాంత తుపానుగా మారి, పవర్ గ్రిడ్స్‌ను విధ్వంసం చేస్తుంది. సుమారు వందేండ్లకు ఒకసారి చొప్పున అత్యంత తీవ్రస్థాయి 'సీఎంఈ' సౌరతుపాను భూమిదిశగా వస్తున్నదని, మరో వందేండ్లలో తర్వాతి విపత్తు రావచ్చునని వారు అంటున్నారు. ఐతే, అది ఏ క్షణంలోనైనా సంభవించవచ్చునని, దీనిని మన సాంకేతికతలు గుర్తిస్తాయన్న పూచీ (గ్యారెంటీ) ఏమీ లేదని 'యు.ఎస్. జియాలజికల్ సర్వే' పరిశోధకులు తెలిపారు. 1921లో ఈశాన్య అమెరికా సంయుక్త రాష్ట్రాలను అంధకారంలో ముంచెత్తిన 'న్యూయార్క్ రెయిల్‌రోడ్ స్టార్మ్' తీవ్రతను కూలంకశంగా అధ్యయనం చేసిన తర్వాత వారు ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేశారు. ఆ తరహా వినాశకర విపత్తు సమీప భవిష్యత్తులోనే తిరిగి రావచ్చునని, ఇది అనివార్యమనీ అన్నారు.*

### రక్షణ ఏర్పాట్లు ఎక్కడ?

*సుమారు 3,000 సంవత్సరాల కాలం సూర్యునికి అత్యల్పమే. అక్కడ విస్ఫోటనాలూ సహజమే. అయితే, ఇవి 'మరింత అధికంగా సర్వసాధారణమని' ఇప్పుడు శాస్త్రవేత్తలు గుర్తించడమే విశేషం. ఏ విస్ఫోటనం, ఎంత పరిమాణంలో, ఎంత శక్తివంతంగా సంభవిస్తుందన్నది తెలుసుకోవడానికి మరింత లోతైన, ఖచ్చితమైన పరిశోధనలు అవసరం. అవి మానవ నాగరికతలపై ఏ మేరకు ప్రభావం చూపగలవన్నదీ ఇదమిద్ధంగా శాస్త్రవేత్తలకు ప్రస్తుతానికి తెలియదు. ఈ మేరకు రక్షణ ఏర్పాట్లయితే లేనే లేవు. గతంలో ఇంత సాంకేతికత లేదు కాబట్టి, విపత్తుల నష్టాలు ఎక్కువగా లేకపోవచ్చు. కానీ, ఇప్పుడు అలా కాదు. ట్రిలియన్స్ డాలర్ల విలువ చేసే వినాశనాలు తప్పవు. తేరుకొన్నాక, తిరిగి అన్నింటినీ రూపొందించుకోవడం మరో పెద్ద సమస్య కాగలదు. కాబట్టి, కనీసం అలాంటి ప్రళయాలు ఎప్పుడు, ఏ స్థాయిలో సంభవించబోతున్నదీ మనం ముందుగానే తెలుసుకోగలిగితే ఎంతో కొంత నష్టనివారణ చేసుకోగలమని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు.*

వి'జ్ఞానం'



## ప్రజలకు సైన్స్ అందుతున్నదా?

**వరుసగా వాస్తవాలను చెప్పినంత మాత్రాన అది సైన్స్ కాదు. వాటి మధ్యగల పరస్పర సంబంధం చెప్పాలి. వాటికి మనతోగల అనుబంధాన్ని చెప్పాలి. అప్పుడే సైన్స్ మనకు పనికి వచ్చేదిగా కనిపిస్తుంది.**

**'తెలుగు** పాఠకులు సైన్సు చదువుతున్నారా?' అన్నది పెద్ద ప్రశ్న. నిజంగా పాతకాలం నాటి వార్తాపత్రికలను సంపాదించి చూస్తే అందులోకూడా అక్కడక్కడ ఒక సైన్స్ వ్యాసం కనబడుతుంది. ఇవాళటి పత్రికలలో అంతగా సైన్స్ కనిపించకపోవచ్చు. 'తెలుగులో సైన్స్ చదవడం ఎందుకు?' అని మీరు అడగవచ్చు, నేను దానికి జవాబు చెప్పడానికి ప్రయత్నిస్తాను. 'సైన్స్ చదువుతున్నారా' అంటే 'మా పిల్లలు చదువుతున్నారు' అని పెద్దవాళ్లు చాలామంది జవాబు చెప్తారు. పిల్లలు పరీక్షల కోసం సైన్స్ చదువుతారు. ప్రపంచాన్ని అర్థం చేసుకునే రకం సైన్స్ వాళ్లకు చెప్పరు. చెప్పేవాళ్లకుకూడా ఆ దృష్టి లేదు. ఇంతకూ 'సైన్స్ అంటే మన గురించే' అన్న భావన చాలామందికి లేదు.

మనకు సైన్స్ పేరున తెలుస్తున్న విషయాలలోనూ ఈ రకమైన సూచనలు కనిపించవు. కనుకనే, సైన్స్ అంటే ఇదేదో మనకు అవసరం లేని విషయంగా మిగిలిపోతున్నది. మనిషికి తాను మనిషిని అన్న అవగాహన కూడా లేనినాడు, చుట్టుపక్కల పరిస్థితులను పరిశీలించడం మొదలైంది. అవసరం కొద్దీ ఏవో పరికరాలను తయారుచేయడం మొదలుపెట్టాడు. ఈ పద్ధతిలో కొనసాగిన సైన్స్ ఇవాళ అందరికీ అందని స్థాయికి ఎదిగింది. పత్రికల్లో కనిపించే సైన్స్‌లో బోలెడంత సమాచారం ఉంటుంది. అది ఒక రకంగా సామాన్యులకు అర్థం కాదు. ఇంకా అదంతా మనకు అవసరం లేదనిపిస్తుంది. మహా అయితే ఆశ్చర్యకరంగానూ ఉండవచ్చు. అలాగని, మొత్తం సైన్స్ ఆశ్చర్యకరంగా ఉండాలన్న నియమమూ లేదు.

సైన్స్‌లో ఉండేది చాలా మామూలు వాస్తవం. అయితే, అది మనం తెలుసుకున్నందువల్ల ప్రయోజనం వెంటనే కనిపించక పోవచ్చు. సైన్స్ అంటే సత్యాలను తెలుసుకోవడం. ఈ మాట నేనే కాదు. చాలామంది చెబుతూ వస్తున్నారు. తెలుసుకున్న సత్యాలు మన జీవితంలో భాగాలని ముందు మనకు అర్థం కావాలి. ఉదా॥కు సూర్యుడినుంచి మన దగ్గరికి ఉన్న దూరం గురించి మీకు చెబితే ఆ విషయానికి మనకు సంబంధం కనిపించదు. సూర్యుడు అన్నాను. డు ము వు లు ప్రథమా విభక్తి. ఈ లెక్కన సూర్యుడు అంటే మగవాడు. కనుకనే, నా వ్యాసాలలో సూర్యుడి గురించి చెప్పవలసిన చోట సూర్యగోళం అంటాను. సూర్యగోళం నుంచి మన మధ్యన ఉన్న దూరం ప్రభావం మన బతుకుల మీద ఉన్నది. ఆ దూరం అంతే ఉండక పోతే, మన భూగోళం మీద, నీటిఆవిరి, నీరు, మంచు ఒకేసారి దొరికే అవకాశం ఉండేది కాదు. 'ఈ సంగతి ఇప్పటి వరకు ఎవరైనా మనకు చెప్పారా?' అన్నది ప్రశ్న. బడిలో కూడా బహుశా చెప్పకపోతే ఆశ్చర్యం లేదు.

సూర్యుని గురించి మనం ఎన్నో కథలు విన్నాం. సైన్స్‌లో మాత్రం అదే పేరు వాడుతూ మరేవో సంగతులు చెబుతారు. అక్కడ తికమక మొదలవుతుంది. సైన్స్ చెప్పే తీరు చెప్పే వారినిబట్టి మారుతుంది. ఒక రంగంలో పనిచేస్తున్న వారు ఆ రంగానికి గొప్ప పేరు తేవాలని మామూలు విషయాలనుకూడా గొప్పగా చెప్పడానికి ప్రయత్నిస్తారు. సైన్స్ అంటే వాస్తవాల వరుస. వరుసగా వాస్తవాలను చెప్పినంత మాత్రాన అది సైన్స్ కాదు. వాటి మధ్యగల పరస్పర సంబంధం చెప్పాలి. వాటికి మనతోగల అనుబంధాన్ని చెప్పాలి. అప్పుడే సైన్స్ మనకు పనికి వచ్చేదిగా కనిపిస్తుంది. ప్రపంచంలోని సైన్స్ మొత్తం మనకు పనికి రావాలని అనుకుంటే అది అమాయకత్వమే అవుతుంది. కొన్ని విషయాలు అవసరం కనుక తెలుసుకోవాలి. వాటి ఆధారంగా మరెన్నో విషయాలు తెలుస్తాయి. అవి బహుశా మనకు ప్రయోజనకరంగా ఉంటాయి.

యుద్ధాల కోసం పరిశోధన మొదలు పెట్టి, కళ్ళజోళ్ళు కనుక్కున్నారంటే అది ఆశ్చర్యం కాదు. యుద్ధాల కోసం పరిశోధనలు మొదలు పెట్టి, కీటక నాశన రసాయనాలు అంటే పురుగు మందులు కనుగొన్నారు. సైన్స్ సమాచారం చెప్పే పద్ధతి ఒక రకంగా మంచిదే. అలాగే, సైన్స్ తత్వం గురించి చెప్పిన పద్ధతి మరింత మంచిది. తత్వం గురించి చెప్పాలంటే రాసే వారికి చక్కని అవగాహన ఉండాలి. పరిశోధకులు, శాస్త్రజ్ఞులకు రాయడం చేత కాదు. కనీసం వాళ్ళు అలా అనుకుంటారు. చేతనైన వారు రాయరు. వాళ్లకు రాయడానికి సమయం లేదు. మరి, మంచి సైన్స్ ప్రజలదాకా వచ్చే పద్ధతి ఏమిటి?

(సశేషం)

**- డా॥ కె.బి.గోపాలం,** సెల్: 9849062055

ఎవరేమన్నారు?



**మానవజాతికిసైన్సు(విజ్ఞానశాస్త్రం) ఒక అందమైన బహుమతి. మనం దానినివక్రీకరించకూడదు.**

**- ఏపీజే అబ్దుల్ కలామ్**
**భారత మాజీ రాష్ట్రపతి,ఏరో స్పేస్‌శాస్త్రవేత్త**
**జయంతి: 15 అక్టోబర్**
**జీవితకాలం: 1931-2015**

శాస్త్రీయం

## ఆ స్ఫూర్తికి సలామ్!

**భారతరత్న, మన దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి (అక్టోబర్ 15)ని 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం'గా ఇటీవలె జరుపుకొన్నాం. ఈ సందర్భంగా వారి వ్యక్తిత్వంపై చిన్న ప్రస్తావన.**

**స్వాతంత్ర్యానంతర** ఆధునిక భారతావనిలో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ప్రజానీకాన్ని ప్రభావితులను చేయగలిగిన అతికొద్దిమంది మహానుభావులలో డా॥ ఏపీజే అబ్దుల్ కలామ్ (జీవితకాలం: 1931-2015) ఒకరు. అంతర్జాతీయ స్థాయిలో 'ప్రజల రాష్ట్రపతి'గా పేరెన్నికగన్న వారి జయంతిని 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం' (World Students Day) గా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితి 2010లోనే నిర్ణయించింది. ఈ మేరకు నాటినుంచీ ఈ ప్రత్యేక దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు జరుపుకొంటున్నారు. ప్రత్యేకించి మన దేశంలో వారి జయంతిని 'జాతీయ విద్యార్థుల దినోత్సవం' (National Students Day)గా కూడా పాటిద్దామన్న డిమాండ్‌కూడా ఇటీవల వినబడుతున్నది. దీనిని కేంద్ర ప్రభుత్వం ఎంత త్వరగా ఆచరణలోకి తెస్తే అంత మంచిది. ఇంతేకాదు, ఒక భారతీయుడిగా ఆయన మనకు ఇచ్చిన స్ఫూర్తిని ఎంతవరకు కొనసాగిస్తున్నామన్నది కూడా అందరం ఈ సందర్భంగా ఆలోచించుకోగలగాలి.

మన దేశంలో బాపూజీ తర్వాత అంతటి నిజాయితీ, నిరాడంబరత, శాంతి, మతసామరస్యాలతో కూడిన జీవన విలువలకు కట్టుబడిన వ్యక్తిగా అబ్దుల్ కలామ్ పేరెన్నిక గన్నారు. దేశ అత్యున్నత పురస్కారమైన 'భారతరత్న'ను పొందిన కొద్దిమంది రాష్ట్రపతులలో వీరొకరు. హిందువుల ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామేశ్వరంలో ఒక సాధారణ ముస్లిం కుటుంబంలో జన్మించిన ఆయన కులమతాలకు అతీతంగా సర్వమానవ శ్రేయస్సు కోసం తపించిన తీరు అనిర్వచనీయం. తనకు ముగ్గురు (కన్నతల్లి, ఎమ్మెస్ సుబ్బులక్ష్మి, మదర్ థెరిసా) అమ్మలు అంటే ఎంతో ఇష్టమని చెప్పడం ద్వారానే ఆయనలోని సమున్నత వ్యక్తిత్వం ఆవిష్కారమవుతుంది. వారు జీవించినంత కాలం ప్రపంచానికి ముఖ్యంగా యువతరానికి అనంతమైన స్ఫూర్తిని అందిస్తూనే ఉన్నారు. వారిలోని మానవీయ కోణాన్ని అర్థం చేసుకోవడానికి 'వింగ్స్ ఆఫ్ ఫైర్' (ఒక విజేత ఆత్మకథ) పుస్తకం ఒక్కటి చదివితే సరిపోతుంది.

ఒక సామాన్యుని నుంచి శాస్త్రవేత్తగా అబ్దుల్ కలామ్ ఎదిగి వచ్చిన తీరు అసాధారణం. అంతరిక్ష శాస్త్రవేత్తగా, మన దేశంలోని ప్రతిష్ఠాత్మకమైన విజ్ఞానశాస్త్ర పరిశోధనా సంస్థల (డిఆర్‌డీఓ, ఇస్రో) నిర్వాహకుడుగా, 'భారతీయ క్షిపణి మానవుడు' (Missile Man of India) గానూ.. ఇన్ని రకాలుగా ఆయన సల్పిన కృషి అంతా ఒక ఎత్తయితే, అత్యున్నతమైన భారత రాష్ట్రపతి పదవిని అధిష్టించిన తర్వాత కూడా మానవీయతకే పెద్దపీట వేయడం, మరీ ముఖ్యంగా విద్యార్థులకు పాఠాలు చెప్పడంలోనే అనిర్వచనీయ తృప్తిని పొందగలిగిన వారి ఉదాత్త వ్యక్తిత్వం ఒక్కటీ మరో ఎత్తుగా అభివర్ణించాల్సిందే. ఈ గొప్పతనానికి గుర్తింపుగానే ఐక్యరాజ్యసమితి (ఐరాస) వారి జయంతిని తొమ్మిదేండ్ల కిందట (2010) 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం'గా జరుపుకోవాలని నిర్ణయించిందనడంలో సందేహం లేదు.

విశ్వ విశేషాలు

### మహా నక్షత్రం!



**ప్రస్తుతానికి** శాస్త్రవేత్తలకు తెలిసినంత వరకు, మొత్తం విశ్వంలోనే అతిపెద్ద నక్షత్రం 'యువి స్కూటి' (UY Scuti). మన భూమినుంచి సుమారు 5,219 కాంతి సంవత్సరాల దూరంలో స్క్యూటమ్ (Scutum) నక్షత్ర మండలంలో ఇది నెలకొని ఉంది. దీని వ్యాసార్థం మన సూర్యుని వ్యాసార్థం కన్నా 1,700 రెట్లు అధికం. ఇదొక మహా అరుణ తార. దీని ద్రవ్యరాశి మన సూర్యునికంటే 30 రెట్లు అధికం. ఇంత పెద్దదైనప్పటికీ ఇది మన సాధారణ కంటికి కనిపించదు.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

**తెలంగాణ పోస్టల్ సర్కిల్ పరిధిలో గ్రామీణ్ డాక్ సేవక్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

### నిఫ్ట్‌లో

**న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్) కాంట్రాక్ట్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 30
- **పోస్టులవారీగా ఖాళీలు:** అసిస్టెంట్ డాటాబేస్ అడ్మినిస్ట్రేటర్-1, కంప్యూటర్‌ఇంజినీర్-13, జూనియర్ ఇంజినీర్( సివిల్,ఎలక్ట్రికల్)-16.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా (ఇంజినీరింగ్), బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్ ఉత్తీర్ణతతోపాటు అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్/ టెక్నికల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబరు2 9
- **వెబ్‌సైట్:** https://www.nift.ac.in



### పోస్టల్ శాఖలో 970 ఖాళీలు

- **పోస్టు:** గ్రామీణ్ డాక్ సేవక్ (బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్, డాక్ సేవక్)
- **మొత్తం ఖాళీలు:** 970. వీటిలో జనరల్-439, ఓబీసీ-176, పీహెచ్‌సీ-37, ఎస్సీ-119, ఎస్టీ-85, ఈడబ్ల్యుఎస్-114 పోస్టులు ఉన్నాయి.
- **టీఆర్‌సీఏ:** బీపీఎంకు లెవల్-1కు రూ.12,000/- లెవల్-2 పోస్టులకు రూ.14,500/-
- ఏబీపీఎం/డాక్ సేవక్ లెవల్-1 పోస్టులకు రూ.10,000/-, లెవల్-2 పోస్టులకు రూ.12,000/-
- **వయస్సు:** 2019, అక్టోబర్ 15 నాటికి 18-40 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **విద్యార్హతలు:** పదోతరగతితోపాటు స్థానిక భాష వచ్చి ఉండాలి.
- **ఎంపిక విధానం:** పదోతరగతిలో వచ్చిన మార్కులు/గ్రేడ్‌ల ఆధారంగా చేస్తారు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 14
- **వెబ్‌సైట్:** http://appost.in/gdsonline

### పీజీ డిప్లొమా కోర్సులు

**బెంగళూరులోని నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌పీటీఐ) పీజీ డిప్లొమా నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- **కోర్సు:** పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్
- **కోర్సు కాలవ్యవధి:** 26 వారాలు
- **మొత్తం సీట్లు:** 60
- **అర్హతలు:** ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్&ఎలక్ట్రానిక్స్/ పవర్ ఇంజినీరింగ్‌లో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణత.
- **వయస్సు:** వయో పరిమితి లేదు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబరు 22
- **వెబ్‌సైట్:** http://npti.gov.in

### ఎంఆర్‌పీఎల్‌లో

**మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 233
- **పోస్టుల వివరాలు:** సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్, జూనియర్ ఆఫీసర్-అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్, టెక్నికల్ ట్రెయినీ, అసిస్టెంట్, తదితర పోస్టులు ఉన్నాయి.
- **విభాగాలు:** కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫైనాన్స్, మెటీరియల్స్, హిందీ.
- **అర్హతలు:** సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా/ బీఎస్సీ/ బీఏ/ బీకాం/ బీబీఏ/ బీబీఎం/ బీసీఏ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **ఎంపిక విధానం:** రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్, ఫిజికల్ టెస్ట్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** రూ.100/-
- **చివరితేదీ:** నవంబర్ 9
- **వెబ్‌సైట్:** https://mrpl.co.in




ఢిల్లీ జూలో సింహాన్ని ఆటపట్టిస్తున్న రెహాన్‌ఖాన్.. పోలీసుల అదుపులో ఉన్న దృశ్యం

## తాగిన మైకంలో సింహంతో ఆట!

- త్రుటిలో తప్పిన ప్రమాదం, ఢిల్లీ జూలో ఘటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:** ఢిల్లీ జూలో సింహాలు ఉండే ఎన్‌క్లోజర్‌లోకి ఒక యువకుడు దూకడంతో కలకలం చెలరేగింది. జూ అధికారుల అప్రమత్తతో యువకుడు త్రుటిలో ప్ర మాదం నుంచి తప్పించుకొన్నాడు. గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు బీట్ నంబర్ 17లో ఈ ఘటన జరిగింది. మద్యం మత్తులో ఢిల్లీ జూలో సింహాల ఎన్‌క్లోజర్‌కు ఉన్న మెటల్ గ్రిల్స్ దాటి లోనికి ప్రవేశించిన యువకుడు.. సింహం వైపునకు వెళ్లి దాన్ని ఆటపట్టించే ప్రయత్నంచేశాడు. అయినా సిం హం ఏమీ చేయలేదు. షాక్‌కు గురైన సందర్శకులు పారిపోవాలంటూ అరిచినా యువకుడు పట్టించుకోలేదు. జూలోని అటవీశాఖ సిబ్బంది అప్రమత్తమై సింహానికి మత్తుమందు ఇచ్చి.. యువకుడిని బయటకు తీసుకొచ్చి పోలీసులకు అప్పగించారు. ఎన్‌క్లోజర్‌లోకి దూకిన యువకుడిని బీహార్‌లోని తూర్పు చంపారన్ జిల్లాకు చెందిన రెహాన్‌ఖాన్(28)గా గుర్తించారు. అతడు ఈశాన్య ఢిల్లీలోని సలీంపూర్‌లో నివసిస్తున్నాడని, మానసిక పరిస్థితి సరిగా లేక అలా ప్రవర్తించాడని పోలీసులు చెప్తున్నారు. పటిష్ఠంగా ఉండాల్సిన మెటల్ గ్రిల్స్‌దాటి సింహాల ఎన్‌క్లోజర్‌లోకి వ్యక్తి ప్రవేశించడంపై జూ అధికారులపై విమర్శలు వస్తున్నాయి. 2014లో ఇదే జూలో ఎన్‌క్లోజర్‌లోకి దూకిన ఓ వ్యక్తిని తెల్లపులి చంపేసింది.



పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు పెంచడాన్ని హర్షిస్తూ గురువారం ఆదిలాబాద్ జిల్లా కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విశ్వనాథ్, కౌటాల సర్పంచ్ మౌనిష్, ఉప సర్పంచ్ తిరుపతి, పంచాయతీ కార్మికులు రమణ, శ్రీనివాస్, విలాస్ రవి, మాడవి గణపతి తదితరులు పాల్గొన్నారు. -కౌటాల



## పేదరికం నిర్మూలనకు కట్టుబడ్డాం

- నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ ప్రతిపాదనలు సహకరిస్తాయి
- ట్విట్టర్‌లో పేర్కొన్న పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ



**కోల్‌కతా, అక్టోబర్ 17:** పేదరికం నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెప్పారు. నోబెల్ గ్రహీత అభిజిత్ బెనర్జీ చేసిన ప్రతిపాదనలు పేదలకు సాయం చేయడంలో చాలా ఉపయుక్తంగా ఉంటాయన్నారు. బుధవారం సాయంత్రం అభిజిత్ తల్లి నిర్మలా బెనర్జీ నివాసాన్ని సందర్శించిన మమత కొన్ని ఫొటోలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'బుధవారం సాయంత్రం మన నోబెల్ గ్రహీత తల్లి నివసించే ఇంటికి వెళ్లి చాలా సమయం గడిపాను. పేదరికం నిర్మూలనకు అభిజిత్ వినాయక్ బెనర్జీ చేసిన ప్రతిపాదనలు ఎంతో ఉపయోగపడనున్నాయి. అభిజిత్‌కు నోబెల్ రావడం పట్ల బెంగాల్ ప్రజలంతా ఎంతో గర్విస్తున్నారు' అని మమతాబెనర్జీ ట్వీట్ చేశారు. తమ ప్రభుత్వం నిరుపేదల కోసం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్ కూడా అయిన నిర్మలా బెనర్జీకి మమత వివరించారు. అంతకుముందు అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా ట్వీట్ చేసిన మమతా బెనర్జీ.. తమ ప్రభుత్వం పేదరికం నిర్మూలనకు పనిచేస్తూ.. నిరుద్యోగాన్ని తగ్గించేందుకు, నిరక్షరాస్యతను ఎదుర్కోవడంలో, మానవహక్కులను కాపాడటానికి కట్టుబడి ఉన్నట్టు పేర్కొన్నారు.



పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం ఆదిలాబాద్‌లోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ విష్ణు ఎస్ వారియర్ ఆధ్వర్యంలో 200 మంది పోలీసులు రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని రిమ్స్ దవాఖానలోని రక్తనిలయానికి అందజేశారు.
- ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ

# వారిని చరిత్ర క్షమించదు

- ఆర్టికల్ 370 రద్దుపై హేళనగా మాట్లాడారు
- మీ దేశభక్తితో గుణపాఠం చెప్పండి
- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షాలపై మోదీ ధ్వజం



మహారాష్ట్రలో ఎన్నికల సందర్భంగా గురువారం సతారా జిల్లాలో నిర్వహించిన బహిరంగసభలో బీజేపీ నాయకులు బహూకరించిన కరవాలంతో ప్రధాని మోదీ




**బీడ్, అక్టోబర్ 17:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దుపై హేళనగా మాట్లాడిన వారిని చరిత్ర క్షమించదని ప్రధాని మోదీ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం బీడ్ జిల్లాలోని పర్లీ నియోజకవర్గంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, ఎన్సీపీలపై మండిపడ్డారు. 'ఆర్టికల్ 370 రద్దు ఓ వ్యక్తిని హత్యచేయడం లాంటిదంటూ కొందరు కాంగ్రెస్ నేతలు అన్నారు. ఈ చర్య దేశానికి విపత్తు వంటిదని, కశ్మీర్‌ను వదులుకోవాల్సి వస్తుందంటూ.. ఇలా చాలా మాట్లాడారు. ఆర్టికల్ 370రద్దుపై హేళనగా మాట్లాడిన వారిని చరిత్ర క్షమించదు. కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పే అవకాశం మహారాష్ట్ర తలుపుతట్టింది. మీ దేశభక్తిపై నాకు అపార నమ్మకం ఉన్నది. జాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా మాట్లాడే వారికి తగిన బుద్ధి చెబుతారని తెలుసు' అని మోదీ అన్నారు. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు, ప్రతిపక్షాల స్వార్థ ప్రయోజనాలకు మధ్య జరుగుతున్న పోరాటంగా అసెంబ్లీ ఎన్నికలను ప్రధాని అభివర్ణించారు. మహారాష్ట్రలో ఈసారి కమలం మరింతగా వికసిస్తుందని, ఫలితాలు రికార్డులను బద్దలు కొడతాయని ధీమా వ్యక్తం చేశారు. భారీ జనంతో కూడిన బీజేపీ సభలను చూసి కాంగ్రెస్, ఎన్సీపీ ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయని ప్రధాని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, ఎన్సీపీ ఒకరిపై ఒకరు పోట్లాడుకుంటున్నారని, అందుకే యువ నాయకులు ఆయా పార్టీలను వీడుతున్నారని విమర్శించారు. అలిసిపోయామని ప్రతిపక్షాల సీనియర్లు అంటున్నారని, అలిసిపోయినవారు ప్రజలకు సేవ చేయగలరా? అంటూ కాంగ్రెస్ నేత సుషీల్ షిండే ఇటీవల చేసిన వ్యాఖ్యలకు మోదీ కౌంటర్ ఇచ్చారు. బీజేపీకి చెందిన దివంగత నేతలైన గోపీనాథ్ ముండే, ప్రమోద్ మహాజన్ వంటి ఇద్దరు స్నేహితులను బీడ్ ప్రజలు అందించారని, సీఎం ఫడ్నవీస్, గోపీనాథ్ ముండే కుమార్తె, మంత్రి, పర్లీ అభ్యర్థిని పంకజ్ ముండే వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తున్నారని మోదీ ప్రశంసించారు. కాగా పంకజ్ ముండే తన బంధువైన ఎన్సీపీ నేత ధనుంజయ్ ముండేతో తలపడుతున్నారు. ఈ నెల 21న మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న సంగతి తెలిసిందే.

### వాజపేయి జెంటిల్‌మెన్.. మోదీ కర్కశుడు

ఇద్దరి మధ్య తేడా ఇదే: పవార్



**ముంబై, అక్టోబర్ 17:** మాజీ ప్రధాని వాజపేయి ఏదైన నిర్ణయం తీసుకునే ముందు విమర్శలు రాకుండా జాగ్రత్త పడేవారని, కానీ ప్రధాని మోదీ ఏదైన నిర్ణయం తీసుకుంటే దాన్ని అమలు చేయడానికి కర్కశంగా వ్యవహరిస్తారని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్ వ్యాఖ్యానించారు. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'వాజపేయి సంస్కారవంతుడైన పెద్ద మనిషి. అందరినీ గౌరవించేవారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు అన్ని కోణాల్లో ఆలోచించి విమర్శలు రాకుండా జాగ్రత్త పడేవారు. ఇక ప్రధాని మోదీ విషయానికొస్తే.. మొండి వ్యక్తి. ఏదైనా నిర్ణయాన్నిగానీ, కార్యక్రమాన్నిగానీ అమలు చేసే విషయంలో నిరంకుశంగా వ్యవహరిస్తారు' అని తెలిపారు. వీరిద్దరికి మధ్య ఉన్న తేడా ఇదేనని పేర్కొన్నారు. మహారాష్ట్రకు చెందిన రైతులు, పరిశ్రమల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర సీఎం ఫడ్నవీస్ ఎలాంటి చొరవ తీసుకోలేదని విమర్శించారు. సమర్థవంతంగా పనిచేసే ముఖ్యమంత్రిగా, చేపట్టే కార్యక్రమాల ద్వారా ఫలితాలను రాబట్టే వ్యక్తిగా ఫడ్నవీస్ గుర్తింపు పొందలేకపోయారని ఆరోపించారు. బీజేపీ పాలనపై రాష్ట్రంలోని రైతులంతా అసంతృప్తిగా, ఆగ్రహంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలోని పరిశ్రమలు మూతపడుతున్నాయని, దీంతో చాలా మంది ఉద్యోగాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, పరిశ్రమల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సి ఉన్నా ఆ పని చేయలేదని పవార్ విమర్శించారు.

## భారత్- బంగ్లా సరిహద్దులో కాల్పులు

- భారతజవాన్ మృతి.. మరొకరికి గాయాలు
- మత్స్యకారుల వివాదం నేపథ్యంలో ఘటన

**కోల్‌కతా/ న్యూఢిల్లీ:** భారత్-బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొంది. బంగ్లాదేశ్ సరిహద్దు దళాలు భారత సరిహద్దు భద్రతా దళానికి (బీఎస్‌ఎఫ్) చెందిన బృందంపై గురువారం కాల్పులు జరుపడంతో ఒక జవాన్ మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లోని అంతర్జాతీయ సరిహద్దులో 'ఫ్లాగ్ మీటింగ్' అనంతరం ఈ ఘటన జరిగింది. భారత బలగాలపై బోర్డర్ గార్డ్ బంగ్లాదేశ్ (బీజీబీ) సిబ్బంది కాల్పులు జరుపడాన్ని అహంకార చర్యగా అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనపై బీఎస్‌ఎఫ్ అధిపతి వీకే జోహ్రీ హాట్‌లైన్ ద్వారా బీజీబీ డైరెక్టర్ జనరల్ షఫీనుల్ ఇస్లాంతో మాట్లాడారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపిస్తామని షఫీనుల్ హామీ ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. కాల్పుల్లో మృతిచెందిన జవాన్‌ను ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఫిరోజాబాద్ జిల్లా చమరోలి గ్రామానికి చెందిన విజయ్ భాన్ సింగ్‌గా గుర్తించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. 1990లో ఆయన బీఎస్‌ఎఫ్‌లో చేరారు. భారత్, బంగ్లాదేశ్ మధ్య 4,096 కిలోమీటర్ల సరిహద్దు ఉంది. దశాబ్దాలుగా ఇరుదేశ సైనికుల మధ్య సుహృద్భావ సంబంధాలు ఉన్నాయి. ఇలాంటి కాల్పుల ఉల్లంఘన ఘటన జరుగడం ఇదే తొలిసారి అని, పరిస్థితి అదుపు తప్పకుండా చూసేందుకు చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. తాజా ఘటనపై కేంద్ర హోం శాఖ, విదేశాంగ శాఖ మంత్రులకు బీఎస్‌ఎఫ్ వివరించింది. భారత మత్స్యకారులకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకు బీఎస్‌ఎఫ్ బృందం బీజీబీ సిబ్బంది వద్దకు వెళ్లగా ఏకే 47తో బీజీబీ జవాన్ కాల్పులు జరిపినట్లు తెలిపింది.

## బైక్ నుంచి జారిపడిన ఫిలిప్పీన్ అధ్యక్షుడు

రొడ్రిగో స్వల్పంగా గాయపడినట్లు అధికారుల వెల్లడి



**మనీలా, అక్టోబర్ 17:** ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రొడ్రిగో డ్యూటెర్టే బైక్ నుంచి జారిపడ్డారు. ఈ ఘటనలో ఆయన స్వల్పంగా గాయపడినట్లు అధికారులు తెలిపారు. అయితే అధ్యక్షుడి రోజువారీ కార్యక్రమాల్లో ఎలాంటి మార్పులేదని చెప్పారు. 74 ఏండ్ల రొడ్రిగోకు గాయాలపై భిన్న వార్తలు వెలువడ్డాయి. అధ్యక్షుడికి బైక్ నడపడమంటే సరదా అని, బుధవారం రాత్రి ఆయన ద్విచక్ర వాహనాన్ని నడిపిన అనంతరం నిలిపి ఉంచే క్రమంలో షూ ఊడిపోయిందని, దీంతో బ్యాలెన్స్ తప్పి పడిపోవడంతో స్వల్పంగా గాయపడ్డారని అధికార ప్రతినిధి సాల్వడార్ పనేలో తెలిపారు. అయితే రొడ్రిగో బైక్ నడుపుతుండగా అది జారడంతో పడ్డారని, గాయపడినప్పటికీ క్షేమంగానే ఉన్నారని అధ్యక్షుడి మాజీ అనుచరుడు క్రిస్టోఫర్ బాంగ్ గో చెప్పారు. ఆగస్టు నెలలోనూ రొడ్రిగో బైక్ నడుపుతూ ప్రమాదానికి గురై గాయపడ్డారు. వారం రోజుల పాటు ప్ర జా కార్యక్రమాలకు ఆయన హాజరుకాలేదు. నాడు పలు వదంతులు రాగా, భద్రతా అధికారి మాత్రం అధ్యక్షుడు పెండింగ్ ఫైళ్ల పరిశీలనలో బిజీగా ఉండటం వల్ల బయటకు రాలేదంటూ కప్పిపుచ్చేందుకు ప్రయత్నించారు.

# భూపాలపల్లిలో మరో ఓసీ

- 131.96 మిలియన్ టన్నుల బొగ్గునిల్వలు
- జీవితకాలం 38 ఏండ్లు
- 1196.85 హెక్టార్ల భూమి సేకరణ
- డిసెంబర్‌లో ప్రాజెక్టు ప్రారంభానికి ఏర్పాట్లు
- అనంతరం వెంకటాపూర్‌లో మరో ఓసీ



**జయశంకర్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** భూపాలపల్లి సింగరేణి సిగలో మరో బొగ్గుగని చేరబోతుంది. పారిశ్రామిక ప్రాంతంగా దినదినాభివృద్ధి చెందుతున్న భూపాలపల్లిలో ఇప్పటికే కేటీకే 1, 5,6, 8 ఇంక్లైన్‌లు బొగ్గు ఉత్పత్తి చేస్తున్నాయి. వీటితో పాటు ఓపెన్‌కాస్టు సెక్టార్ 1 ప్రాజెక్టులో బొగ్గునిల్వలు పూర్తి కావడంతో ఆ ఓసీని మూసివేశారు. ప్రస్తుతం ఓపెన్‌కాస్టు సెక్టార్ 2 నుంచి బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నది. వీటికితోడు మరో ఓపెన్‌కాస్టు గనిని ప్రారంభించడానికి సింగరేణి అధికారులు రంగం సిద్ధం చేశారు. గణపురం మండలం మాధవరావుపల్లిలో ఓపెన్‌కాస్టు సెక్టార్-3 ప్రాజెక్టును డిసెంబర్‌లో ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు భూపాలపల్లిలో ఉన్న బొగ్గు గనులు క్రమ క్రమంగా గణపురం, వెంకటాపురం మండలాలకు విస్తరిస్తూ ములుగు కోల్‌బెల్ట్ ఏరియాకు శ్రీకారం చుడుతోంది. ఇక భూపాలపల్లి నుంచి ములుగు , పస్రాను కలుపుతూ మణుగూర్ వరకు కోల్ కారిడార్‌గా మారనుంది.

**131.96 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు**

డిసెంబర్‌లో ప్రారంభం కానున్న కాకతీయ ఖని ఓపెన్‌కాస్ట్ సెక్టార్-3 ప్రాజెక్టులో 131.96 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నిల్వలను 13 సీంల ద్వారా వెలికితీసేందుకు ప్రణాళికలు తయారు చేశారు. ఈ ప్రాజెక్టులో 1బి, 1ఎ1ఎ, 1ఎ, 1, 1ఎ2, 2, 3సి, 3బి, 3ఎ, 3, 4ఎ, 1ఎ4, 4, ఐబి4, 5, ఐబి5 సీంలను గుర్తించారు. ఇందులో 1బి, 1ఎ, 1, 1ఎ2, 2, 3సి, 3బి, 3ఎ, 3, 4ఎ, 4, ఐబి4, 5 సీంల నుంచి బొగ్గు వెలికితీయనున్నారు. 1 ఇన్ 3 గ్రేడియంట్ గల ఈ ఓసీ జీవితకాలలం 38 ఏండ్లుగా అధికారులు నిర్ధారించారు. ఓసీ 3 కోసం 1336.64 హెక్టార్ల భూమి అవసరం ఉండగా, ఇప్పటికే 1196.85 హెక్టార్ల భూమిని స్వాధీనం చేసుకున్నారు. షావెల్ డంపర్ కాంబినేషన్ టెక్నాలజీ ద్వారా 300 మీటర్ల లోతు నుంచి 252 మంది కార్మికులు బొగ్గు ఉత్పత్తి చేయనున్నారు.

**డిసెంబర్‌లో ప్రారంభోత్సవం**

కాకతీయఖని సెక్టార్ 3 ఓపెన్‌కాస్ట్ గనిని డిసెంబర్‌లో ప్రారంభించడానికి అధికారులు ముహూర్తం ఖరారు చేశారు. డిసెంబర్ 11న ప్రారంభించాలని యోచిస్తున్నారు. మాధవరావుపల్లి వద్ద ఓసీ-3 ఏర్పాటు చేస్తుండగా , మాధవరావుపల్లి గ్రామాన్ని వెయ్యి క్వార్టర్ల సమీపంలోకి తరలించి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని వర్తింప చేయనున్నారు. అలాగే బొబ్బలోనిపల్లి, బస్వరాజుపల్లి, గొల్లపల్లి, కొండరాజురెడ్డిపల్లి, జంగుపల్లి, మాధవరావుపల్లి, పరశురాంపల్లి, పెద్దాపూర్, రవినగర్, వెంకటేశ్వర్లపల్లి గ్రామాలను ఓసీ ప్రభావిత గ్రామాలుగా గుర్తించారు. ఈ గ్రామాల్లో సింగరేణ సంస్థ అభివృద్ధి పనులు చేపడుతుంది.

**ఇప్పటికే రోజుకు 5,890 టన్నుల ఉత్పత్తి**

భూపాలపల్లి ఏరియాలో 5,963 మంది సింగరేణి కార్మికులు పనిచేస్తున్నారు. ఏరియాలో కేటీకే 1, 6,5,8, ఓసీ-2 గనుల నుంచి రోజుకు 5890 టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. కేటీకే 1 ఇంక్లైన్‌లో 1104 టన్నులు , కేటీకే 6 లో 679, కేటీకే 5 గనిలో 1061, 8 ఇంక్లైన్‌లో (లాంగ్‌వాల్) 792, ఓసీ-2లో 3333 టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. రోజుకు 8124 టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను 5890 టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. ఓసీ 3 ని ప్రారంభిస్తే రోజుకు 10 వేల టన్నులకు పైగా బొగ్గు ఉత్పత్తి జరిగే అవకాశం ఉంది.

**ములుగు కోల్‌బెల్ట్ ఏరియా**

భూపాలపల్లి కోల్ట్‌బెల్ట్ ఏరియాలో ప్రారంభమైన బొగ్గు గనులు ఇకపై ములుగు ఏరియాకు విస్తరించనున్నాయి. 1988 లో భూపాలపల్లి ఏరియాలో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు బొగ్గు గనులను ప్రారంభించి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేశారు. క్రమక్రమంగా బొగ్గు గనులు విస్తరించి భూపాలపల్లి ఒక పట్టణంగా మారింది. మున్సిపాలిటీ ఏరియాగా, జిల్లా కేంద్రంగా మారగా సమీపంలోనే బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కేంద్రం సైతం ఏర్పడింది. బొగ్గు గనులు భూపాలపల్లి నుండి ములుగు ఏరియాకు విస్తరిస్తున్నాయి. ఇకపై ములుగు కోల్‌బెల్ట్‌గా పిలువనున్నారు. ఓసీ 3 అనంతరం వెంకటాపూర్‌లో ఓపెన్‌కాస్టు గనిని ప్రారంభించాలని అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. వెంకటాపూర్ ఏరియాలో అత్యంత నాణ్యమైన బొగ్గు నిల్వలున్నట్లు గుర్తించి అధికారులు భూ సేకరణ పనిలో నిమగ్నమయ్యారు. ఫీజిబిలిటీ రిపోర్టును తయారు చేస్తున్నారు.

## ప్లే-స్కూల్ నుంచే లింగ సమానత్వం

- కథలు, పాటల ద్వారా చిన్నారులకు వివరించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్‌సీఈఆర్‌టీ సూచన



**న్యూఢిల్లీ, అక్టోబర్ 17:** లింగ వివక్షతకు సంబంధించిన అభిప్రాయాలను చిన్న పిల్లల్లో ప్లే స్కూల్ స్థాయి నుంచే రూపుమాపాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) సూచించింది. ఎదుగుతున్న చిన్నారుల్లో లింగ పక్షపాత ధోరణి అలవడకుండా చూసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. ఇందుకుగాను అవసరమైన విధానాలు, కార్యక్రమాలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలకు సలహానిచ్చింది. ఈ విధానాలతో పాఠశాల విద్యలో గుణాత్మక మార్పులు పెరుగుతాయని ఆకాంక్షించింది. కొత్త మార్గదర్శకాల్లో భాగంగా లింగ సమానత్వానికి సంబంధించిన సిఫారసులను ప్రీ-స్కూల్ విద్యలో ఎన్‌సీఈఆర్‌టీ తీసుకొచ్చింది. బాలురు, బాలికలకు సమానమైన అవకాశాలు కల్పిస్తూ.. ఇరువురి పట్ల సమానమైన శ్రద్ధను, ప్రేమను టీచర్లు కలిగి ఉండాలని అన్ని పాఠశాలలకు సూచించింది. 'లింగ పక్షపాతం లేకుండా అన్ని పాఠశాలలు.. విద్యార్థులందరికీ పుస్తకాలు ఇవ్వాలి. ఆటలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలి. లింగవివక్షతో కూడిన భాషను టీచర్లు ఉపయోగించకూడదు' అని ఎన్‌సీఈఆర్‌టీ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 'వివిధ రంగాల్లో విజేతలుగా నిలిచిన యువతీ, యువకుల గురించి విద్యార్థులకు బోధించాలి. వారి విజయాల్ని కథలు, పాటలు, వివిధ కార్యకలాపాల ద్వారా చిన్నారులకు అర్థమయ్యేలా వివరించాలి. సమస్యలను పరిష్కరించే విధానాల్ని వర్ణించాలి' అని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సున్నితమైన విషయాల్ని ఇంటిదగ్గర కూడా చిన్నారులకు వారివారి తల్లిదండ్రులు తెలియజెప్పేలా చొరవ తీసుకోవాలని పాఠశాలలకు విజ్ఞప్తి చేసింది. ఎన్‌సీఈఆర్‌టీ కేంద్రమానవ వనరుల మంత్రిత్వ(హెచ్చార్డీ) శాఖ కింద పనిచేసే స్వతంత్ర విభాగం.

## అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ సిబ్బందికీ ప్రసూతి చట్టం

- కేరళ ప్రభుత్వ నిర్ణయం
- దేశంలో ఇదే తొలిసారి

**తిరువనంతపురం, అక్టోబర్ 17:** దేశంలోనే తొలిసారిగా అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న టీచర్లు సహా వేలాదిమంది ఉద్యోగులను ప్రసూతి ప్రయోజన చట్టం పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేరళ రాష్ట్రం సిద్ధమైంది. దీంతో ఆ రాష్ట్రంలోని అన్‌ఎయిడెడ్ ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న వేలమంది ఉద్యోగులు వేతనంతో కూడిన 26 వారాల ప్రసూతి సెలవును పొందేందుకు వీలుంటుంది. దీనికితోడు ఆ ఉద్యోగుల వైద్య ఖర్చుల నిమిత్తం ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు రూ.1000 చొప్పున అందజేయాల్సి ఉంటుంది. ప్రసూతి ప్రయోజన చట్టం ద్వారా ఒనగూడే ప్రయోజనాలను అన్‌ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లోని ఉద్యోగులకు కల్పించేందుకు అనుమతించాలని కేరళ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సమ్మతించించడంతో త్వరలో ఇందుకు సబంధించిన నోటిఫికేషన్ జారీకానున్నట్టు కార్మిక శాఖ వర్గాలు తెలిపాయి. దేశంలోని ఓ రాష్ట్ర ప్రభుత్వం అన్‌ఎయిడెడ్ ప్రైవేటు విద్యారంగాన్ని ప్రసూతి ప్రయోజన చట్టం పరిధిలోకి తీసుకురావడం ఇదే తొలిసారని, అన్‌ఎయిడెడ్ రంగంలోని టీచర్లకు కనీస వేతనాలను కల్పించేందుకు కూడా కేరళ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కార్మికశాఖ ఓ ప్రకటనలో వెల్లడించింది.

## ఎరువుల అధిక వినియోగంతో క్షీణిస్తున్న భూసారం

- క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలి
- శాస్త్రవేత్తలు, అధికారులకు వ్యవసాయ వర్సిటీ వీసీ డాక్టర్ ప్రవీణ్‌రావు సూచన



రాజేంద్రనగర్‌లోని పీజేటీఎస్‌ఏయూ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రవీణ్‌రావు

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** దేశంలో 80 శాతం ఎరువులు 40 శాతం జిల్లాలోనే వినియోగమవుతున్నాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ వీ ప్రవీణ్‌రావు వెల్లడించారు. ఎరువులను విపరీత వినియోగిస్తుండటం వల్ల భూసారం క్షీణిస్తున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎరువుల వినియోగంపై గురువారం రాజేంద్రనగర్‌లోని పీజేటీఎస్‌ఏయూ ఆడిటోరియంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. కోరమాండల్ ఫెర్టిలైజర్స్ సహకారంతో వ్యవసాయశాఖ, వ్యవసాయ వర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్రం నలుమూలల నుంచి ఎంపిక చేసిన వ్యవసాయశాఖ సిబ్బంది, వర్సిటీకి చెందిన కృషి విజ్ఞాన కేంద్రాలు, డాట్ సెంటర్ల శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. నేలల స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులపై రైతుల్లో పూర్తి అవగాహన కల్పించలేకపోవడం వల్ల ఎరువుల వినియోగం పెరిగిపోతున్నదని ప్రవీణ్‌రావు వివరించారు. ఇంతగా ఎరువులను వాడినప్పటికీ ప్రాంతాలవారీగా ఉత్పత్తి, ఉత్పాదకతలో తేడాలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. నేల స్వభావాలకు అనుగుణంగా అవసరమైన సమయంలో తగిన మోతాదులో ఎరువులను వాడేలా రైతులకు సూచించాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ సిబ్బందిపై ఉన్నదన్నారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని, మెట్టభూముల్లో అంతరపంటల సాగును ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయంలో వస్తున్న ఆధునాతన పరిజ్ఞానాన్ని శాస్త్రవేత్తలు ఎప్పటికప్పుడు అందిపుచ్చుకొని రైతులకి అర్థమయ్యేలా వివరించాలని డాక్టర్ ప్రవీణ్‌రావు సూచించారు. వర్సిటీ విస్తరణ విభాగం సంచాలకుడు డాక్టర్ డీ రాజిరెడ్డి మాట్లాడుతూ.. ప్రధాన పంటల సాగులో సూచించిన మోతాదు కంటే రైతులు రెట్టింపు ఎరువులను వినియోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల సంభవించే దుష్పరిణామాల గురించి అన్నదాతల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన వ్యవసాయ శాఖ సిబ్బందికి, వర్సిటీ శాస్త్రవేత్తలకు సూచించారు. జిల్లాలు, ప్రాంతాలవారీగా నేలలకు అనువైన, అవసరమైన ఎరువుల గురించి రైతాంగానికి సూచించాలని రాజిరెడ్డి అభిప్రాయపడ్డారు. కృషి విజ్ఞాన కేంద్రం, డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు బృందంగా ఏర్పడి యాసంగి సీజన్‌లో ఎరువుల వినియోగంపై మండలస్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాటర్ టెక్నాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ ఉమాదేవి, శాస్త్రవేత్తలు సురేంద్రబాబు, వెంకటరమణ, వ్యవసాయశాఖ జెడీ రాములు, కోరమండల్ ఫెర్టిలైజర్స్ వైస్ ప్రెసిడెంట్ జీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 23 దివాకర్ ట్రావెల్స్ బస్సులు సీజ్

**అమరావతి:** మాజీ ఎంపీ, టీడీపీ సీనియర్ నేత జేసీ దివాకర్‌రెడ్డికి ఏపీ రవాణాశాఖ అధికారులు గట్టి షాక్ ఇచ్చారు. దివాకర్ ట్రావెల్స్‌కు చెందిన 23 బస్సులను ఆర్టీఏ అధికారులు గురువారం సీజ్‌చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న దివాకర్ ట్రావెల్స్ బస్సులపై రవాణాశాఖ కమిషనర్ సీతారామాంజనేయులు, జాయింట్ కమిషనర్ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో అధికారులు పలు చోట్ల ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ఇష్టానుసారంగా టికెట్ ధరలు వసూలు చేస్తున్న 23 బస్సులను అధికారులు గుర్తించి సీజ్‌చేశారు. దివాకర్ ట్రావెల్స్‌కు చెందిన 23 ఇంటర్ స్టేట్ క్యారియర్ బస్సుల పర్మిట్లను కూడా రద్దుచేశారు. నిబంధనలు అతిక్రమించినందుకు పలు కేసులు నమోదు చేశారు. దివాకర్ ట్రావెల్స్‌పై అనేక ఫిర్యాదులు వచ్చాయని, అందులో భాగంగానే తనిఖీలు చేశామని, దీనిపై పూర్తిస్థాయి విచారణ కొనసాగుతున్నదని జాయింట్ కమిషనర్ ప్రసాద్‌రావు తెలిపారు.

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శుక్రవారం 18 అక్టోబర్ 2019



కీర్తి సురేశ్

# పెంగ్విన్ ప్రయోగం

'మహానటి' అద్వితీయ విజయం తర్వాత మహిళా ప్రధాన కథాంశాలు, వైవిధ్యతతో కూడిన కమర్షియల్ సినిమాలకు ప్రాముఖ్యతనిస్తున్నది కీర్తిసురేశ్. తాజాగా ఆమె మరో ప్రయోగానికి సిద్ధమైంది. ద్విభాషా చిత్రంలో గర్భవతి పాత్రలో కనిపించబోతున్నది కీర్తిసురేశ్. ఆమె కథానాయికగా 'పెంగ్విన్' పేరుతో తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. ఈశ్వర్ కార్తిక్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టోన్ బేంచ్ ఫిల్మ్స్ పతాకంపై దర్శకుడు కార్తిక్‌సుబ్బరాజ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కీర్తిసురేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమె ఫస్ట్‌లుక్‌ను గురువారం చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో గర్భవతిగా ఆమె కనిపిస్తుంది. చీకటిలో పర్వతాల మధ్య ముఖం కనిపించకుండా వినూత్నంగా ఆమె లుక్‌ను తీర్చిదిద్దారు. ప్రయోగాత్మక పంథాలో ఛాలెంజింగ్‌గా కీర్తిసురేశ్ పాత్ర ఉంటుందని చిత్రబృందం చెబుతున్నది. 'దూకుడుతనం, సాత్వికత. ఆధునికత కలిగిన అపురూపమైన ఓ యువతి కథ ఇది' అంటూ ట్విట్టర్ ద్వారా కీర్తిసురేశ్ తన పాత్ర గురించి పేర్కొన్నది. వచ్చే ఏడాది వేసవిలో ఈ సినిమా విడుదలకానుంది.

# తుపాకిరాముడి ప్రేమకథ




బిత్తిరిసత్తి

'ఎదుటివారి సంతోషం కోరుకునే వాళ్లకంటే ప్రపంచంలో గొప్ప హీరో ఎవరూ ఉండరు. మా తుపాకిరాముడు అలాంటి వాడే. అతడి కథేమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే' అంటున్నారు శాసనసభ్యుడు, నిర్మాత రసమయి బాలకిషన్. రసమయి ఫిల్మ్స్ పతాకంపై ఆయన నిర్మిస్తున్న చిత్రం 'తుపాకిరాముడు'. బిత్తిరిసత్తి కథానాయకుడిగా నటిస్తున్నారు. టి ప్రభాకర్ దర్శకత్వం వహిస్తున్నారు. దీపావళి కానుకగా ఈ నెల 25న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ప్రపంచవ్యాప్తంగా దిల్‌రాజు ఈ సినిమాను విడుదలచేస్తున్నారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ 'సంపూర్ణ హాస్యభరిత ప్రేమకథా చిత్రమిది. తెలంగాణ గ్రామీణ సంస్కృతిలో భాగమైన తుపాకిరాముడి జీవిత గమనానికి చక్కటి దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుంది. వినోదం, ప్రేమకు సందేశాన్ని జోడించి దర్శకుడు ప్రభాకర్ ఈ సినిమాను తెరకెక్కించారు. మన బొట్టు, మన బోనం, మన బతుకమ్మ, మన చెరువు ఔన్నత్యాన్ని ఆవిష్కరిస్తూ తెలంగాణ సంప్రదాయాల్ని అందంగా ఈ సినిమాలో చూపిస్తున్నాం. తుపాకిరాముడిగా బిత్తిరిసత్తి అభినయం, ఆయన పాత్ర పండించే వినోదం ఆకట్టుకుంటాయి. దిల్‌రాజు సినిమా చూసి ప్రశంసించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ నెల 20న చిత్ర ప్రీరిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించనున్నాం. మంచి సినిమా చూశామనే సంతృప్తిని ప్రతి ఒక్కరికి పంచుతుందీ చిత్రం' అని అన్నారు. బిత్తిరిసత్తి, ప్రియ, ఆర్.ఎస్.నందా, గౌతంరాజు, రవి ఆదేష్, అంబటి వెంకన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేందర్‌రెడ్డి, మాటలు: సిద్దార్థ, రవి ఆదేష్, పాటలు: అభినయ శ్రీనివాస్, మిట్టపల్లి సురేందర్, మూలకథ: రసమయి బాలకిషన్.

# విడాకులు తీసుకున్న మంచు మనోజ్



మనోజ్, ప్రణతి

యువహీరో మంచు మనోజ్ తన భార్య ప్రణతి నుంచి విడాకులు తీసుకున్నారు. వైవాహిక బంధంలో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఈ నిర్ణయాన్ని తీసుకోవాల్సి వచ్చిందని మీడియాకు పంపించిన ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రణతితో తాను అందమైన జీవితాన్ని గడిపానని, తమ మధ్య ఎన్నో మధురజ్ఞాపకాలున్నాయని గుర్తుచేసుకున్నారు. స్వతంత్ర భావాలు కలిగిన వ్యక్తులుగా తామిద్దరం పరస్పరం గౌరవ భావంతో వివాహ బంధాన్ని గడిపామన్నారు. అయితే అభిప్రాయభేదాల కారణంగా తామిద్దరం ఎంతో సంఘర్షణకులోనయ్యామని, చివరకు విడిపోవాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. సంక్షుభిత పరిస్థితుల్లో కుటుంబం, స్నేహితులు ఎంతో అండగా నిలిచి మనోస్థైర్యాన్ని కలిగించారన్నారు. సినిమాయే తన ప్రపంచమని, తిరిగి నటుడిగా సత్తా చాటడానికిసిద్ధమవుతున్నానని మనోజ్ పేర్కొన్నారు.

# రమేష్‌ప్రసాద్‌కు సతీవియోగం



విజయలక్ష్మి

ప్రముఖ నిర్మాత, ప్రసాద్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ అక్కినేని రమేష్ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి (77) గురువారం ఉదయం హైదరాబాద్‌లో కన్నుమూశారు. గుండెపోటు కారణంగా ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. రమేష్‌ప్రసాద్, విజయలక్ష్మి దంపతులకు ముగ్గురమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. విజయలక్ష్మి మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో గురువారం సాయంత్రం ఆమెఅ ంత్యక్రియల్ని నిర్వహించారు.



ఓంకార్

# వెంకటేష్‌తో సినిమా చేస్తా!

**'జీనియస్' 'రాజుగారి గది' చిత్రాలతో దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేకతను సృష్టించుకున్నారు ఓంకార్. మరోవైపు బుల్లితెర ప్రయోక్తగా రాణిస్తున్నారు. ఆయన దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'రాజుగారి గది-3' నేడు ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా ఓంకార్ ప్రాతికేయులతో సంభాషించారు. ఆ విశేషాలివి..**

'రాజుగారి గది-2' చిత్రాన్ని నాగార్జున, సమంత వంటి అగ్రతారలతో రూపొందించాను. మూడోభాగానికి కథానుగుణంగా అశ్విన్‌ను కథానాయకుడిగా ఎంచుకున్నాను. అశ్విన్ కొన్ని సినిమాలు చేసినప్పటికీ పూర్తిస్థాయి కథానాయకుడిగా ఎస్టాబ్లిష్ కాలేదు. ఈ సినిమా ఆ లోటును తీర్చుతుందన్నే విశ్వాసంతో ఉన్నాను. 'రాజుగారి గది' సినిమా తీసినప్పుడు హారర్ చిత్రాల రూపకల్పన ఎక్కువగా లేదు. ప్రస్తుతం నెలకు రెండు మూడు హారర్ సినిమాలొస్తున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకొని అన్ని రకాల మాస్ హంగులతో ఈ సినిమాను తెరకెక్కించాను. ఈ కథ మీద నాకు పూర్తి నమ్మకం ఉంది.

**వినోదం మిస్ అయింది...**

'రాజుగారి గది-2' చిత్రానికి మంచి కథ, హృదయాన్ని కదిలించే భావోద్వేగాలు కుదిరినప్పటికీ వినోదం మిస్ అయిందనే భావన కలిగింది. అందుకే మూడో భాగంలో వినోదానికి పెద్దపీట వేశాం. తొలుత 'రాజుగారి గది-2' చిత్రంలో వెంకటేష్‌ను హీరోగా తీసుకోవాలనుకున్నాం. ఆ టైమ్‌లో ఆయన డేట్స్ సర్ధుబాటు కాని కారణంగా నాగార్జునను కథానాయకుడిగా ఎంపిక చేసుకున్నాం. భవిష్యత్తులో వెంకటేష్‌తో రాజుగారి గది సిరీస్‌లో ఏదో ఒక సినిమా చేస్తాను.

**అశ్విన్‌కు మాస్ ఇమేజ్‌నిస్తుంది..**

కథానాయకుడిగా అశ్విన్‌లోని భిన్న పార్శ్వాల్ని ఆవిష్కరించే చిత్రమిది. కేవలం నటనాపరంగానే కాకుండా డ్యాన్సులు, పోరాటాల్లో కూడా అతని ప్రతిభ ఏమిటో ఆవిష్కరిస్తుంది. మాస్ హీరోగా సరికొత్త ఇమేజ్‌ను తీసుకొస్తుందనే పూర్తి విశ్వాసంతో ఉన్నాను. రాజుగారి గది మొదటిభాగానికి మించిన సినిమా చేయాలనే సంకల్పంతో మూడోభాగంలో పరిపూర్ణత కోసం శ్రమించాను. మొదట ఈ చిత్రంలో తమన్నాను కథానాయికగా అనుకున్నాం. డేట్స్‌లేని కారణంగా ఆమె సినిమా నుంచి తప్పుకుంది. ఆ తర్వాత కాజల్, తాప్సీలను కూడా సంప్రదించాం. కానీ కుదరలేదు. ఒకవేళ తమన్నా నటించి ఉంటే ఆమె దృష్టికోణంలో కథ నడిచేది. ఇప్పుడు అశ్విన్‌ను ఎలివేట్ చేస్తూ స్క్రిప్ట్‌లో మార్పులు చేశాం. అవికాగోర్ దెయ్యం పాత్రలో అద్భుతమైన అభినయాన్ని ప్రదర్శించింది. ప్రస్తుతం క్రీడానేపథ్యంలో ఓ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశాను. రాజుగాది గది నాలుగో భాగం సబ్జెక్ట్ కూడా సిద్ధంగా ఉంది.



లతా సంగరాజు

# నేత్ర రహస్యం

లతా సంగరాజు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'నేత్ర'. హుస్సేన్ దర్శకుడు. బి.వి.సుబ్బారెడ్డి నిర్మాత. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను ఇటీవల మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు నరేష్, నటుడు శివబాలాజీ విడుదలచేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాం. నేత్ర ఎవరు? జీవితగమనంలో ఎదురైన చిక్కుముడులను ఆమె ఎలా ఎదుర్కొన్నదనేది ఆకట్టుకుంటుంది. ప్రతి పాత్రకు ప్రాముఖ్యత ఉంటుంది. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. సెన్సార్‌కు సిద్ధమైంది. త్వరలో విడుదల తేదీని వెల్లడిస్తాం' అని తెలిపారు. గీతాసింగ్, భద్రం, కేదార్‌శంకర్, సంధ్యాజనక్ తదితరులు చిత్ర తారాగణం.



సురేష్ కొండేటి, బాబీ, సుమన్‌బాబు, రామసత్యనారాయణ

# రాజమండ్రి రైలెక్కి..

'దర్శకనిర్మాణ వ్యవహారాల్ని ఒక్కరే చేపట్టడం సులభం కాదు. పాటలు, ప్రచార చిత్రాలు చూస్తుంటే సుమన్‌బాబు ఆ బాధ్యతల్ని సమర్ధవంతంగా నిర్వర్తించినట్లు కనిపిస్తున్నది' అని అన్నారు దర్శకుడు బాబీ. శ్రీకాంత్, సాయితేజస్వినీ, కారుణ్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎర్రచీర'. సి.హెచ్.సుమన్ బాబు దర్శకనిర్మాత. ఈ చిత్రంలోని 'రాజమండ్రి రైలెక్కి చెక్కేస్తారు' అనే గీతాన్ని బుధవారం హైదరాబాద్‌లో దర్శకుడు బాబీ విడుదలచేశారు. దర్శకనిర్మాత మాట్లాడుతూ 'మదర్ సెంటిమెంట్‌తో రూపొందుతున్న హారర్ చిత్రమిది. అఘోరగా శ్రీకాంత్ పాత్ర నవ్యరీతిలో సాగుతుంది. డిసెంబర్ 27న సినిమాను విడుదల చేయనున్నాం' అని తెలిపారు. భిన్న ఎమోషన్స్‌తో సాగే కథ ఇదని, ప్రతి పాత్ర ఆసక్తిని పంచుతుందని నటుడు గురురాజ్ చెప్పారు. నవ్యమైన ఇతివృత్తాలతో ఔత్సాహిక దర్శకులు సినిమాలు చేస్తూ విజయాల్ని అందుకుంటున్నారని, సుమన్‌బాబు ఆ కోవలో చేరుతాడనే నమ్మకముందని మాజీ మంత్రి పుష్పలీల అన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి రామసత్యనారాయణ, ప్రమోద్, గోపీ తదితరులుపా ల్గొన్నారు.

# పల్లెటూరి అనుబంధాలు



సుధ, రవితేజ, అన్నపూర్ణ, జమున

సీనియర్ నటి అన్నపూర్ణ, మాస్టర్ రవితేజ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అన్నపూర్ణమ్మగారి మనవడు'. శివనాగేశ్వరరావు (శివనాగు) దర్శకుడు. ఎమ్మెన్నార్ చౌదరి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఏపీలోని వైకుంఠపురం అనే గ్రామంలో చిత్రీకరణ జరిపాం. అన్నపూర్ణమ్మ మనవడిగా మాస్టర్ రవితేజ నటించారు. పల్లెటూరి అనుబంధాలు, ఆత్మీయతలు, ప్రేమల్ని ఆవిష్కరించే చిత్రమిది. ముద్దపప్పు, ఆవకాయ సమ్మేళనంతో భోజనం ఎంత రుచికరంగా ఉంటుందో..ఈ సినిమా కూడా అదే స్థాయిలో ప్రేక్షకుల్ని మెప్పించే విధంగా ఉంటుంది' అన్నారు. నవంబర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. బెనర్జీ, బాలాదిత్య, రఘుబాబు, జీవా, తాగుబోతు రమేష్, రఘు కారుమంచి, సుమన్‌శెట్టి తదితరులు చిత్ర తారాగణం.




